# సావిత్ర్యుపాఖ్యానం

(సరళ వ్యాఖ్యాన సహితం)

వ్యాఖ్యాత

**డా॥ నందూరి రామకృష్ణమాచార్య**

ప్రచురణ

**తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి.**

**2018**

# SAVITRYUPAKHYANAM
with Commentary

*Commentary* by
**Dr. Nanduri Ramakrishnamacharya**

T.T.D. Religious Publications Series No. 1295
© All Rights Reserved

*First Print :* 2018

*Copies :*

*Published by :*
**Sri Anil Kumar Singhal**, I.A.S.
Executive Officer
Tirumala Tirupati Devasthanams
Tirupati

*D.T.P.*
Publications Division
T.T.D., Tirupati.

*Printed at*
Tirumala Tirupati Devasthanams Press
Tirupati - 517 507

## ముందుమాట

భారతీయ సనాతన సంస్కృతీ, సంప్రదాయాలకు వేదాలు, పురాణాలు, ఇతిహాసాలు మూలాధారాలుగా ఖ్యాతిగాంచాయి. వేదాలలోని సారాన్ని రంగరించి భగవాన్ వేదవ్యాసుల వారు మహాభారత ఇతిహాసాన్ని పంచమవేదంగా తీర్చిదిద్దారు. మహాభారతం మన జాతీయ కావ్యం. చతుర్విధ పురుషార్థాల సాధనకు కావలసిన విజ్ఞానమంతా ఇందులో చక్కగా వేదవ్యాసుల వారు ఇమిడ్చారు. మహాభారతం పంచమవేదంగానే కాక భారతీయ విజ్ఞాన శాస్త్ర సర్వస్వంగా ప్రశస్తికెక్కింది.

వేదవ్యాసుల వారు భారత కథను జయేతిహాసంగా తీర్చిదిద్ది తన శిష్యులద్వారా వివిధ లోకాలలో వ్యాపింపజేశారు. వైశంపాయనుడు జనమేజయ మహారాజుకు ఈ కథను వినిపించాడు. అలా వినిపించగా పెంపొందిన కథను భారతం అన్నారు. ఆ తరువాత రోమహర్షణుని కుమారుడైన ఉగ్రశ్రవసుడు నైమిశారణ్యంలో సత్రయాగం చేస్తున్న శౌనకాది మహామునులకు వివరించాడు. మునులడిగిన ప్రశ్నలకు ఉగ్రశ్రవసుడు చెప్పిన కథార్థాలతో కలిపి భారతం **“మహాభారతం”** అయ్యింది.

**“యదిహాస్తి తదన్యత్ర యన్నేహాస్తి న తత్ క్వచిత్”**

ఇందులోఉన్నది ఎక్కడైనా ఉంటుంది. ఇందులో లేనిది ఎక్కడా ఉండదు – అని సూత పౌరాణికులు శౌనకాది మహామునులకు మహాభారత ప్రాశస్త్యాన్ని వివరించాడు.

పంచమవేదంగా, భారతీయ విజ్ఞాన శాస్త్రంగా ఖ్యాతిగొన్న సంస్కృత వ్యాసభారతాన్ని ఆదికవి నన్నయ, కవిబ్రహ్మ తిక్కన, ప్రబంధ పరమేశ్వరుడు ఎఱ్ఱన ఆంధ్రీకరించారు.


తిరుమల తిరుపతి దేవస్థానములు ధర్మప్రచారంలో భాగంగా కవిత్రయ విరచిత శ్రీమదాంధ్ర మహాభారతానికి తెలుగులో సుప్రసిద్ధ పండితులచే చక్కటి వ్యాఖ్యానాన్ని వ్రాయించి 15 సంపుటాలుగా ముద్రించి తెలుగు ప్రజలకు అందించింది. తి.తి.దే. ముద్రించిన కవిత్రయ విరచిత శ్రీమహాభారతం విశేష ప్రజాదరణను పొంది ఇప్పటికే దాదాపు 25,000లకు పైగా ప్రతులు అమ్ముడుపోయాయి.

ఇదివరకు తి.తి.దే. ముద్రించిన కవిత్రయ విరచిత శ్రీమదాంధ్ర మహాభారతంలోని ప్రశస్తమైన నలోపాఖ్యానం, సావిత్రి ఉపాఖ్యానం వంటి ఉపాఖ్యానాలను, సుప్రసిద్ధ ఘట్టాలను, కథలను వ్యాఖ్యానంతోపాటు ప్రత్యేకించి చిన్న చిన్న పుస్తకాలుగా ముద్రిస్తే నేటి తరం సమాజానికి చాలా ఉపయోగకారి అవుతుందని తి.తి.దేవస్థానములు సంకల్పించింది. ఆ సంకల్పానికి ప్రతిరూపమే ఈ భారతోపాఖ్యానాలు గ్రంథమాల. ఈ గ్రంథమాలలో భాగంగా ఉదంకోపాఖ్యానం, గరుడోపాఖ్యానం, యయాతి చరిత్ర, దుష్యంతోపాఖ్యానం, శిశుపాలుని కథ, నలోపాఖ్యానం, ధర్మవ్యాధోపాఖ్యానం, రామోపాఖ్యానం, సావిత్ర్యుపాఖ్యానం, కీచకుని కథ, శ్రీకృష్ణరాయబారం, అంబోపాఖ్యానం, హంసకాకీయోపాఖ్యానం, నాడీజంఘుని కథ, బ్రాహ్మణగీతలు అనే 15 శీర్షికలను ఎంపిక చేసి తెలుగు రాష్ట్రాలలో సుప్రసిద్ధులైన పండితులచే చక్కటి పీఠికలువ్రాయించి, ముద్రించి ప్రజలకు అందుబాటులోనికి తీసుకువస్తున్నది. ఇందులో భాగమే ప్రస్తుతం మీకందిస్తున్న **సావిత్ర్యుపాఖ్యానం.**

భక్తమహాశయులు, సాహితీ ప్రియులు ఈ గ్రంథమును ఆదరిస్తారని మనసార కోరుకుంటూ...

సదా శ్రీవారిసేవలో...

కార్యనిర్వహణాధికారి
తి.తి.దేవస్థానములు, తిరుపతి





# పీఠిక
# ధీరమతి - సావిత్రి

సావిత్ర్యుపాఖ్యానం మహాభారతం అరణ్యపర్వంలో చెప్పబడింది. భారతకథలో ధర్మరతుడైన పాండవులు మాయాద్యూతంలో ఓడిపోయారు. జూదంలో ఏర్పాటు చేసుకున్న నియమం ప్రకారం పన్నెండు సంవత్సరాలు అరణ్యవాసం, ఒక సంవత్సరం అజ్ఞాతవాసం చేయాలి. అలా పాండవులు అరణ్యవాసం చేసిన పన్నెండు సంవత్సరాల కాలంలో జరిగిన విశేషాలే అరణ్యపర్వంలోని విషయాలు.

ఆర్యులు అరణ్యపర్వం భారతీయ ఆధ్యాత్మిక సారస్వతానికి ఆటపట్టు అంటారు. ఈ పర్వంలో ఎన్నో పుణ్యక్షేత్రాల, పుణ్యనదుల మాహాత్మ్యాలు ఉన్నాయి. తపోధనులైన మహర్షుల మహిమోపేత జీవితచరిత్రలున్నాయి. రాజర్షుల విశేషాలున్నాయి. సీత, దమయంతి, సావిత్రి వంటి పతివ్రతామ తల్లుల మహనీయ చరిత్రలు ఈ పర్వంలోనే మనకు వినిపిస్తాయి. పాండవులు ఈ పర్వంలో నలదమయంతుల కథ, సీతారాముల కథ, సావిత్రీసత్యవంతుల కథ వింటారు. వీరితోపాటు మనము ఆ కథలు విని తరిస్తాం. సత్కథా కాలక్షేపం పాండవులు తాము చేస్తూ భావితరాలవారికి కూడా అవకాశం ఇచ్చిన పర్వం అరణ్యపర్వం.

ఆంధ్రసాహిత్యంలో తొలికావ్యగౌరవం పొందింది మహాభారతం. ఆంధ్రమహాభారతం సంస్కృతవ్యాసభారతానికి ఆంధ్రీకరణ. ఆదికవి నన్నయ శ్రీకారం చుట్టిన భారతరచన తిక్కన, ఎఱ్ఱన అనే మరో ఇద్దరు మహాకవులచే కూడా వ్రాయబడింది. ఆంధ్రభారత కవులకు కవిత్రయము అని పేరు. మహాభారత రచనలో తెలుగు భారతవిషయంలో అరణ్యపర్వం గుఱించి తెలుసుకోవలసిన విశేషం ఒకటి ఉంది. నన్నయ అరణ్యపర్వంలో నాల్గవ ఆశ్వాసంలో 142 పద్యాల వరకే వ్రాశాడు. అక్కడనుండి పర్వం చివరివరకు

ఎఱ్ఱాప్రెగడ రచించాడు. నన్నయ శారదరాత్రుల వెన్నెల్లో ఆంధ్ర పాఠకుల్ని వదిలిపెట్టాడు. ఎఱ్ఱన అరుణోదయంతో అరణ్యపర్వ రచనకు శ్రీకారం చుట్టాడు. (స్ఫురదరుణాంశురాగరుచి' అనే పద్యం ఎఱ్ఱన రచనలో మొదటి పద్యం.)

మహాభారతంలో అరణ్యపర్వం – సకలసూరిసభారమ్యంబుగా అంటాడు నన్నయ. పండితులకు, సభాజనులకు రమ్యంగా ఉండే పర్వమని నన్నయ మాట.

ఒకనాడు ధర్మరాజు తమ నివాసానికి వచ్చిన మార్కండేయ మహర్షిని చూసి, "మునీంద్రా! పతిభక్తి తాత్పర్యంబున అఖిలదుఃఖంబుల కోర్చి శుభంబులు పొందిన పుణ్యవతి చరిత్రంబు విన వలతు చెప్పవే" అని అడిగాడు. పతిభక్తివల్ల, అన్ని దుఃఖాలకు ఓర్చి శుభాలు పొందిన ఒక పుణ్యవతి చెప్పమంటే మార్కండేయ మహర్షి పుణ్యవతి సావిత్రి కథ చెప్పాడు. ఇదీ సావిత్రికథకు పూర్వరంగం.

కథలోకి వస్తే మద్రదేశపురాజు అశ్వపతి. పద్దెనిమిది సంవత్సరాలు సావిత్రీదేవిని ఉపాసించాడు. సావిత్రీదేవి ప్రత్యక్షమై వరం కోరుకోమంది. అశ్వపతి కుమారుడు కావాలి అన్నాడు. కానీ సావిత్రీదేవి నీకు ఒక కూతుర్ని ప్రసాదిస్తాను. ఆమెవల్ల నీ కోరికలన్నీ నెరవేరగలవు అంది. సావిత్రీదేవి అత్యంత శక్తిస్వరూపిణి. ఆ పరమేశ్వరిని సేవించడం ఈ సావిత్రి కథలోని అంతరార్థం గ్రహించడం అంటే భారతీయ ఆధ్యాత్మిక విషయ సర్వస్వాన్ని తెలుసుకోవడమే.

20 వ శతాబ్ది ప్రారంభంలో అరవిందయోగి ఈ సావిత్రి కథను తీసుకుని 'సావిత్రి' అనే ఒక మహాకావ్యం వ్రాశారు. ఆ శతాబ్దిలో అది మహనీయ కావ్యంగా గుర్తింపు పొందింది.



సావిత్రి కథ భారతంలో ఒక ఉపాఖ్యానం. ఉపాఖ్యానం అంటే ఒక పెద్దకథలో సందర్భవశాన చెప్పే చిన్నకథ. కౌరవపాండవుల కథ ప్రధాన కథ కాగా ధర్మరాజాదులు అరణ్యవాసకాలంలో విన్న కథ సావిత్రి కథ. అందుకే ఇది ఉపాఖ్యానమయింది.

మద్రదేశాధిపతి అశ్వపతి తన ధర్మపత్ని మాళవియందు సావిత్రి అనే కూతుర్ని కన్నాడు. రాజులకు చాలామంది భార్యలు ఉంటారు. వీరిలో యజ్ఞయాగాదులు చేసేటప్పుడు రాజు పక్కన కూర్చునే పెద్దభార్యను ధర్మపత్ని అంటారు. ధర్మకార్యాలు చేసేటప్పుడు రాజుతో పాటుగా ఉండేది ధర్మపత్ని. సావిత్రి వరంవల్ల పుట్టిన బాలికకు సావిత్రి అని పేరుపెట్టి ఎంతో ప్రేమతో పెంచుకుంటున్నారు. ఆ రాజదంపతులు. ఆమె సిద్ధ, సాధ్య, యక్ష, అమర కన్యలకంటే అత్యంత సౌందర్యవతిగా యౌవనవతిగా ఎదిగింది. ఈ కన్యకు గుణవయోరూపాలలో ఎవరు అనుకూలుడయిన భర్త కాగలడని రాజు ఆలోచనలో పడ్డాడు.

సావిత్రి, సాళ్వదేశాధిపతి అయిన ద్యుమత్సేనుని కొడుకు సత్యవంతుడు, రూపవంతుడు, గుణవంతుడు అని విని అతణ్ణి ప్రేమించింది. లోకంలో ప్రేమ అనేది రెండు విధాలుగా ఏర్పడుతుంది. ఒకటి చూడటంవల్ల, రెండు వినడంవల్ల. వాటినే కనుకలి అని, వినుకలి అని అంటారు. శకుంతలా దుష్యంతుల కథలో దుష్యంతుడిది కనుకలి ప్రేమ. ఉద్యానవనంలో శకుంతలను చూడగానే ప్రేమలో పడ్డాడు. ఆమె ఎవరో, ఏమిటో వివరాలు తరువాత నెమ్మదిగా అడిగి తెలుసుకుంటాడు. ఇక నలదమయంతుల విషయంలో వాళ్ళిద్దరూ ఒకరి గురించి ఒకరు విని ప్రేమించుకున్నారు. ఇది వినుకలి ప్రేమ. దమయంతీ స్వయంవారినికి యముడు, వరుణుడు, అగ్ని, ఇంద్రుడూ నలుని రూపం ధరించివచ్చి నలుడి పక్కనే కూర్చున్నాడు. అయిదుగురు నలులని చూసింది. దమయంతి, తన ప్రేమశక్తితో,

దైవబలంతో నలుణ్ణి గుర్తించి వరించింది. రుక్మిణీదేవికూడా శ్రీకృష్ణుని గుణగణాలు విని అతణ్ణే పతిగా సంభావించుకుని, వరించి తానే బ్రాహ్మణోత్తము చేత కృష్ణునికి కబురుపంపి ఆతని ఇల్లాలు అయింది.

ఇక మన కథానాయిక సావిత్రికూడా సత్యవంతుని గురించి విని ప్రేమించింది. కనుకలి, వినుకలి ప్రేమలలో వినుకలి ప్రేమ విశిష్టమయింది అని పెద్దల అభిప్రాయం.

సావిత్ర కథ కృతయుగం నాటిది. ఆ యుగంలో స్త్రీలకు తమ భర్తను తాము నిర్ణయించుకునే సావకాశం ఉండేది. సావిత్రి తండ్రి ఆమెను బుజ్జగిస్తూ, ప్రేమగా,

**తే॥ తల్లి! నీ గుణరూప వృత్తముల కెందుఁ**
**దగినవరు నీవ యిమ్ముగఁ దడవి నెమ్మి**
**నీదు మనసున కెక్కిన నృపకుమారుఁ**
**గోరి వరియింపు; మిదియ నీకును బ్రియంబు (8)**

"అమ్మా సావిత్రీ! నీ మంచిగుణాలకు, అందచందాలకు, ప్రవర్తనకు తగిన వరుణ్ణి నీవే వెతుక్కుని నీ మనస్సుకు నచ్చిన రాకుమారుణ్ణి మగనిగా నిశ్చయించుకో. నాకు కూడా అదే ఇష్టం. నీ యిష్టమే నాకూ ఇష్టం అన్నారు".

స్త్రీ తనకు నచ్చిన వరుణ్ణి తానే ఎన్నుకునే స్వాతంత్ర్యం, సామర్థ్యం కృతయుగంలో ఉంది అనడానికి ఈ ఘట్టం చక్కని ఉదాహరణ. అయితే మధ్యకాలంలో ఆ స్థితి మారిపోయింది. మళ్లీ నేటికాలాన స్త్రీలకు పూర్వవైభవం లభించింది.

సావిత్రి వరించిన సత్యవంతునికి వివాహమైన తరువాత ఒక్క సంవత్సర కాలం మాత్రమే ఆయుర్దాయం ఉన్నదని నారదమహర్షి వలన తెలిసింది. విషయం విన్న తండ్రి, అమ్మా! ఇదీ విషయం కాబట్టి వేరెవరినయినా



వరించమన్నాడు. ఆ మాటకు సావిత్రి దృఢనిశ్చయంతో ఇలా సమాధానం చెప్పింది తండ్రితో –

**క. వినుము మనోవాక్కాయము**
**లను మూఁడు తెఱంగులందు నంతఃకరణం**
**బనఘ! ప్రధానము గావున**
**మనమునఁ గైకొన్న భర్త మానుటఁ దగునే? (14)**

మనస్సు, మాట, అంతఃకరణము అనే మూడింటిలో అంతఃకరణం చాలా ప్రధానమైంది. నేను మనస్సులో భర్తగా సంభావించుకుని ఉన్నాను కనుక ఇప్పుడు అతన్ని కాదనుకోవడం మర్యాద కాదు కదా అంది. నిజమైన ప్రేమకు సావిత్రి ప్రథమోదాహరణ. సత్యవంతుని ఆయుస్సు ఒక్క సంవత్సర కాలం మాత్రమే అని తెలిసీ అతన్ని వివాహమాడాలనే దృఢనిశ్చయంతో ఉండడం సామాన్య విషయం కాదు.

కుమార్తె దృఢనిశ్చయం విన్నాక అశ్వపతి, సత్యవంతుని తండ్రి ద్యుమత్సేనుని వద్దకు వచ్చి తన కూతురు సావిత్రిని కోడలిగా చేసుకోమని కోరాడు. ఆ ద్యుమత్సేనుడు రాజా! మేము రాజ్యాన్ని కోల్పోయి అడవులలో బ్రతుకు వెళ్లబుచ్చుతున్నాం. సుకుమారి సావిత్రి ఈ అడవిలో జీవించగలదా? అన్నాడు. ఆ సందర్భంలో ఆ తండ్రి –

తన కూతరు చిన్నదే అయినా శక్తిమంతురాలనీ, ధీరమతి అనీ ఆమెను గురించి చెప్తాడు. 'పిన్నయనంగనేల? నేకొలదియుగాదు, ధీరమతి గూఁతురు, పేర్కొనఁ జాలు పెంపునన్' అన్నాడు.

వివాహం జరిగింది. సావిత్రి నారచీరలు ధరించి అరణ్యంలో అత్తమామలకు భర్తకు ఆనందం కలిగేలా నడుచుకుంటోంది. నారదుడు చెప్పిన విషయం గుర్తుపెట్టుకొని శ్రద్ధగా దైవపూజ చేస్తోంది. ఇక నాలుగు రోజులు మాత్రమే ఆయువు ఉంది. నిష్ఠతో త్రిరాత్రోపవాసం చేయబూనింది.

మామగారు కోడలు చేస్తున్న వ్రతం గురించి తెలుసుకుని, ఇంత దుస్తరమైన వ్రతం ఎందుకమ్మా! అని అడిగాడు. సావిత్రి గౌరవంతో, మామగారూ దిగులు పడకండి. పరమశుభాలకోసం ఈ వ్రతం చేస్తున్నాను. కారణం మీకు త్వరలో చెప్తానంది. నాలుగోరోజు కూడా ఉపవాసదీక్షతో ఉండి సత్యవంతునితో పాటు తానుకూడా అరణ్యంలో పూలు, పళ్లు, సమిధలు తీసుకొని రావడానికి వెళ్లింది. అరణ్యసౌందర్యాన్ని భార్యకు చూపి సత్యవంతుడు ఎంతో ఆనందంగా ఉన్నాడు. కొంచెం సేపు కట్టెలు కొట్టాడు. తలనొప్పి భరించలేకుండా ఉన్నాను అంటూ సావిత్రి ఒడిలో తల పెట్టుకుని పడుకున్నాడు. కొంతసేపటికి చైతన్యం లేకుండా అయిపోయాడు. అంతలో ఒక్క దివ్యుడు 'పటుపాశ ప్రౌఢహస్తోద్ధతున్' కనియెన్ గోమలి (48వ పద్యం) అతి సుకుమారి, లోకభీకరస్వరూపుడైన యముణ్ణి చూసింది. ఎఱ్ఱన ఈ పద్యంలో యముని ఉద్ధతరూపాన్ని సంస్కృతపదభూయిష్ఠమైన పదాలతో రచించాడు. 'కనియెన్' అనే క్రియాపదం ఒక్కటే ఈ పద్యంలో తెలుగు పదం. తక్కినదంతా సంస్కృతమే. ఈ రీతి పద్యరచనకు భాస్కరరామాయణ కవులకు, పోతనకు, ప్రబంధకవులకు ఎఱ్ఱన పద్యం మార్గదర్శకంగా నిలిచింది.

యముడు సామాన్యులకు కనబడడు. సావిత్రి చేసిన త్రిరాత్రోపవాసం దీక్షవల్ల సమకూడిన శక్తి కారణంగా ఆమెకు కనబడ్డాడు. అంతేకాదు సావిత్రి ఆ వ్రతశక్తితో యముని వెంట ప్రయాణం చేయగలిగింది.

యమధర్మరాజుతో సావిత్రి నెఱపిన సంభాషణ 'ప్రగల్భవచనం' అంటాడు ఎఱ్ఱన. తనను వెంబడించి వస్తున్న సావిత్రిని చూసి యమధర్మరాజు నువ్వు ఎందుకు వస్తున్నావు? నువ్వు రారాదు అన్నాడు. దానికి సమాధానంగా సావిత్రి 'ఓ సంస్తుతగుణా! పొగడ తగిన గుణములు గలవాడా! పతులు ఎక్కడికి వెళితే సతులు అనుసరించి వెళ్లవద్దా? నీ దయవల్ల, నా పతిభక్తి వల్ల నాకు వెళ్లరాని చోటు లేదు' అంది. అంతేకాదు. నువ్వు సజ్జన శేఖరుడవు.



నీ సందర్శనం వల్ల శుభాలు పొందకుండా నేను ఎలా వెనక్కు వెళతాను అంది. ఆమె మాటతీరుకు యముడు ఆశ్చర్యపోయాడు. అమ్మా! 'భవదుదారవాగ్భంగికి' అంటే నీ మాటల తీరుకు మెచ్చాను. నీ కో వరం ఇవ్వాలని ఉంది. నీ భర్త ప్రాణం తప్ప వేరే ఏదయినా వరం కోరుకో అన్నాడు. సావిత్రి ఆర్యా! మా మామగారు ద్యుమత్సేనుడు శత్రువుల చేత పరాభవం పొంది కన్నులు కనబడక అవస్థపడుతున్నారు. వారికి తిరిగి కన్నులు వచ్చేలా చేయండి అని కోరింది. సరే అలాగే ఇస్తాను వెళ్లు. ఇక నాతో రావద్దు అన్నాడు. యముడు అలా వారించినా సావిత్రి అతని వెంట వెళ్లసాగింది. వెళుతూ వెళుతూ అతనితో –

**క. యముడంద్రు నిన్ను నార్యులు**
**యమియింపుడు భూతతతుల నట్లగుటఁ దగున్**
**శమ నుండవైతి కల్మష**
**శమనంబునఁ జేసి నీవు జలజాప్తసుతా! (62)**

భూతతుల్ని యథోచితంగా నియమిస్తావు గనుక నీకు 'యముడు' అనే పేరు సార్థకమవుతుంది. శమనుడు అనికూడా అంటారు. ఎందుకంటే పాపాలను పోగొట్టేవాడవు కనుక. అదీగాక నువ్వు పద్మాలకు ఆప్తుడైన సూర్యునికి పుత్రుడవు అంటూ యమునికి గల పేర్లలోని ఔచిత్యాన్ని ఎంతో చక్కగా వివరించింది. ఎవరికయినా వారి పేర్లలోని విశేషాలు చెప్తే ఆనందమే కదా! అందుకే యముడు ఆ పుణ్యసతితో ఇలా అన్నాడట.

అమ్మా! పాపాలను పోగొట్టేవిధంగా మాట్లాడుతున్న నీ మాటలు దప్పిగొన్నవాడికి చల్లని మంచినీరు లభించినట్లుంది. నాకు చాలా సంతృప్తిగా ఉంది నీ మాటతీరు. నీ భర్త ప్రాణాలు తప్ప మరేదయినా వరం కోరుకో అన్నాడు. సావిత్రి దేవా! మా మామగారికి శత్రువులు అపహరించిన రాజ్యం తిరిగి వచ్చేటట్లు అనుగ్రహించండి అని కోరింది. యముడు సరే అన్నాడు.

ఇక మరి ముందుకు రాకు. ఈ త్రోవ చాలా భయంకరంగా ఉంటుంది. నీవు రావడానికి ఆజ్ఞలేదు సుమా! అంటూ ఆమె రాకను తీవ్రంగా వారించాడు. అయినా సావిత్రి ధైర్యంగా అయ్యా! మీరు ధర్మాత్ములు. ధర్మపీఠాధిపతులలో మొదటివారు. ఎలాంటి పరిస్థితుల్లో అయినా ధర్మాత్ములు ధర్మం వదలరుకదా! మరి నేను భర్తను వదిలి ఎలా వెళ్లను. భర్తతో కూడా వెళ్లడమే భార్యధర్మం కదా! అంది. సావిత్రి చేసిన ఈ ధర్మవిషయ భరితమైన సంభాషణ విని యముడు, అమ్మా! నువ్వు ప్రకటధర్మతత్పరవు! అంటూ సంబోధించి మెచ్చుకున్నాడు. నీ ధర్మనిష్ఠకు ఆనందపడుతున్నాను. నీకొక వరం ఇస్తాను. నీ భర్త ప్రాణం తప్ప, కోరుకో అన్నాడు. ఈ సారి సావిత్రి నా తండ్రి మద్రభూపతికి మగపిల్లలులేరు. వారికి నూరుమంది కొడుకులు కలిగే వరం ప్రసాదించండి అని కోరింది. యముడు సరే అన్నాడు. నువ్వు ఇప్పటికే అలసిపోయావు. ఇంక రాకు అన్నాడు.

సావిత్రి, అయ్యా! నాకు అలసట ఎక్కడ? నా మనస్సు నా భర్త చరణాలయందే నిలచి ఉంది. భర్తతో ఉండడమే భార్య ధర్మం. ధర్మం వల్లనే కదా ఈ ప్రపంచం ఇలా సాగుతోంది. ధర్మమే ప్రధానం అని మీకు తెలుసు. ఆర్యా! ఏడు మాటలు మాట్లాడితే ఎవరయినా చుట్టాలు అవుతారు కదా! మనం చాలా సేపటినుండి సంభాషించడం వల్ల నేను నీకు చుట్టాన్ని. మరి ఈ మిత్రమనోరథాన్ని తప్పక నెరవేర్చాలి అని కోరింది.

యమధర్మరాజు సావిత్రి సంభాషణాచాతురికి, ధార్మికచింతనకు ముగ్ధుడై ఏదైనా వరం కోరుకో తల్లీ! అన్నాడు. వెంటనే సావిత్రి, స్వామీ! మీరు ఈ సారి నా భర్త ప్రాణాలు అనే నిబంధన పెట్టలేదు. కాబట్టి నా భర్తను జీవింపచేయండి!, ధర్మపదవీపరిరక్షణా! పుణ్యవీక్షణా! అంది. యముడు ఆమె వాక్చాతుర్యానికి మరోసారి ముగ్ధుడై 'కొను మిదె నీమనః ప్రియుని గోమలి' అన్నాడు.



సావిత్రి సత్యవంతుని మనసారా ప్రేమించి వివాహమాడిన విషయం యమునికి కూడా తెలుసు అని మనకు ఈ వాక్యం ద్వారా తెలుస్తోంది. యముడు సత్యవంతునికి నాలుగు వందల సంవత్సరాలు జీవితాన్ని, నూరుమంది పుత్రులను, వంశప్రతిష్ఠను నిలిపే ఉత్తమ పుత్రుడు కాగలడని వరం ప్రసాదించాడు. కథ సుఖాంతమయింది.

సావిత్రి కథలో ఆమె ధర్మప్రవర్తనవల్ల, వాగ్వైభవం వల్ల, ధైర్యపద్ధతివల్ల మామగారికి చూపు, రాజ్యం, తల్లిదండ్రులకు నూరుమంది పుత్రుల్ని, భర్తకు ఆయువును సంపాదించింది. ఒక స్త్రీ చేసిన విశేషమయిన ఘనకార్యాలివి.

ఈ లోకంలో కొడుకే కులాన్ని ఉద్ధరిస్తాడని నమ్ముతాను. కానీ కూతురు కూడా కులాన్ని ఉద్ధరించగలదని సావిత్రి చేసి చూపించింది. ఆ విషయాన్ని మామగారే స్వయంగా ఇలా చెప్పాడు.

**క. ఆపత్సముద్రమగ్నం**
**బైపోయెడు నస్మదన్వయము పెంపెసఁ గం**
**దేప యయి కడవబెట్టితి**
**నీ పుణ్యచరిత్ర కీర్తనీయము తల్లీ! (105)**

అమ్మా! సావిత్రీ! నీ జీవితచరిత్ర పుణ్యవంతము, ప్రశంసింపతగినది కూడా. ఆపత్సముద్రములో మునిగి నశించిపోయే మా వంశాన్ని తెప్పవయి గట్టుచేర్చి కాపాడి మాకు అభ్యుదం చేకూర్చావు. సావిత్రి తెప్పలా గట్టెక్కించింది అనే భావం మామగారే కాదు. కథారంభంలో ద్యుమత్సేనునితో సంబంధం మాట్లాడే సందర్భంలో –

**క. 'ఈ కన్నియ నాకూఁతురు**
**మాకులమున కెల్లఁ దెప్ప!' అంటాడు అశ్వపతి.**

ఈ నాకూతురు మాకులాన్ని కంతకు తెప్పవంటిది అన్నాడు. ఈ ఉపాఖ్యానం చివరలో మార్కండేయమహర్షి ధర్మరాజుతో –

**క. తన మగని నత్త మామల**
**జననీజనకులను దన్ను సకలంబును దా**
**ఘనముగ సముద్ధరించెను**
**జనవర! సావిత్రి ధర్మచరితము కంటే!**

అంటూ సావిత్రి ధర్మచరితను ప్రత్యేకంగా పేర్కొన్నాడు.

పై పద్యంలో 'ఘనముగ సముద్ధరించెను' అనే మాటను బట్టి కూతుళ్లు కూడా కులం ఉద్ధరించగలరని నిరూపింపబడింది.

ఎఱ్ఱాప్రెగడ తన రచనలో పాఠకులకు భాషాపరిజ్ఞానాన్ని అందించాడు. యముడు ఈ కథలో పదేపదే వస్తాడు. అందువల్ల యముడికి గల పర్యాయపదాలన్నీ తన రచనలో ప్రయోగించాడు. కాలుండు, ధర్మపదవీపరిరక్షకుడు, అంతకుండు, దండధరుడు, ధర్మదుడు, సమవర్తి, పితృపతి, ధర్మదేవత, శమనుడు, ప్రేతపతి, వైవస్వతుడు, ప్రథమ ధర్మాధ్యక్షుడు, ధర్మరాజు, కృతాంతుడు మొత్తం పదునాలుగు పర్యాయపదాలు విద్యార్థులకు తెలియవస్తాయి.

సావిత్రి యమునితో మాట్లాడిన విధానంవల్లనే ఆయనను మెప్పించి భర్త ప్రాణాలు వరంగా పొందగలిగింది. బాగా మాట్లాడడానికి సంబంధించి ఎఱ్ఱన ప్రయోగించిన సమాసాలు చూద్దాం.

1. ప్రగల్భవచనంబులు 2. ఉదారవాగ్భంగి 3. సమంజసఫణితుల్ 4. ప్రకట ధర్మవిశేష తత్పరవు 5. ఇంతటి వాగ్వైభవము గల సావిత్రి ఆమె తండ్రి చెప్పినట్లు ధీరమతి.

*ధీరమతి ధర్మచరిత్రమే సావిత్రి కథ.*

– డా|| కె.మలయవాసిని

# సావిత్ర్యుపాఖ్యానం

మార్కండేయుఁడు ధర్మరాజునకు సావిత్ర్యుపాఖ్యానంబు సెప్పుట (సం. 3-277-5)

**సీ. కలఁడు మద్రేశుండు ఘనుఁ డశ్వపతి యను ।**
**ధరణీశుఁ; డతఁడు సంతానకాంక్ష**
**నెంతయు ధృతిఁ బదునెనిమిది యేఁడులు ।**
**సావిత్రిఁ గొల్చె; నజ్జనవిభునకు**
**నద్దేవి ప్రత్యక్షమై 'వర మడుగుము' ।**
**నావుడు నతఁడు వినమ్రుఁ డగుచు**
**'నాత్మజుఁ గోరెద' ననవుడుఁ 'గన్నియ ।**
**పుట్టు నీ' కనియె నా భువనమాత;**

**తే. యనుడు 'దేవి! భవత్కృప నస్మదీయ ।**
**వాంఛితము సఫలంబు గా వలదె?' యని నృ**
**పోత్తముఁడు విన్నవించె; నయ్యోగమూర్తి ।**
**గాఢకారుణ్యవికచహృత్కమల యగుచు.** 1

**ప్రతిపదార్థం:** మద్రేశుండు= మద్రదేశానికి ప్రభువు; ఘనుఁడు= గొప్పవాడు; అశ్వపతి+అను, ధరణీశుఁడు= అశ్వపతి అనేరాజు; కలఁడు= ఉన్నాడు; అతఁడు= (ఆ అశ్వపతి); సంతానకాంక్షన్= బిడ్డలు కలుగవలె ననే కోరికతో; ఎంతయున్= మిక్కుటమైన; ధృతిన్= నిష్ఠతో; పదునెనిమిది+ఏఁడులు= పదునెనిమిది సంవత్సరాలు సావిత్రిన్= సావిత్రీదేవిని; కొల్చెన్= ఆరాధించాడు; ఆ+జనవిభునకున్= ఆ రాజుకు; అశ్వపతికి; ఆ+దేవి= సావిత్రి; ప్రత్యక్షము+ఐ= సాక్షాత్కరించి; వరము+ అడుగుము= వరాన్ని కోరుకొనుము; నావుడున్= అని చెప్పగా; అతఁడు= అశ్వపతి; వినమ్రుఁడు+అగుచున్= భక్తితో

వంగినవాడు ఔతూ; ఆత్మజున్= పుత్రుడిని; కోరెదన్= వాంఛిస్తాను; అనవుడున్= అని చెప్పగా; ఆ భువనమాత= ఆ జగన్మాత- సావిత్రి; కన్నియ+పుట్టున్= కన్యక ఉద్భవిస్తుంది; నీకున్= నీకు; అనియెన్= అని చెప్పింది; అనుడున్= అనిచెప్పగా; దేవి!= ఓ సావిత్రీదేవీ!; భవత్+కృపన్= నీయొక్క దయవలన; అస్మదీయవాంఛితము= నా కోరిక; సఫలంబు+కావలదె= తీరవలెను కదా; అని; నృప+ఉత్తముఁడు= రాజులలో శ్రేష్ఠుడు - అశ్వపతి; విన్నవించెన్= నివేదించాడు; ఆ+యోగమూర్తి= సావిత్రి; గాఢ, కారుణ్య, వికచ, హృత్+కమల+అగుచున్= దట్టమైన దయతో వికసించిన పద్మంవంటి హృదయం కలది అగుచు.

**తాత్పర్యం:** అశ్వపతి అనే పేరుగలవాడు మద్రదేశాన్ని పరిపాలించే ప్రభువు అతడు గొప్పవాడు. ఆయన బిడ్డలకొరకు మిక్కుటమైన నిష్ఠతో పదునెనిమిదేండ్లు సావిత్రీదేవిని ఉపాసించాడు. ఆ రాజుకు సావిత్రి ప్రత్యక్షమై ఆతడిని వరం కోరుకొమ్మని అడిగింది. అతడు భక్తితో వినతుడై, 'దేవీ! నాకు కొడుకును ప్రసాదింపుము' అని ప్రార్థించాడు. అప్పుడు ఆ లోకమాత, 'నాయనా! నీకు కూతురు కలుగుతుంది' అని చెప్పింది. అంతట అశ్వపతి, 'అంబా! నీవు ప్రత్యక్షమైతివికదా; దేవీ! ఇక నాకోరిక ఈడేరవలెను కదా' అని విన్నవించాడు. అంత ఆ యోగమూర్తి అయిన సావిత్రీదేవి మిక్కుటమైన దయతో వికసించిన హృదయపద్మం కలదై.

**విశేషం:** సావిత్రి - యోగమూర్తి, జగన్మాత అని ఈ పద్యంలో చెప్పబడింది. అష్టాంగయోగం సుప్రసిద్ధం. 1. యమం 2. నియమం 3. ప్రాణాయామం 4. ప్రత్యాహారం 5. ధ్యానం 6. ధారణ 7. మననం 8. సమాధి. ఇరువదిఏడుయోగాలు చెప్పబడినవి. అందు ఈ పద్యంలో వాడబడిన "ధృతి" ఉన్నది. 1. విష్కంభం 2. ప్రీతి 3. ఆయుష్మత్తు 4. సౌభాగ్యం 5. శోభనం 6. అతిగండం 7. సుకర్మం 8. 'ధృతి' 9. శూలం 10. గండం 11. వృద్ధి 12. ధ్రువం 13. వ్యాఘాతం 14. హర్షణం 15. వజ్రం 16. సిద్ధి 17. వ్యతీపాతం 18. వరీయస్సు 19. పరిఘ 20. శివం 21. సిద్ధం 22. సాధ్యం 23. శుభం 24. శుభ్రం 25. బ్రహ్మం 26. ఐంద్రం 27. వైధ్రుతి. సావిత్రి అంటే నిఘంటువులోని అర్థాలు సరస్వతి, పార్వతి, ఇచట సావిత్రి బ్రహ్మను పేర్కొనటంచేత అశ్వపతి ఉపాసించిన దేవి సరస్వతి అని భావించవచ్చును.



**వ. 'ఏను నీమనోరథంబుతెఱంగు మున్న చతుర్ముఖున కెఱింగించిన నతండు గన్నియఁగా నిర్దేశించె; నద్దేవునియానతి యమోఘంబు; విను మక్కన్నియ కారణంబున నీకు నొక్కవిధంబునం బిదపఁబుత్త్రశతలాభంబు నగు; సంతసిల్లు' మని యనుగ్రహించి యద్దేవి యంతర్ధానంబు నొందె; నశ్వపతియును సావిత్రీప్రసాదంబున నిజధర్మపత్ని యయిన మాళవియందు సావిత్రి యను కూఁతుం గని, యక్కన్నియ నతిగౌరవం బునం బెనిచె నంత. 2**

**ప్రతిపదార్థం:** ఏను= నేను; నీ మనోరథంబు+తెఱంగు= నీ కోరికయొక్క తీరు; మున్ను+అ= ఇంతకుముందే; చతుర్ముఖునకున్= నాలుగు మోములు గల దేవరయైన బ్రహ్మదేవుడికి; ఎఱింగించినన్= తెలుపగా; అతండు= బ్రహ్మదేవుడు; కన్నియఁగాన్= కూతురుగా; నిర్దేశించెన్= నిర్ణయించాడు; ఆ+దేవుని+ఆనతి= ఆ బ్రహ్మదేవుడి ఆజ్ఞ; అమోఘంబు= వ్యర్థంకాదు; వినుము= ఆలకింపుము; అక్కన్నియ+కారణంబునన్= ఆ కన్యక హేతువుగా; నీకున్= నీకు; ఒక్కవిధంబునన్= ఒకానొక మార్గంలో; పిదపన్= పిమ్మట; పుత్త్ర, శత, లాభంబున్+అగున్= నూరుగురుపుత్రులు పుట్టుతారు; సంతసిల్లుము= సంతోషించుము; అని= అని చెప్పి; అనుగ్రహించి= కరుణించి; ఆ+దేవి= సావిత్రి; అంతర్ధానంబున్+ఒందెన్= అదృశ్యం అయింది; అశ్వపతియును= అశ్వపతియును; సావిత్రీప్రసాదంబునన్= సావిత్రీదేవి దయవలన; నిజధర్మపత్ని+ అయిన= తనభార్య అయిన; మాళవియందున్= మాళవి అనే పేరు కల ఆమెయందు; సావిత్రి+అను,

కూఁతున్+కని= సావిత్రి అనే కూతురును పొంది; ఆ+కన్నియన్= ఆ కన్యకను; అతిగౌరవంబునన్= మిక్కుటమైన శ్రద్ధతోకూడిన గారాబంతో; పెనిచెన్= పోషించాడు; అంతన్= ఆ సమయంలో.

**తాత్పర్యం:** 'నేను నీకోరిక తీరు నెఱిఁగి ఇంతకుముందే బ్రహ్మదేవుడితో సంప్రదించాను. ఆయన కన్నియగా నిర్ణయించాడు. ఆ దేవుడి నిర్ణయానికి తిరుగులేదు. అయినా ఆలకించుము. నీకు తొలుత కన్యక ఉద్భవించినా పిదప, ఆమెకారణంగానే ఒకానొక సన్నివేశం సంప్రాప్తించి నీకు నూరుగురు సుతులు లభించగలరు. సంతోషించుము' అని అనుగ్రహించి ఆ దేవి అదృశ్యమైంది. పిదప అశ్వపతిధర్మపత్ని మాళవి గర్భం ధరించి సావిత్రి అనే కూతురిని కన్నది. తలిదండ్రులు సావిత్రిని మిక్కుటమైన శ్రద్ధతో గూడిన గారాబంతో పెంచారు. అంతట.

**క. ఆ వనజాక్షి పరిస్ఫుట ।**
**యౌవనయై సిద్ధసాధ్యయక్షామరక**
**న్యావలిఁ దన సౌందర్య ।**
**శ్రీవిలసనరేఖ నపహసించుచు నొప్పెన్. 3**

**ప్రతిపదార్థం:** ఆ వనజ+అక్షి= ఆ పద్మాలవంటి కనులు కలది; పరిస్ఫుట యౌవన+ఐ= తేటతెల్లమయిన యౌవనం కలదిఅయి; సిద్ధ, సాధ్య, యక్ష+అమర, కన్యా+ఆవలిన్= సిద్ధులు, సాధ్యులు, యక్షులు, దేవతలలోని కన్యకల సముదాయాన్ని; తన సౌందర్య శ్రీవిలసనరేఖన్= తన అందచందాల సొంపువంపులతో; అపహసించుచున్= పరిహసిస్తూ- అనగా అతిక్రమిస్తూ; ఒప్పెన్= శోభిల్లింది.

**తాత్పర్యం:** పద్మాలవంటి కన్నులు కల ఆ సావిత్రి తేటతెల్లమయిన జవ్వనం కలదై, తన అందచందాల సొంపు పెంపువంపులతో వేల్పులజాతికి చెందిన కన్యకలను, సిద్ధసాధ్య యక్షకన్యకలను అందరినీ అతిక్రమించింది.



**తే. 'కోరి జనపతి దనకూర్మికూఁతుఁ జూచి ।**
**గుణవయోరూపముల ననుకూలుఁడైన**
**భర్త నెమ్మెయి దీనికిఁ బడయువాఁడ ।**
**నొక్కొ!' యని యెందుఁ దడవుచునుండె నెలమి. 4**

**ప్రతిపదార్థం:** కోరి= కాంక్షించి; జనపతి= రాజు - అశ్వపతి; తనకూర్మి, కూఁతున్= తన అనుగుపుత్రికను; చూచి= అరసి; గుణ, వయస్+ రూపములన్= గుణాలలోను, వయస్సులోను అందమయిన ఆకారంలోను; అనుకూలుడు+ఐన= పొత్తు కుదిరినవాడైన; భర్తన్= పతిని; ఏ+మెయిన్= ఏ రీతిగా; దీనికిన్= ఈమెకు; పడయువాఁడన్+ఒక్కొ= సంపాదించగల వాడనో; అని= అని తలపోసి; ఎందున్= ఏవిధంగా నైనా; ఎలమిన్= ఉత్సాహంతో; తడవుచున్+ఉండెన్= వెదకుచుండినాడు.

**తాత్పర్యం:** అశ్వపతి అల్లారుముద్దుగా అందచందాలతో పెరిగి పెద్దది ఔతున్న కూతురును చూచి 'ఇంతటి సౌందర్యవతికి గుణగణాలు, వయస్సు, రూపం- ఈ మూడింటిలో చక్కగా పొత్తు కుదిరే వరుడిని ఎక్కడ ఏవిధంగా సంపాదించగలనా?' అని ఆలోచిస్తూ అన్వేషిస్తూ ఉన్నాడు.

**వ. అదియును సాళ్వపతి యైన ద్యుమత్సేనుకొడుకు సత్యవంతుండు రూప వంతుం డనియును గుణవంతుం డనియును విని వానియందుఁ జిత్తంబు దగిలి యున్నను సిగ్గుపెంపున నెవ్వరికి నెఱింగింపకుండె; నంత నొక్కనాఁడు మద్రపతికడకు నారదుం డరుగుదెంచిన నతం డమ్మహాముని నుచిత సపర్యాపరి తోషితుం జేసి సద్గోష్ఠీవిశేషంబులు సలుపుచున్న యెడ. 5**

**ప్రతిపదార్థం:** అదియును= ఆమెయును- సావిత్రియు; సాళ్వపతి+ఐన= సాళ్వదేశపురాజు అయిన; ద్యుమత్సేనుకొడుకు= ద్యుమత్సేనుడు అనేవాడిపుత్రుడు; సత్యవంతుండు= సత్యవంతుడు అనే పేరు కలవాడు;

రూపవంతుండు+అనియును= అందం కలవా డనియు; గుణవంతుండు= మంచి గుణగణాలు కలవాడు అనియును; విని= ఆలకించి; వానియందున్= అతడియందు- సత్యవంతుడియందు; చిత్తంబు= మనస్సు; తగిలి= లగ్నమై; ఉన్నను= ఉన్నప్పటికీ; సిగ్గుపెంపునన్= లజ్జ అతిశయించటంచేత; ఎవ్వరికిన్= ఎవరికిని; ఎఱింగింపకుండెన్= తెలుపకుండా ఉండింది; అంతన్= పిమ్మట; ఒక్కనాఁడు= ఒకరోజున; మద్రపతికడకున్= మద్రదేశపు రాజుదగ్గరకు- అశ్వపతిదగ్గరకు; నారదుండు= నారదమహర్షి; అరుగుదెంచినన్= విచ్చేయగా; అతండు= అశ్వపతి; ఆ+మహామునిన్= ఆ గొప్పఋషిని; ఉచిత, సపర్యా, పరితోషితున్+చేసి= తగిన సేవలు చేయటంచేత మిగుల సంతోషం చెందిన వాడినిగా చేసి; సత్+గోష్ఠీ, విశేషంబులు= మంచి సంభాషణగరిమతో గూడినటువంటి గొప్పచర్చలు; సలుపుచున్న+ ఎడన్= చేస్తున్న తరుణంలో.

**తాత్పర్యం:** సావిత్రి సాళ్వదేశాధీశుడైన ద్యుమత్సేనుడికొడుకు సత్యవంతుడిని గూర్చి విన్నది. అతడు అందగాడనీ, మంచిగుణాలు గలవాడనీ తెలిసి అతడిని ప్రేమించింది. కాని, అతిశయమైన లజ్జతో ఆ విషయాన్ని ఎవ్వరికీ తెలుపలేదు. అప్పుడు ఒకనాడు త్రిలోకసంచారి అయిన నారదుడు మద్రపతి అయిన అశ్వపతివద్దకు అరుదెంచాడు. అశ్వపతి ఆ మహర్షిని అతిథి మర్యాదలతో అలరించి మంచిగోష్ఠి సంభాషణలో వివిధవిషయాలు చర్చించ సాగాడు. ఆ తరుణంలో.

**క. నెచ్చెలులు దన్నుఁ గొలువఁగఁ।**
**బచ్చవిలుతుకలిమి యెల్లఁ బద్మానన యై**
**యచ్చుపడినట్లు మెఱయుచు।**
**నచ్చటి కేతెంచె భూవరాత్మజ నెమ్మిన్. 6**

**ప్రతిపదార్థం:**నెచ్చెలులు= అనుగు సకియలు (నెఱ+చెలి= నెచ్చెలి); తన్నున్= తనను (సావిత్రిని); కొలువఁగన్= సేవించగా; పచ్చవిలుతుకలిమి+ఎల్లన్= మన్మథుడియొక్క సిరి అంతయు; పద్మ+ఆనన+ఐ= పద్మంవంటి ముఖం కలిగినట్టిది (సావిత్రి) అయి; అచ్చుపడినట్లు= గండరువును తీర్చిదిద్దినట్లు; భూవర+ఆత్మజ= అశ్వపతికూతురు సావిత్రి; మెఱయుచున్= తేజస్సుతో శోభిల్లుతూ; నెమ్మిన్= ప్రీతితో; అచ్చటికిన్= ఆ స్థలానికి; ఏతెంచెన్= వచ్చింది.

**తాత్పర్యం:** అనుగుసకియలు తనను సేవించగా, ఆ అశ్వపతిరాజుకూతురైన సావిత్రి వర్చస్సుతో శోభిల్లుతూ ప్రీతితో ఆచోటికి అరుదెంచింది. అప్పుడు ఆ రాజపుత్రిక మన్మథుడి సిరిసంపద అంతా కలిసి మూర్తీభవించి పద్మముఖి అయిన ఆ సావిత్రిగా రూపొందిందా అనిపించేటట్లు ఉండింది.

**వ. ఇట్లు వచ్చి సఖీజనంబు నంతంత నిలిపి మెలపుతోడి పొలుపున నమ్ముగ్ధ లీలామధురం బగుచుండఁ దండ్రికి మ్రొక్కిన, నతండు గాఢస్నేహదోహళం బగు చిత్తంబుతో నత్తన్వి గ్రుచ్చియెత్తి నిజాంకతలంబున నునిచికొని సముచితోపలాలనకేళీపరవశుం డయ్యె; నప్పుడు నారదుం డమ్ముద్దియం జూచి యశ్వపతితోడ 'నిక్కన్నియం దగినవరున కొసంగక యి ట్లేల యునిచినవాఁడ?' వనిన నతండు గూఁతున కి ట్లనియె. 7**

**ప్రతిపదార్థం:** ఇట్లు= ఈవిధంగా; వచ్చి= అరుదెంచి; సఖీజనంబున్= చెలికత్తెలను; అంత+అంత= అంతంత, అల్లంత దూరంలో; నిలిపి= ఆపి; మెలపుతోడి పొలుపునన్= చాతుర్యంతో కూడిన సొంపుతో; ఆ+ముగ్ధ= ఆ లేతజవరాలు; లీలామధురంబు+ అగుచుండన్= విలాసంతో కూడిన తీయదనం తొలుకాడుతుండగా; తండ్రికిన్= పితకు; మ్రొక్కినన్= నమస్కరించగా; అతండు= అశ్వపతి; గాఢ, స్నేహ, దోహళంబు+ అగు= దట్టమైన అనురాగంచేత ఉత్సాహవంతమై ఉన్న; చిత్తంబుతోన్= మనస్సుతో; ఆ+తన్విన్= ఆ సుకుమారిని; గ్రుచ్చి+ఎత్తి= ఆప్యాయతతో దగ్గరకు తీసికొని కొద్దిగా పైకెత్తి; నిజ+అంక, తలంబునన్= తనయొడిలో; ఉనిచికొని= కూర్చుండబెట్టుకొని; సముచిత+ ఉపలాలన, కేళీ, పరవశుండు+అయ్యెన్= ఒప్పిదమైన బుజ్జగింపు ఆటలో నిమగ్నుడయ్యాడు; అప్పుడు= ఆ సమయంలో;

నారదుండు= నారదమహర్షి; ఆ+ ముద్దియన్+ చూచి= ఆ అమ్మాయిని కాంచి; అశ్వపతితోడన్= అశ్వపతిమహారాజుతో; 'ఈ+కన్నియన్= ఈ కన్యకను; తగినవరునకున్= యోగ్యుడైన పెండ్లికొడుకునకు; ఒసంగక= ఇవ్వకుండా; ఇట్లు= ఈవిధంగా; ఏల= ఎందుకు?; ఉనిచినవాఁడవు= ఉంచావు; అనినన్= అని అడుగగా; అతండు= అశ్వపతి మహారాజు; కూఁతునకున్= పుత్రికకు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు.

**తాత్పర్యం:** ఈ విధంగా వచ్చి, సావిత్రి తన చెలికత్తెలను అల్లంతదూరంలో నిలిపి తాను తండ్రిదగ్గరకు వచ్చి నమస్కరించింది. తండ్రి అయిన అశ్వపతిమహారాజు లేజవరాలు, ముగ్ధ అయిన తనకూతురును, గ్రుచ్చియెత్తి తన ఒడిలో కూర్చుండబెట్టుకొని బుజ్జగిస్తూ మైమరచి ఉన్నాడు. అప్పుడు ఆమె తండ్రికి చిన్నకూతురుగా కన్పించింది కాని, నారదుడికి ఆమె సంపూర్ణ యౌవనంతో తొణికిసలాడుతున్న సౌందర్యవతిగా కన్పించటంచేత, ఆ మహర్షి 'వయసువచ్చిన ఈ కన్యకను తగినవరుడికి ఏల ఇవ్వలేదు?' అని ప్రశ్నించాడు. ఆ ప్రశ్నను ఆలకించి అశ్వపతిమహారాజు తన కూతురుతో ఇట్లా పలికాడు.

**తే. 'తల్లి! నీగుణరూపవృత్తముల కెందుఁ ।**
**దగినవరు నీవ యిమ్ముగఁ దడవి నెమ్మి**
**నీదు మనసున కెక్కిన నృపకుమారుఁ ।**
**గోరి వరియింపు; మిదియ నాకును బ్రియంబు'. 8**

**ప్రతిపదార్థం:** తల్లి!= అమ్మా, సావిత్రీ!; నీగుణరూపవృత్తములకున్= నీమంచి గుణాలకు, ప్రవర్తనకు, అందచందాలకు; ఎందున్= ఎచటనైనా; తగిన= యోగ్యుడైన, వరున్= మగడిని; నీవు+అ= నీవే; ఇమ్ముగన్= ప్రీతితో; తడవి= వెదకి; నెమ్మిన్= ప్రేమతో; నీ+మనసునకున్+ఎక్కిన= నీ చిత్తానికి నచ్చిన; నృప, కుమారున్= రాజపుత్రుడిని; కోరి= ఇష్టంచొప్పున;



వరియింపుము= ఎన్నుకొనుము; ఇది+అ= ఇదియే; నాకును= నాకుగూడ; ప్రియంబు= ఇష్టం.

**తాత్పర్యం:** 'అమ్మా, సావిత్రీ! ఆలకించితివికదా నారదమహర్షి సెలవిచ్చినమాట. నీమంచిగుణాలకు, అందచందాలకు, ప్రవర్తనకు తగిన పెండ్లికొడుకును నీవే ప్రీతితో పేర్కొనుము. నీకు ప్రేమపాత్రుడైన రాజకుమారుడిని మగనిగా నీవే వరించుము. అదియే నేనుకూడ కోరుకొనేది. నీ ఇష్టమే నా అభీష్టం'.

**వ. అనిన నదియుఁ గొండొక లజ్జించి కోర్కిపెంపున సిగ్గు దొలంగం ద్రోచి ప్రకటకౌతూహల తరళితాంతరంగ యగుచుఁ దండ్రి కిట్లనియె. 9**

**ప్రతిపదార్థం:** అనినన్= అని అశ్వపతి చెప్పగా; అదియున్= సావిత్రియు; కొండొక లజ్జించి= ఇంచుక సిగ్గుచెంది; కోర్కి పెంపునన్= వాంఛ యొక్క అతిశయంవలన; సిగ్గు= బిడియం; తొలంగన్+ద్రోచి= ప్రక్కకునెట్టి; ప్రకట, కౌతూహల, తరళిత+ అంతరంగ+అగుచున్= వ్యక్తమైన ఆసక్తిచేత ప్రేరేపించబడిన డెందం కలది ఔతూ; తండ్రికిన్= పితకు, అశ్వపతికి; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పింది.

**తాత్పర్యం:** తండ్రి అశ్వపతి చెప్పిన మాటలు విని సావిత్రి కొంతసిగ్గు చెందింది. కాని, తమకించిన కోరిక సిగ్గును ప్రక్కకు నెట్టగా ఆమె వ్యక్తమైన కుతూహలంతో ప్రోత్సహించబడిన హృదయం కలది ఔతూ తండ్రితో ఇట్లా చెప్పింది.

**క. 'చిరకీర్తి సాళ్వభూవరు ।**
**వరతనయుం డయిన సత్యవంతుఁడు నాకున్**
**వరుఁడుగఁ గోరుదు మదిలో ।**
**నరవర! యాతనికి నిమ్ము ననుఁ బ్రీతిమెయిన్. 10**

**ప్రతిపదార్థం:** నరవర!= రాజా!; చిరకీర్తి= గొప్పపేరు కలవాడు అయిన; సాళ్వభూవరు వరతనయుండు+అయిన= సాళ్వదేశరాజుయొక్క శ్రేష్ఠుడగు కుమారుడైన; సత్యవంతుఁడు= సత్యవంతుడు అనేపేరు కలవాడు; నాకున్= నాకు; వరుఁడుగన్= మగడుగా; మదిలోన్= మనస్సులో; కోరుదున్= వాంఛిస్తాను; ఆతనికిన్= ఆ సత్యవంతుడికి; ననున్= నన్ను; ప్రీతిమెయిన్= సంతోషంతో; ఇమ్ము= ఒసంగుము.

**తాత్పర్యం:** చిరస్థాయి యైన కీర్తిని ఆర్జించిన సాళ్వదేశప్రభువు కొడుకు సత్యవంతుడు నాకు తగినవరుడు. రాజోత్తమా! అతడికి నన్ను ఇచ్చి పెండ్లిచేయుము.

**వ. సాళ్వపతియును నిపుడు దైవయోగంబునం జేసి విగతచక్షుం డయి తనరాజ్యంబు వైరులచేతం గోల్పడి పుత్త్రదారసహితంబుగా వనంబున నున్నవాఁ; డట్లయినను సత్యవంతున వరియింతు' ననిన మద్రేశ్వరుండు నారదుంజూచి 'మునీంద్రా! మీ యెఱుంగని వారు లేరు; సావిత్రిచేత వరియింపంబడిన కుమారుం డెట్టివాఁడు? వానిగుణరూపశీలంబు లెఱింగింపుఁ' డనిన నారదుం డిట్లనియె. 11**

**ప్రతిపదార్థం:** సాళ్వపతియునున్= ఆ సాళ్వదేశపురాజుసైతం; ఇపుడు= ఈసమయంలో; దైవయోగంబునన్+చేసి= విధి నిర్ణయం చేత; విగతచక్షుండు+అయి= పోయిన కనులు కలవాడు అయి (గ్రుడ్డివాడయి); తనరాజ్యంబున్= తాను ఏలే దేశాన్ని; వైరులచేతన్= శత్రువులచేత; కోల్పడి= పోగొట్టుకొని; పుత్త్ర, దార, సహితంబుగాన్= కొడుకుతో, భార్యతో పాటుగా; వనంబునన్= అడవిలో; ఉన్నవాఁడు= ఉన్నాడు; అట్లు= ఆ విధంగా; అయినను= అయినప్పటికిని; సత్యవంతున్+అ= సత్యవంతుడినే; వరియింతున్= భర్తగా స్వీకరిస్తాను; అనినన్= అని (సావిత్రి) చెప్పగా; మద్ర+ఈశ్వరుండు= మద్రదేశరాజు అశ్వపతి; నారదున్+చూచి= నారదుడిని కాంచి; 'ముని+ఇంద్రా!= మునులలో శ్రేష్ఠుడ వైన వాడా!; మీ+ఎఱుంగని వారు= మీకు తెలియనివారు; లేరు= ఉండరు; సావిత్రిచేతన్; వరియింపంబడిన= ఎన్నుకొనబడిన; కుమారుండు= రాజ కుమారుడు; ఎట్టివాఁడు= ఎటువంటివాడు; వాని= అతడియొక్క (సత్యవంతుడి యొక్క); గుణరూపశీలంబులు= గుణగణాలు, ఆకారం, నడవడికలు; ఎఱింగింపుఁడు= తెలుపండి; అనినన్= అని (అశ్వపతి) అడుగగా; నారదుండు= నారదుడు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పాడు.



**తాత్పర్యం:** సాళ్వదేశాధిపతి ఈ సమయంలో విధివిపరిపాకం చొప్పున కన్నులు కోలుపోయాడు. శత్రువులు అతడిరాజ్యాన్ని ఆక్రమించారు. అతడు భార్యాపుత్రులతో పాటు అడవిలో నివసిస్తున్నాడు. అయినను నేను సత్యవంతుడినే వరిస్తున్నాను' అని సావిత్రి చెప్పింది. ఆ మాటల నాలకించి మద్రపతి అయిన అశ్వపతి నారదుడిని చూచి, 'మునులలో శ్రేష్ఠుడవైనవాడా! మీ రెరుగనివారు ఉండరు. మా సావిత్రి ఎన్నుకొనిన సత్యవంతుడు ఎట్టివాడు? అతని గుణాలు ఎట్టివి? రూపం ఎట్టిది? నడవడిక ఎట్టిది? దయచేసి వివరించి తెల్పండి' అని ప్రార్థించాడు. నారదమహర్షి అశ్వపతికి ఈవిధంగా ప్రత్యుత్తర మిచ్చాడు.

**సీ. 'సత్యంబు వలుకుట సత్యవంతుం డన।**
**వతఁ డొప్పు; మఱియుఁ జిత్రాశ్వుఁడనఁగ**
**నామాంతరంబు నన్నరనాథసుతునకుఁ।**
**గలదు; తేజంబునఁ గమలమిత్త్రు**
**బుద్ధి నింద్రాచార్యుఁ బురుడించు; శూరత।**
**వాసవుఁ, దాలిమి వసుధఁబోలుఁ;**
**గాంతిఁ జంద్రున కెనగాఁ దగు; రూపున।**
**నాశ్వినేయుల సరియనఁ దలిర్చుఁ;**

**ఆ. దపము శమము దమము దానంబు బ్రాహ్మణ।**
**భక్తియును మహానుభావతయును**
**నతనియంద కాని యన్యులయందు లేఁ।**
**దింత నిక్కువము మహీతలేశ! 12**

**ప్రతిపదార్థం:**సత్యంబు పలుకుట= నిజాన్ని చెప్పటంచేత; సత్యవంతుండు+ అనన్= సత్యవంతుడు అనగా; అతఁడు= అతడు (సత్యవంతుడు); ఒప్పున్= శోభిల్లుతాడు; మఱియున్= వెండియు; చిత్ర+అశ్వుఁడు= చిత్రాశ్వుడు; అనఁగ= అనునట్టి; నామ+అంతరంబు= మరొకపేరు; అన్నరనాథసుతునకున్= ఆ రాజకుమారుడికి; కలదు= ఉన్నది; తేజంబునన్= కాంతిలో; కమలమిత్త్రున్= సూర్యుడిని; బుద్ధిన్= తెలివితేటలలో; ఇంద్ర+ఆచార్యున్= ఇంద్రుడిగురువు బృహస్పతిని; పురుడించున్= సరిపోలుతాడు; శూరతన్= పరాక్రమంలో; వాసవున్= ఇంద్రుడిని; తాలిమిన్= ఓర్పులో; వసుధన్= భూమిని; పోలున్= సాటి ఔతాడు; కాంతిన్= తేజస్సులో; చంద్రునకున్= జాబిల్లికి; ఎనగాన్+తగున్= సరిపోలుతాడు; రూపునన్= సౌందర్యంలో; ఆశ్వినేయులన్= అశ్వినిదేవతలకు; సరి+అనన్= సమానం అనేటట్లుగా; తలిర్చున్= శోభిల్లుతాడు; తపము= తపస్సు; శమము= కోపతాపాదులు లేకుండా శాంతంగా ఉండటం; దమము= వెలుపలి ఇంద్రియాలను నిగ్రహించటం; దానంబు= పరోపకారార్థం త్యాగం చేయుటం; బ్రాహ్మణభక్తియును= విప్రులపట్ల పూజ్యభావం; మహానుభావతయును= గొప్పప్రభావాన్ని కలిగి ఉండటమున్నూ; అతనియందు+అ= అతనియందు మాత్రమే; కాని; అన్యుల+అందున్= ఇతరులలో; లేదు= ఉండదు; మహీతల+ఈశ!= మహారాజా!; ఇంత= ఇదంతా; నిక్కువము= నిజం.

**తాత్పర్యం:** 'ఓ అశ్వపతి మహారాజా! సత్యం పలకటంచేత అతడికి సత్యవంతుడు అనే సార్థకనామధేయం ఏర్పడింది. అంతేకాక, అతడి ఇకొక



నామధేయం చిత్రాశ్వుడు. తేజస్సులో అతడు సూర్యుడిని, తెలివితేటలలో ఇంద్రుడిగురువైన బృహస్పతిని, పరాక్రమంలో ఇంద్రుడిని, ఓర్పులో భూదేవిని, కాంతిలో చంద్రుడిని, అందచందాలలో ఆశ్వినేయులను తలపిస్తాడు. తపస్సు, అంతరింద్రియ నిగ్రహం, బాహ్యేంద్రియ నిగ్రహం, త్యాగంతో కూడిన పరోపకారశీలం, బ్రాహ్మణభక్తి, గొప్పప్రభావంతో కూడిన వ్యక్తిత్వం ఆ సత్యవంతుడియందు మాత్రమే కన్పిస్తాయి. ఇతరులలో కన్పించవు. ఇది నిజం.

**వ. వానియందుఁ గీ డొక్కటి గలదు; పరిణయంబు మొదలుగా నొక్కసంవత్సరంబునకు మృతింబొందు; నిది నీకుఁజెప్పవలయుటంజేసి చెప్పితి' ననిన నతండు గూఁతుమొగంబు సూచి 'తల్లీ! యిమ్మహాత్ముండు దేవరహస్యం బెఱుంగు; నీతనివచనం బమోఘంబు; నీకు నట్టివరుం డేటికి? నొండొక్కవరుని వెదకి కొ' మ్మనిన నక్కన్యక యి ట్లనియె. 13**

**ప్రతిపదార్థం:** వానియందున్= ఆ సత్యవంతుడిలో; కీడు= హాని (గండం); ఒక్కటి= ఒక్కటి; కలదు= ఉన్నది; పరిణయంబు= వివాహం; మొదలుగాన్= ఆరంభంగా; ఒక్కసంవత్సరంబునకున్= ఒకయేఁటికి; మృతిన్+పొందున్= మరణిస్తాడు; ఇది= ఈ విషయం; నీకున్= నీకు; చెప్పవలయుటన్+చేసి= చెప్పవలసిరావటంచేత; చెప్పితిన్= వచించాను; అనినన్= అని నారదుడు చెప్పగా; అతండు= అతడు, అశ్వపతి; కూఁతుమొగంబు= పుత్రికముఖం; చూచి=అరసి; తల్లీ!= అమ్మా సావిత్రీ! ఈ+ మహాత్ముండు= ఈ మహానుభావుడు; (నారదమహర్షి); దేవరహస్యంబు= దేవతలకు మాత్రమే తెలిసే రహస్యం; ఎఱుంగున్= తెలియగలుగుతాడు; ఈతని వచనంబు= ఈతడిమాట; అమోఘంబు= తప్పనట్టిది; నీకున్= ఓ సావిత్రీ, నీకు; అట్టివరుండు= పెండ్లికి పిదప ఒక వత్సరంమాత్రమే జీవించేమగడు; ఏటికి= ఎందుకు; ఒండు+ ఒక్కవరునిన్= ఇంకొక పెండ్లికొడుకును; వెదకికొమ్ము= ఆలోచించి అన్వేషించుము; అనినన్= అని (అశ్వపతి) చెప్పగా; ఆ+కన్యక= సావిత్రి; ఇట్లు+అనియెన్= ఈ విధంగా చెప్పింది.

**తాత్పర్యం:** సత్యవంతుడిలో ఒకలోపం మాత్రం ఉన్నది. పెండ్లిఅయిన పిదప అతడు ఒకసంవత్సరానికి మరణిస్తాడు. ఇది నీకు చెప్పవలసిన అంశం కాబట్టి చెప్పక తప్పింది కాదు' అని నారదమహర్షి చెప్పాడు. అంతట అశ్వపతి కూతురైన సావిత్రిముఖం చూచి, 'అమ్మా! నారదమహర్షి త్రిలోకసంచారి మాత్రమే కాక, త్రికాలజ్ఞుడు, దేవతలకుమాత్రమే తెలిసే రహస్యాలు ఈ మహానుభావుడికి తెలుసు. ఈయనమాటకు తిరుగులేదు. నీకు ఇటువంటి వరుడెందుకు? నీవు ఇంకొకవరుడిని అన్వేషించటం మంచిది' అని హెచ్చరించాడు. అంతట సావిత్రి ఇట్లా బదులు పలికింది.

**క. 'వినుము మనోవాక్కాయము ।**
**లను మూఁడుతెఱంగులందు నంతఃకరణం**
**బనఘ! ప్రధానము గావున ।**
**మనమునఁ గైకొన్న భర్త మానుటఁ దగునే? 14**

**ప్రతిపదార్థం:** వినుము= ఆలకింపుము; మనస్+వాక్+కాయములు+అను= చిత్తం, మాట, శరీరచేష్ట అనే; మూడు+ తెఱంగులందున్= మూడురీతులలో; అంతఃకరణంబు= మనస్సు; ప్రధానము= ముఖ్యమైనది; కావునన్= కాబట్టి; మనమునన్= మనస్సునందు; కైకొన్న= స్వీకరించిన; భర్తన్= మగడిని; మానుటన్= వీడుట; తగునే= భావ్యమా? (భావ్యం కాదు).

**తాత్పర్యం:** 'తండ్రీ! ఆలకింపుము. మనస్సు, వాక్కు, కాయం - ఈ త్రికరణాలలో మనస్సు ప్రధానం అయింది. కాబట్టి, మనసార వరించిన మగడిని మానటం పాడిగాదు కదా!.

**వ. సత్యవంతుం డెట్టివా డైననుం గాని; మ్మే నింక నొరుల వరియింప నొల్ల' ననిన నశ్వపతి నారదుదెసఁ జూచుటయు, నతం డి ట్లనియె. 15**

**ప్రతిపదార్థం:** సత్యవంతుండు= చిత్రాశ్వుడు; ఎట్టివాడు+ఐననున్= ఎట్టివాడు అయినప్పటికిన్నీ; కానిమ్ము= కావచ్చును; ఏను= నేను; ఇంకన్= ఇకమీద; ఒరులన్= ఇతరులను; వరియింపన్+ఒల్లన్= ఎన్నికచేయజాలను; అనినన్= అని(సావిత్రి) చెప్పగా; అశ్వపతి; నారదుదెసన్= నారదుడివైపు; చూచుటయున్= దృష్టిని సారించగా; అతండు= అతడు - నారదుడు; ఇట్లు+అనియెన్= ఈవిధంగా చెప్పాడు.



**తాత్పర్యం:** సత్యవంతుడు ఎట్టివాడైనా కావచ్చును. నేను ఇంక ఒరులను వరించటం కల్ల' అని సావిత్రి పలికింది. అంతట ఆమెతండ్రి నారదుడివైపు దృష్టి సారించాడు. నారదుడు ఈ విధంగా పలికాడు.

**చ. 'గొనములప్రోక నీ యనుఁగుఁ గూఁతురు; దీని తలంపు మాన్పఁగా**
**మనకు నశక్య; మింక ననుమానము లేల? నరేంద్ర! కూఁతుఁ జ**
**య్యన నృపసూతి కిమ్ము; కమలానన చేసిన పుణ్యగౌరవం**
**బున నయినం బ్రియుండు పరిపూర్ణచిరాయురుపేతుఁ డయ్యెడున్. 16**

**ప్రతిపదార్థం:** నర+ఇంద్ర!= నరులలో శ్రేష్ఠుడ వైన ఓ అశ్వపతిరాజా!; నీ అనుఁగు+కూఁతురు= నీ కూరిమిపుత్రిక; గొనములప్రోక= మంచిగుణాల రాశి; దీని తలంపు= ఈమెఆలోచన; మాన్పఁగాన్= ఆపగా; మనకున్= నీకును నాకును; అశక్యము= సాధ్యం కాదు; ఇంకన్= ఇకమీద; అనుమానములు+ఏల?= సందేహాలు ఎందుకు?; కూఁతున్= పుత్రికను; చయ్యనన్= వెంటనే; నృపసూతికిన్= రాజపుత్రుడికి, (సత్యవంతుడికి); ఇమ్ము= ఒసగుము; కమల+ఆనన= పద్మంవంటి మొగం కలది - సావిత్రి; చేసిన= ఒనర్చిన; పుణ్య, గౌరవంబునన్+అయినన్= సుకృతంయొక్క గొప్పతనంవలన అయినను; ప్రియుండు= భర్త; పరిపూర్ణ, చిర+ఆయుస్+ఉపేతుఁ డు+అయ్యెడున్= దీర్ఘమైన నిండైన ఆయువుతో కూడినవాడు అగునుగాక.

**తాత్పర్యం:** 'ఓ అశ్వపతిమహారాజా! నీకూతురు సద్గుణాలరాశి. ఈమెమనస్సును మరలింపచేయటం మనకు సాధ్యం కాదు. ఇంక ఎట్టి సందేహాలు పెట్టుకొనకుము. నీ కూర్మికూతురును ఆ రాజకుమారుడైన సత్యవంతుడికి ఒసగుము. కమలంవంటి కళకళలాడే ముఖంగల సావిత్రి చేసినపుణ్యంవలన అయినా ఆమెభర్తకు నిండు ఆయుర్దాయం లభించగలదు'.

**వ. అనిన నమ్మహీపతి మునిపతికి మ్రొక్కి 'నీవు మాకుం బరమ గురుండవు; నీ యానతిచ్చినట్ల చేసెద' ననియె; నారదుండును దాని దీవించి, దివంబునకుం జనియె; నంత. 17**

**ప్రతిపదార్థం:** అనినన్= అని చెప్పగా; ఆ+మహీపతి= ఆరాజు, అశ్వపతి; మునిపతికిన్= మునిశ్రేష్ఠుడైన నారదుడికి; మ్రొక్కి= నమస్కరించి; నీవు= ఓ నారదా! నీవు; మాకున్= మాకు; పరమగురుండవు= పూజ్యుడయిన గురువర్యుడవు; నీ+ఆనతి+ఇచ్చిన+ అట్ల= నీవు ఆజ్ఞాపించిన విధంగానే; చేసెదన్= చేస్తాను; అనియెన్= అని చెప్పాడు; నారదుండును= నారదమహర్షియున్నూ; దానిన్= ఆమెను - సావిత్రిని; దీవించి= ఆశీర్వదించి; దివంబునకున్= స్వర్గానికి; చనియెన్= వెళ్ళాడు; అంతన్= తరువాత.

**తాత్పర్యం:** అని నారదు డనగానే అశ్వపతి ఆ మహామునికి నమస్కరించి 'మహర్షీ! నీవు మాకు ఉత్తమగురువర్యుడవు. నీవు ఆజ్ఞాపించినట్లు చేస్తాను' అన్నాడు. నారదమహర్షి సావిత్రిని దీవించి స్వర్గానికి వెళ్ళాడు. అప్పుడు.

**సీ. అమరఁ బుణ్యదినంబునందు బాంధవమంత్రి।**
**వృద్ధపురోహితవితతితోడ**
**సావిత్రిఁ దోడ్కొని జననాయకుండు వై।**
**వాహికమహనీయవస్తుకోటి**
**గొనుచుఁ బుణ్యారణ్యగోచరుండై తప।**
**స్స్థితుఁడైన యా ద్యుమత్సేనుకడకుఁ**
**జనిన నారాజును సంభ్రమంబున నశ్వ।**
**పతికి నర్ఘ్యాదిసంభావనంబు**

**ఆ. లాచరించి సముచితాభిమతాలాప।**
**పూర్వకముగ సుజనపూజ్యుఁ డతని**
**యాగమననిమిత్త మడిగిన, మద్రేశుఁ।**
**డెలమి సాళ్వపతికి నిట్టు లనియె. 18**



**ప్రతిపదార్థం:** పుణ్యదినమ్మునందున్= శుభముహూర్తంతో కూడిన రోజున; అమరన్= ఒప్పిదంగా; బాంధవ, మంత్రి, వృద్ధ, పురోహిత, వితతితోడన్= చుట్టాలు, సచివులు, పెద్దలు, వైదికకర్మలు చేయించే విప్రులు- వీరల సమూహంతో; సావిత్రిన్= సావిత్రిని; తోడ్కొని= వెంటనిడుకొని వెడలి; జననాయకుండు= రాజు, అశ్వపతి; వైవాహిక మహనీయవస్తుకోటి= పెండ్లికి కావలసిన గొప్పపదార్థసముదాయం; కొనుచున్= వెంట తీసికొని; పుణ్య+అరణ్య, గోచరుండు+ఐ= పవిత్రమైన అడవిలో చేరినవాడయి; తపస్+ స్థితుఁడు+ఐన= తపస్సునందు నిష్ఠతో కూడిఉన్న; ఆ, ద్యుమత్సేనుకడకున్= ద్యుమత్సేనుడు అనే ఆ రాజుదగ్గరకు; చనినన్= వెళ్ళగా; ఆ రాజును= ఆరాజు ద్యుమత్సేనుడున్నూ; సంభ్రమంబునన్= మిగులత్వరతో; అశ్వపతికిన్= అశ్వపతిరాజుకు; అర్ఘ్య+ ఆది, సంభావనంబులు= స్వాగత చిహ్నమైన (కాళ్ళు కడుగుకొనటానికి) నీళ్ళివ్వటం, పానీయం మున్నగు మర్యాదలు; ఆచరించి= చేసి, సముచిత+అభిమత+ ఆలాప, పూర్వకముగన్= ఆ సమయానికి తగినటువంటి ఇష్టాలైనటువంటి మాటలను మున్ముందుగా పలికి; సుజనపూజ్యుఁడు= మంచివారలచేత ఆరాధించదగినవాడు ద్యుమత్సేన మహారాజు; అతని+ఆగమన, నిమిత్తము= అశ్వపతిరాకకు కల కారణం; అడిగినన్= ప్రశ్నించగా; మద్ర+ఈశుఁడు= మద్రరాజు, అశ్వపతి; ఎలమిన్= వికాసంతో; సాళ్వపతికిన్= సాళ్వదేశరాజయిన ద్యుమత్సేనుడికి; ఇట్టులు+ అనియెన్= ఈ విధంగా పలికాడు.

**తాత్పర్యం:** ఒకానొక శుభదినం చూచుకొని అశ్వపతిమహారాజు సావిత్రిని తోడ్కొని, చుట్టాలు, సచివులు, పెద్దలు, పురోహితులు వెంట రాగా, పెండ్లికి కావలసిన సంభారాలన్నిటిని సమకూర్చుకొని, ధర్మారణ్యంలో తపస్సు కావిస్తూఉన్న ద్యుమత్సేన మహారాజు వద్దకు వెళ్ళాడు. ఆ ద్యుమత్సేనుడున్నూ అశ్వపతిమహారాజుకు స్వాగతంచెప్పి అర్ఘ్యాన్నీ, పాద్యాన్నీ సమర్పించి, మన్నించి, కుశలప్రశ్నలు వేసి, పిదప అశ్వపతి రాజేంద్రునిరాకకు గల కారణాన్నిగూర్చి అడిగాడు. అంతట అశ్వపతి సాళ్వపతితో ఈ విధంగా అన్నాడు.

**క. 'ఈ కన్నియ నాకూఁతురు ।**
**మాకులమున కెల్లఁ దెప్ప మనుజోత్తమ! నీ**
**వీకన్నియఁ గోడలుగాఁ ।**
**గైకొనుము మదీయవచనగౌరవబుద్ధిన్.' 19**

**ప్రతిపదార్థం:**మనుజ+ఉత్తమ!= మనుష్యులలో ఉత్తముడవైన ఓ ద్యుమత్సేన మహారాజా!; ఈ కన్నియ= ఈ కన్యక; నాకూఁతురు= నా పుత్రిక; మా కులమునకున్+ఎల్లన్= మా వంశం అంతటికిని; తెప్ప= తరింపచేసేది (పడవ); నీవు= నీవు; ఈ కన్నియన్= ఈ కన్యకను, సావిత్రిని; మదీయ, వచన, గౌరవ, బుద్ధిన్= నామాటలయందలి గౌరవంతోడి బుద్ధితో మన్నించే ఆలోచనతో;కోడలుగాన్= నీ కొడుకుకు భార్యగా; కైకొనుము= స్వీకరించుము.

**తాత్పర్యం:** 'ఓ ద్యుమత్సేనమహారాజా! ఈ కన్యక సావిత్రి నా కూర్మికూతురు. మా వంశాన్ని తరింపజేసే తెప్ప. నీవు ఈ కన్యకను నీ కోడలుగా దయతో స్వీకరింపుము. నా మాటలను మన్నించుము.'

**వ. అని పలికి సావిత్రి నతనికి నభివందనంబు సేయించి మఱియు నతండు. 20**

**తాత్పర్యం:** అని చెప్పి, అశ్వపతి సావిత్రిచేత ద్యుమత్సేనుడికి నమస్కరింపజేశాడు. ఇంకా అత డిట్లా అన్నాడు.

**క. 'నీకొడుకు సత్యవంతున ।**
**కీ కన్నియ దగు నరేంద్ర! యీ కన్నియకున్**
**నీ కొడుకు దగు; ననన్యగు ।**
**ణాకరు లియ్యిరువురును సమంచితమూర్తుల్.' 21**

**ప్రతిపదార్థం:**నర+ఇంద్ర!= ఓ (ద్యుమత్సేన) రాజా!; నీకొడుకు= నీపుత్రుడు; సత్యవంతునకున్= చిత్రాశ్వుడికి; ఈ కన్నియ= ఈ పడుచుపిల్ల; తగున్= సరిపోతుంది; ఈకన్నియకున్= ఈకన్యకకు; నీకొడుకు= నీసుతుడు; తగున్= సరిపోతాడు; ఈ+ ఇరువురును= ఈ ఇద్దరును; అనన్యగుణ+ఆకరులు= సాటిలేని లక్షణాలకు నెలవులు అయినవారు; సమంచితమూర్తుల్= శోభిల్లునట్టి అంగసౌష్ఠవం కలవారు.



**తాత్పర్యం:** 'నీకొడుకు సత్యవంతుడికి ఈ కన్నియ సావిత్రి సరిపోతుంది. మా సావిత్రికి నీకొడుకు సత్యవంతుడు సరిపోతాడు. వధూవరు లిద్దరు సాటి లేని మంచిగుణాలు కలవారు. అందచందాలతో కూడిన గొప్ప అంగసౌష్ఠవం కలవారు. ఈడుజోడు కుదిరిన జంట వీరు.

**వ. అనిన నతనికి ద్యుమత్సేనుం డిట్లనియె. 22**

**తాత్పర్యం:** అనగా అశ్వపతికి ద్యుమత్సేనుడు ఇట్లా అన్నాడు.

**తే. 'విగతరాజ్యులమై ఘోరవిపినములకు ।**
**వచ్చి యిమ్మెయిఁ దప మున్నవార మేము;**
**బాల సుకుమారి యిది జనపాల! యడవి ।**
**నుండి మాతోడియిడుమకు నోర్చునయ్య?' 23**

**ప్రతిపదార్థం:** జనపాల!= రాజా! ఓ అశ్వపతీ!; ఏము= మేము విగత రాజ్యులము+ఐ= పోయినరాజ్యం కలవారమై; ఘోర, విపినములకున్= భయంకరమైన అడవులకు; వచ్చి= అరుదెంచి; ఇమ్మెయిన్= ఈ రీతిగా; తపము+ఉన్నవారము= తపస్సు చేసికొంటూ ఉన్నవాళ్ళం; బాల= చిన్నపిల్ల; సుకుమారి= మిగులు కోమలత్వం కలది; ఇది= ఈమె, సావిత్రి; అడవిన్+ఉండి= అరణ్యంలో నివసించి; మాతోడి ఇడుమకున్= మాతోపాటు కష్టాలు పడటానికి; ఓర్చునయ్య?= సహింపగలుగునయ్య?

**తాత్పర్యం:** అశ్వపతికి ద్యుమత్సేనుడు ఈ విధంగా చెప్పాడు: 'మేము రాజ్యాన్ని కోల్పోయి భీతిగొల్పే అడవులకు వచ్చి ఈ విధంగా తపస్సు

చేసికొంటున్నాము. ఓ అశ్వపతిమహారాజా! మీ అమ్మాయి చిన్నపిల్ల. మిక్కిలి సుకుమారి. మాతో ఈ అడవులలో ఉండి ఈ కష్టాలు పడుతూ కాపురం చేయకలదా?'

**వ. అనిన నశ్వపతి యతని కి ట్లనియె. 24**

**తాత్పర్యం:** అనగా అశ్వపతి ద్యుమత్సేనుడితో ఇట్లా అన్నాడు.

**చ. 'కలిమియు లేమియున్ సతతముగా; వవి సెందినచోఁ జెలంగుచున్**
**గలఁగుచు నున్కి ధీరులప్రకారమె? లెస్సగ నింతవట్టు నేఁ**
**దెలియుదుఁ జెప్పెదన్ వసుమతీవర! పిన్న యనంగ నేల? నే**
**కొలఁదియుఁ గాదు; ధీరమతి గూఁతురు; పేర్కొనఁ జాలు పెంపునన్. 25**

**ప్రతిపదార్థం:** వసుమతీ+వర!= ఓ రాజా; ద్యుమత్సేనా!; కలిమియున్= సంపదయున్నూ; లేమియున్= దారిద్ర్యమున్నూ; సతము కావు= శాశ్వతం కావు; అవి= కలిమి లేములు; చెందినచోన్= ఏర్పడితే; చెలంగుచున్= అతిశయిస్తూ; కలఁగుచున్= కలతచెందుతూ; ఉన్కి= ఉండటం; ధీరుల, ప్రకారమె?= ధైర్యవంతుల పద్ధతియా?; లెస్సగన్= మేలుగా; ఇంత+పట్టు= ఇంతమేర; నేన్+తెలియుదున్= నేను ఎఱుగుదును; చెప్పెదన్= వచిస్తాను; కూఁతురు= నాపుత్రిక సావిత్రి; పిన్న+అనంగన్+ఏల= (సావిత్రి) చిన్నపిల్ల అనటం ఎందుకు; ఏ కొలదియున్+కాదు= అంత తక్కువది కాదు (శక్తియున్నదే); పేర్కొనన్+చాలు= ఎన్నదగిన; పెంపునన్= గొప్పదనంలో; ధీరమతి= ధైర్యంతో కూడిన మనస్సు కలది.

**తాత్పర్యం:** ఓ ద్యుమత్సేనమహారాజా! సంపద, దారిద్ర్యం శాశ్వతాలు కావు. సంపద చేరినప్పుడు పొంగుట. దారిద్ర్యం సంక్రమించినపుడు క్రుంగుట ధైర్యవంతుల లక్షణం కాదు. నాకు తెలిసినంత మేరకు చెప్పగలను. నా కూతురును కేవలం చిన్నపిల్లగా పరిగణించవద్దు. ఆమె శక్తియుక్తులలో తక్కువేమీ కాదు; గొప్పతనంలో పేర్కొనదగిన ధీరమతియే!



**క. నీతోడ వియ్యమందగఁ।**
**జేతోగతి నాసఁ జేసి చెచ్చెర ని ట్లే**
**నేతెంచితి మత్ప్రార్థన।**
**బ్రాఁతిగఁ జేకొనక యునికి పాడియె నీకున్?' 26**

**ప్రతిపదార్థం:** నీతోడన్= ఓ ద్యుమత్సేనమహారాజా నీతో; వియ్యము+అందఁగన్= వైవాహికసంబంధం పెట్టుకొనటానికి; చేతస్+గతిన్= మనస్సులో; ఆసన్+చేసి= ఆశించి; చెచ్చెరన్= శీఘ్రంగా; ఇట్లు= ఈరీతిగా; ఏన్= నేను; ఏతెంచితిన్= వచ్చాను; మత్+ప్రార్థన= నా విన్నపం; బ్రాఁతిగన్= ప్రీతితో; చేకొనక+ఉనికి= స్వీకరించకపోవటం; నీకున్= నీకు; పాడి+ఎ= (పాడియె?) న్యాయమా? (న్యాయంకాదు).

**తాత్పర్యం:** ఓ ద్యుమత్సేనమహారాజా! నేను నీతోడ వియ్యమందాలని మనస్సులో ఆశించి శీఘ్రంగా నీవద్దకు వచ్చాను. నీవు నావిన్నపాన్ని మన్నించకుండటం న్యాయం కాదు.

### సావిత్రి సత్యవంతుని వివాహం బగుట (సం. 3-279-25)

**వ. అనుటయు నయ్యంధనృపతి తత్సంబంధంబునకు సంతసిల్లి నిజాశ్రమవాసు లైన మునులం గూర్చుకొని శుభలగ్నంబున సత్యవంతునకు సావిత్రిం బరిణయంబు సేసె; నయ్యశ్వపతియునుం గూఁతునకు నల్లునకు వివిధాంబరాభరణాది వస్తువిశేషంబు లొసంగి నిజపురంబున కరిగెఁ; బదంపడి. 27**

**ప్రతిపదార్థం:** అనుటయున్= అని అశ్వపతి చెప్పటమున్నూ; ఆ+అంధ నృపతి= ఆ గ్రుడ్డిరాజు; తత్+సంబంధంబునకున్= ఆ వివాహసంబంధానికి, చుట్టరికానికి; సంత సిల్లి= సంతోషించి; నిజ+ఆశ్రమవాసులు+ఐన= తన ఆశ్రమంలో నివసిస్తున్న; మునులన్= ఋషులను; కూర్చుకొని=

కూడగట్టుకొని; శుభలగ్నంబునన్= మంచిముహూర్తంలో; సత్యవంతునకున్= చిత్రాశ్వుడికి; సావిత్రిన్= సావిత్రిని; పరిణయంబు+చేసెన్= పెండ్లిచేశాడు; ఆ+అశ్వపతియును; కూఁతునకున్= పుత్రికకు; అల్లునకున్= జామాతకు; వివిధ+అంబర+ఆభరణ+ఆది, వస్తువిశేషంబులు= పెక్కువస్త్రాలు, భూషణాలు మున్నగు వస్తువులు; ఒసంగి= ఇచ్చి; నిజపురంబునకున్= తన రాజధానికి; అరిగెన్= వెళ్ళాడు; పదంపడి= పిమ్మట.

**తాత్పర్యం:** అశ్వపతి చెప్పిన మాటలకు గ్రుడ్డిరాజు ద్యుమత్సేనుడు సంతోషించి సత్యవంతుడికి సావిత్రితో వివాహం నిశ్చయించాడు. తన ఆశ్రమవాసులైన ఋషులు శుభముహూర్తం నిర్ణయించగా పెండ్లి జరిపించాడు. అశ్వపతి తనకూతురికి అల్లుడికి పెక్కుకానుకలు, వస్త్రాలు, ఆభరణాలు మున్నగువస్తువుల నిచ్చి, తనరాజధానికి తరలి వెళ్ళాడు. అటుపిమ్మట.

**తే. పడఁతి రమణీయభూషణాంబరవిలాస ।**
**ముజ్జగించి వనాంతరయోగ్యలీల**
**వల్కలాజినవసనయై వదల కధిక ।**
**భక్తి భర్తృ శుశ్రూషణపరత నుండె. 28**

**ప్రతిపదార్థం:** పడఁతి= వనిత (సావిత్రి); రమణీయభూషణ+అంబర, విలాసము= అందమైన ఆభరణాలతో వస్త్రాలతో కూడిన హొయలు; ఉజ్జగించి= వదలిపెట్టి; వన+అంతర, యోగ్య, లీలన్= అడవిలో నివసించుటకు తగిన విధంగా; వల్కల+అజిన, వసన+ఐ= నారచీరలు; లేడిమున్నగువాటి చర్మాలు వస్త్రములుగా కలదియై; అధికభక్తిన్= మిక్కిలి పూజ్యమైన భావాన్ని; వదలక= విడువక; భర్తృ, శుశ్రూషణ, పరతన్+ఉండెన్= భర్త యొక్క పరిచర్య యందలి ఆసక్తితో ఉండింది.

**తాత్పర్యం:** సావిత్రి అందమైన ఆభరణాలు, వస్త్రాలు మున్నగు వాటిని ధరించే హొయలు పరిత్యజించి అడవిలో నివసించటానికి అనువయిన



నారచీరలు, తోలువలువలు ధరిస్తూ, మిక్కిలిభక్తితో భర్తకు పరిచర్య చేస్తూ ఉండింది.

**క. ఆ మెలఁత సేయు సవినయ ।**
**సామకథల మృదుగభీరసంభావనలన్**
**మామయు నత్తయు సంతో ।**
**షామృతమునఁ దేలి రంతరంగములఁ దగన్. 29**

**ప్రతిపదార్థం:** మామయున్= మామగారును, భర్తతండ్రియును; అత్తయున్= అత్తగారును, భర్తతల్లియును; ఆ మెలఁత= ఆ పడతి సావిత్రి; చేయు= ఒనరించునట్టి; సవినయసామకథలన్= అణకువతో కూడిన సాత్త్వికవర్తనము తోను; మృదు, గభీర, సంభావనలన్= మెత్తనైన లోతైన (గాఢమైన) మన్ననలతోను; అంతరంగములన్= మనస్సులతో; తగన్= ఒప్పిదంగా; సంతోష+అమృతమునన్= ఆనందం అనే అమృతంలో; తేలిరి= క్రీడించారు.

**తాత్పర్యం:** సావిత్రి చేసే పరిచర్యలవలన, వినయంతో గూడిన మన్ననలవలన, సహజమైన వర్తనలవలన, మంచి మాటలవలన ఆమె అత్తమామల మనస్సులు రంజిల్లాయి. వారు సంతోషం అనే అమృతంలో తేలియాడారు.

**విశేషం:** (1) అమృతము - త్రాగితే చావులేకుండ చేసే పానీయం. ద్రావకం. ఇట సంతోషమే అమృతద్రవంగా చెప్పబడింది. (2) అలం : రూపకం.

**వ. సావిత్రియుఁ దనమగని యాయుఃప్రమాణంబు నారదముని చెప్పిన దినంబు మొదలుగా ననుదినంబును లెక్కయిడికొనుచుండె; నిట్లు వర్తిల్లుచుండ నాలుగుదివసంబులు గొఱంతగా నొక్కసంవత్సరంబు గడచిన. 30**

**ప్రతిపదార్థం:** సావిత్రియున్= సావిత్రియు; తనమగని+ఆయుస్+ ప్రమాణంబు= తనభర్తయొక్క ఆయువుయొక్క పరిమితి; నారదముని=

నారదమహర్షి; చెప్పిన= వచించిన; దినంబు= రోజు; మొదలుగాన్= ఆరంభంగా; అనుదినంబును= ప్రతిరోజును; లెక్క+ఇడికొనుచున్+ఉండెన్= లెక్కపెట్టుకుంటూ ఉండింది; ఇట్లు= ఈ రీతిగా వర్తిల్లుచుండన్ = మెలగుతూ ఉండగా; నాలుగుదివసంబులు= నాలుగునాళ్ళు; కొఱంతగాన్= తక్కువగా; ఒక్కసంవత్సరంబు= ఒక్కయేడు; కడచినన్= జరుగగా.

**తాత్పర్యం:** సావిత్రి నారదమహాముని చెప్పినప్రకారం తనమగడి ఆయుః ప్రయాణం లెక్కించుకొంటూ ఉన్నది. ఈ విధంగా ప్రవర్తిస్తూ ఉండగా నాలుగునాళ్ళు తక్కువగా ఒకసంవత్సరం జరిగింది.

**క. నాలవుదినంబు పతిమృతి ।**
**కాలం బని మది నెఱింగి కడునిష్ఠమెయిం**
**జాల భరంబుగఁ బూనెను ।**
**బాల త్రిరాత్రోపవాసపరమవ్రతమున్. 31**

**ప్రతిపదార్థం:** బాల= అమ్మాయి సావిత్రి; నాలవుదినంబు= నాలుగవనాఁడు; పతిమృతికాలంబు+అని= భర్త మరణించే సమయం అని; మదిన్= చిత్తంలో; ఎఱింగి= తెలిసికొని; కడు= మిక్కుటమైన; నిష్ఠ, మెయిన్= దీక్షతో; చాలన్= మిక్కిలి; భరంబుగన్= బరువుతో; నిష్ఠతో; త్రిరాత్ర+ఉపవాస, పరమవ్రతమున్= పగళ్లతో గూడిన మూడు రాత్రుల పాటు నిరాహార మహాదీక్షను; పూనెను= వహించింది.

**తాత్పర్యం:** ఆ నాటికి నాలుగవరోజు భర్త మరణించే గడువుగా మనస్సులో తెలిసికొనిన సావిత్రి మిక్కుటమైన నిష్ఠతో త్రిరాత్రోపవాస మహావ్రతాన్ని (మూడునాళ్ళ నిరాహారదీక్షను) పూనింది.

**వ. దానికి విస్మయంబంది ద్యుమత్సేనుండు గోడలిం బిలిచి, 'తల్లీ! యిట్లేల దుస్తరం బగు వ్రతంబు దొడంగి?' తనిన నమ్మద్రరాజతనయ వినయంబుతో ని ట్లనియె. 32**



**ప్రతిపదార్థం:** దానికిన్= సావిత్రి పూనిన - మూడునాళ్ల నిరాహారదీక్షకు; విస్మయంబు+ అంది= ఆశ్చర్యపడి; ద్యుమత్సేనుండు; కోడలిన్= కొడుకు భార్యను- సావిత్రిని; పిలిచి= ఆహ్వానించి; తల్లీ!= అమ్మా! సావిత్రీ!; ఇట్లు= ఈ రీతిగా; ఏల= ఎందుకు; దుస్తరంబు+ అగు= దాటరాని (కఠినమైన); వ్రతంబు= నోము; తొడంగితి(వి)= ఆరంభించావు; అనినన్= అని అడుగగా; ఆ+మద్రరాజతనయ= ఆమద్రరాజుయొక్క కూతురు- సావిత్రి; వినయంబుతోన్= నమ్రతతో; ఇట్లు+అనియెన్= ఈవిధంగా చెప్పింది.

**తాత్పర్యం:** సావిత్రి పూనిన దీక్షకు ఆశ్చర్యం చెంది, ద్యుమత్సేనుడు కోడలిని పిలిచి, 'తల్లీ! ఇట్టి కఠోరవ్రతాన్ని ఎందుకు పూనావు?' అని ప్రశ్నించగా, ఆ మద్రరాజుపుత్రిక ఇట్లా నమ్రతతో బదులు పలికింది.

**క. 'మీరు మదీయం బగు వ్రత ।**
**భారమునకు వగవవలదు; పరమశుభంబుల్**
**గోరి యొనరింపఁ బూనితిఁ; ।**
**గారణమును మీకు నెఱుఁగఁగా నగుఁబిదపన్.' 33**

**ప్రతిపదార్థం:** మీరు= మీరు; మదీయంబు+అగు= నాదైన; వ్రతభారమునకున్= నోమునందలి బరువుకు(నిష్ఠకు); వగవన్వలదు= విచారించ వద్దు; పరమశుభంబుల్= మిక్కిలిగొప్పవైన శుభాలను; కోరి= కాంక్షించి; (ఈ వ్రతాన్ని); ఒనరింపన్+పూనితిన్= చేయసమకట్టాను; కారణమును= హేతువును; మీకున్= మీకు; పిదపన్= పిమ్మట; ఎఱుఁగఁగాన్+అగున్= తెలియవస్తుంది.

**తాత్పర్యం:** 'మీరు నావ్రతభారాన్నిగూర్చి విచారించకండి. మిక్కిలిగొప్పవైన శుభాలను కోరి నే నీనోముకు ఉపక్రమించాను. కారణం మీకు పిదప తెలియవస్తుంది.

**వ. అనిన నతం 'డట్లైన మేలు గాక' యనియె; నంతఁ జతుర్థదివ సంబున.** **34**

**తాత్పర్యం:** అని సావిత్రి పలుకగా ద్యుమత్సేనుడు 'అట్లైతే నీకు శుభం కలుగుగాక' అని దీవించాడు. ఇక నాలుగవ రోజున.

**సీ. కడురేపకడయ మేల్కని యింతి నిజభర్తృ।**
**మరణదినం బని మానసమునఁ**
**దద్దయు శోకసంతాపంబు గదురంగ।**
**దినముఖోచితవిధుల్ దీర్చి భక్తిఁ**
**బతికి సమంచితపావనపరిచర్య।**
**యప్పుడు కడువేడ్క నాచరించి**
**యత్తకు మామకు నచటివృద్ధులకును।**
**వేర్వేఱ ప్రణమిల్లి వేడ్క వారు**

**తే. తనకు సౌభాగ్యభాగ్య వర్ధనము గాఁగ।**
**నిచ్చు దీవన మదిలో గ్రహించి యున్నఁ,**
**బ్రొద్దు జా మెక్కుటయుఁ బూవుఁబోఁడిఁ బిలిచి।**
**మామ యిట్లని పలికె సన్మాన మెసఁగ.** **35**

**ప్రతిపదార్థం:** కడురేపకడ+అ= మిక్కిలి ప్రాతఃకాలంలోనే; మేల్కని= నిదురనుండి లేచి; ఇంతి= పడతి- సావిత్రి; నిజ, భర్తృ, మరణదినంబు+అని= తనయొక్క మగడు మరణించే రోజు అని; మానసమునన్= మనస్సులో; తద్దయున్= మిక్కిలి; శోక సంతాపంబు= దుఃఖబాధ; కదురంగన్= వ్యాపించగా; దిన, ముఖ+ఉచిత, విధుల్= ఉదయం (ప్రాతఃకాలంలో) చేయదగిన పనులు, కాలకృత్యాలు; తీర్చి= నిర్వహించి; భక్తిన్= పూజ్యభావంతో; పతికిన్= భర్తకు, సత్యవంతుడికి; సమంచిత, పావన, పరిచర్య= ఒప్పిదమైన పవిత్రమైన సేవ; అప్పుడు= ఆసమయంలో; కడువేడ్కన్= మిక్కుటమైన ప్రీతితో; ఆచరించి= చేసి; అత్తకున్= భర్త తల్లికి; మామకున్= భర్తతండ్రికి; అచటి= అచట ఉన్న; వృద్ధులకును= పెద్దలకుకూడా; వేఱు+వేఱ=(వేర్వేఱ) ప్రత్యేకంగా ఒక్కొక్కరికి; ప్రణమిల్లి= నమస్కరించి; వేడ్కన్= ప్రీతితో; వారు= అత్తమామలు, పెద్దలు; సౌభాగ్య, భాగ్య వర్ధనముగాఁగన్= మాంగల్యం అనే సంపద అభివృద్ధి అయ్యేటట్లుగా; ఇచ్చు= ఒసగు; దీవన= ఆశీర్వచనం; మదిలోన్= మనస్సులో; గ్రహించి= పుచ్చుకొని; ఉన్నన్= ఉండగా; ప్రొద్దు= సూర్యుడు; జాము+ఎక్కుటయున్= ఏడున్నరగడియలకాలం అగుటయున్నూ; పూవుఁబోఁడిన్= పూవువంటి సుకుమారశరీరం కలది - సావిత్రిని; పిలిచి= ఆహ్వానించి; సమ్మానము= గౌరవం; ఎసఁగన్= శోభిల్లగా; మామ= భర్తతండ్రి ద్యుమత్సేనుడు; ఇట్లు+అని, పలికెన్= ఈ విధంగా అన్నాడు.

**తాత్పర్యం:** సావిత్రి ప్రొద్దుపొడవటానికి ముందే నిదురనుండి లేచి, ఆనాడు తనభర్త మరణించే దివసమని మనస్సులో మిక్కిలి పరితపించి, ప్రాతర్వేళలో కాల్యకృత్యాలు నెరవేర్చింది. భక్తితో భర్తకు శుశ్రూష చేసి, అత్తమామలకు, పెద్దలకు ప్రత్యేకంగా ప్రతిఒక్కరికి నమస్కరించి, వారు ప్రీతితో 'మాంగల్యసంపదను చిరకాలం పెంపొందే విధంగా అనుభవించుము' అని ఇచ్చే ఆశీర్వాదాలను మనసార గ్రహించింది. అంతలో జాము ప్రొద్దెక్కింది. సావిత్రిమామగారు పువ్వువలె సుకుమార మైన శరీరంగల కోడలిని పిలిచి మన్నించి ఈవిధంగా పలికాడు.

**క. 'కడునుగ్రం బగు వ్రత మిది।**
**దొడఁగితి; దివసత్రయంబుతో నది సెల్లెం;**
**బడఁతిరో! యెంతయు డస్సితి:।**
**దడయక పారణ యొనర్పఁదగదే యింకన్'.** **36**

**ప్రతిపదార్థం:** ఇది= (ఈ మూడురోజుల నిరాహారదీక్ష); కడున్= మిక్కిలి; ఉగ్రంబు+ అగు= కఠోరమయిన; వ్రతము= నోమును; తొడఁగితి(వి)= పూనికతో జరిపావు; దివసత్రయంబుతోన్= మూడునాళ్లతో; అది= ఆవ్రతం; చెల్లెన్= ముగిసింది; పడఁతిరొ!= ఓ వనితా, సావిత్రీ!; ఎంతయున్= మిక్కిలి; డస్సితి(వి)= అలసిపోయావు. తడయక= ఆలస్యం చేయక; ఇంకన్= ఇకమీద; పారణ= వ్రతం పూర్తిగావించిన మరునాడు చేసే భోజనం; ఒనర్పన్+తగదే= చేయదగదా, చేయవచ్చునుకదా.

**తాత్పర్యం:** 'ఓ సావిత్రి! నీవు పూనినది కఠోరవ్రతం. ఆ మూడునాళ్ళూ గడచాయికదా. ఇక ఈ నాలుగవనాడు నీవు వ్రతాంతభోజనం చేయదగును. నీవు మిక్కిలి డస్సిఉన్నావు. ఇక ఆలసించటం తగదు.'

**వ. అనిన సావిత్రి యతని కి ట్లనియె. 37**

**తాత్పర్యం:** అనగా సావిత్రి ద్యుమత్సేనుడితో ఇట్లా పలికింది.

**ఆ. 'అధిప! ప్రొద్దుగ్రుంకునంతకు నేఁడును।**
**గుడువఁదగదు నాకుఁ; గోరి యిట్లు**
**గాఁగ వ్రతముఁ బూనుకాలంబునన యేను।**
**నిశ్చయించుకొనిన నియమ మిదియ.' 38**

**ప్రతిపదార్థం:** అధిప!= మహారాజా!; ప్రొద్దు= సూర్యుడు; క్రుంకునంతకున్= అస్తమించేవరకును; నేఁడును= ఈనాడున్నూ; నాకున్= నాకు; కుడువన్+తగదు= భోజనం చేయరాదు; కోరి= వాంఛించి; ఇట్లు= ఈ రీతిగా; కాఁగన్= అయ్యేటట్లు; వ్రతమున్= నోమును; పూనుకాలంబునన్+అ= మొదలుపెట్టే సమయంలోనే; ఏను= నేను; నిశ్చయించుకొనిన= నిర్ణయించుకొనిన; నియమము= ఏర్పాటు, సమయం; ఇది+అ= ఇదే సుమా.



**తాత్పర్యం:** 'మహారాజా! సూర్యుడు అస్తమించే వరకు ఈనాడుకూడ నేను భోజనం చేయటానికి వీలు లేదు. ఈ వ్రతాన్ని ఆరంభించటానికి ముందే ఈ నియమాన్ని నేను ఏర్పరచుకొని ఉన్నాను'.

**వ. అనియె; నప్పుడు సత్యవంతుండు సమిత్కుశఫలాహరణార్థంబు వనంబు నకుం గదలినం జూచి సావిత్రి యతనిఁ జేరంజని 'వనంబున కేనును నీతోడఁ జనుదెంతుఁ; దోడ్కొనిపోవలయు' ననిన నతండు 'నీవు త్రిరాత్రోపవాసం బునం జేసి యెంతయు డస్సినదానవు; రానోప' వనిన నత్తన్వి వాని కి ట్లనియె. 39**

**ప్రతిపదార్థం:** అనియెన్= అని చెప్పింది; అప్పుడు= ఆ సమయంలో; సత్యవంతుండు; సమిత్+కుశ, ఫల+ఆహరణ+అర్థంబు= సమిధలు, దర్భలు, పండ్లు తీసికొనిరావటం కొరకై; వనంబునకున్= అరణ్యానికి (పోవుటకై); కదలినన్= బయలుదేరగా; చూచి= అరసి; సావిత్రి; అతనిన్= సత్యవంతుడిని; చేరన్+చని= సమీపించి; వనంబునకున్= అడవికి; ఏనును= నేనును; నీతోడన్= నీతోపాటు; చనుదెంతున్= వస్తాను; తోడ్కొని పోవలయున్= వెంట తీసికొనిపోవలయును; అనినన్= అని పల్కగా; అతండు= సత్యవంతుడు; నీవు= ఓసావిత్రీ నీవు; త్రిరాత్ర+ ఉపవాసంబు నన్+చేసి= మూడుదినాలు ఉపవాసం చేయటంచేత; ఎంతయున్= మిక్కుటంగా; డస్సినదానవు= అలసి ఉన్నదానవు; రాన్+ఓపవు= వచ్చుటకు శక్తిఉన్నదానవు కావు; అనినన్= అని సత్యవంతుడు చెప్పగా; ఆ+తన్వి= ఆ సుకుమారి సావిత్రి; వానికిన్= అతడికి - సత్యవంతుడికి; ఇట్లు+ అనియెన్= ఈ విధంగా అన్నది.

**తాత్పర్యం:** అని సావిత్రి చెప్పింది. ఆసమయంలో సత్యవంతుడు సమిధలు, దర్భలు, పండ్లు తేవటానికై అడవికి పోవసమకట్టాడు. అంత సావిత్రి

సత్యవంతుడిని చేరి, 'అడవికి ఈనాడు నేనుకూడా నీతో వస్తాను. నన్నుకూడ తీసికొని పొమ్ము' అన్నది. సత్యవంతుడు, 'నీవు మూడురాత్రుల ఉపవాసవ్రతం చేసి మిక్కుటంగా అలసి ఉన్నదానవు. నీవు రాజాలవు' అన్నాడు. అంతట సావిత్రి సత్యవంతుడితో ఇట్లా చెప్పింది.

**విశేషం:** ఉపవాసం అంటే రూఢ్యర్థం నిరాహారదీక్ష. దీనికి ఆధ్యాత్మికవేత్తలు చెప్పే అర్థం ఉప= దగ్గరగా, వాసము= వసించటం. అనగా దేవుడికి దగ్గరగా ఉండటం. ఉపవాసంలో ఆహారం తీసికొనకుండటమేకాక, దైవానుసంధానం, ఆత్మావలోకనం- అపరిహార్యమైన అంశాలు. ప్రపంచంలోని మతాలు అన్నియున్నూ ఏదోవిధమైన ఉపవాసదీక్షను విధిస్తున్నవి. సముచితమైన ఉపవాసంవలన ఆరోగ్యం మెరుగవటం, అవయవాలకు విశ్రాంతి లభించటం మాత్రమే గాక, మెదడుకు ఒకరకమైన ఉత్తేజం. చురుకుదనం ఏర్పడటం అనుభవసిద్ధం. ఆధ్యాత్మిక భావపరిపుష్టమైన ఉపవాసంవలన ఇంద్రియాతీతశక్తులు సంక్రమిస్తాయి. సావిత్రి ఆవిధంగా చర్మచక్షువులు చూడలేని యమధర్మరాజును విస్ఫారిత మనోనేత్రాలతో దర్శించగలిగిందని కొందరు చెప్తుతారు.

**మ. 'ఉపవాసశ్రమ మించుకేనియును నాయుల్లంబునం దోఁప దీ**
**విపినంబుజ్జ్వలపుష్పపల్లవఫలావిర్భూత నానాలతా**
**గపరీతం బన విందుఁ; జూడఁగ మదిం గౌతూహలంబయ్యెఁ; న**
**న్నుపరోధింపకు మింతవట్టు చన వీ యుక్తుండ వెబ్భంగులన్. 40**

**ప్రతిపదార్థం:** ఉపవాసశ్రమము= నిరాహారదీక్షవలన ఏర్పడిన బడలిక; ఇంచుక+ఏనియును= కొంచెంకూడ; నా+ఉల్లంబునన్= నాహృదయంలో; తోఁపదు= కన్పించదు; ఈ విపినంబు= ఈ అడవి; ఉత్+జ్వల, పుష్ప, పల్లవ, ఫల+ఆవిర్భూత, నానా, లతా+అగ, పరీతంబు+అనన్= ప్రకాశించే పూవులు, చిగుళ్ళు, ఫలాలు పుట్టెడి పెక్కులతలతో, చెట్లతో వ్యాపించి ఉన్నది అని; విందున్= వింటాను; చూడఁగన్= (ఈ అడవిని) దర్శించగా; మదిన్= చిత్తంలో; కౌతూహలంబు= వేడుక; అయ్యెన్= అయింది; నన్నున్; ఉపరోధింపకుము= అడ్డు పెట్టకుము; ఏ+భంగులన్= ఏ రీతులలో ఆలోచించినా; ఇంత+పట్టు= ఇంతమాత్రం; చనవు= చొరవతోడి కోరికను; ఈన్= ఇవ్వటానికి; యుక్తుండవు= తగినవాడవు.

**తాత్పర్యం:** 'నిరాహారదీక్షవలన ఏర్పడిన బడలిక నా హృదయంలో ఏమాత్రం కన్పించటం లేదు. ఈ అడవి అందంతో శోభిల్లే పువ్వులు చిగురుటాకులు పండ్లు మున్నగు వాటిని కాచే లతలతో, చెట్లతో కూడిందని విన్నాను. ఈ అడవిని చూడాలని నామనసు ఉవ్విళ్ళూరుతున్నది. నన్ను ఆటంకపరచకుము. ఏవిధంగా ఆలోచించినను ఈ మాత్రం చనవు నీవు నా కీయదగునుకదా!'

**వ. అనిన నతం 'డట్లకాక చనుదె' మ్మనుటయు సావిత్రి చయ్యనంజని భార్యాసహితుం డయి యున్న తనమామకుం బ్రణమిల్లి 'మీకొడుకు వనంబునకు నగ్నిహోత్రార్థంబు సమిధలు దేర నరిగెడు; నాకును నతనితోడన చని వనంబు సూడ వేడుక యయ్యెడు; మీరు నా కివ్వరంబు గృప సేయవలయు' ననిన వారును 'నిమ్మగువ యెన్నండును నెయ్యదియును నడుగ; దిత్తెఱంగు దీనికిం బ్రియంబై యున్నది; మాకు నివారింప నేల?' యని తలంచి యనుమతించుటయు, నయ్యిరువుర యడుగులం బడి వీడ్కొని. 41**

**ప్రతిపదార్థం:** అనినన్= అని సావిత్రి చెప్పగా; అతండు= అతడు- సత్యవంతుడు; అట్లు+అ, కాక= అటులే జరుగుగాక; చనుదెమ్ము= రమ్ము; అనుటయున్= అని అనగానే; సావిత్రి= సావిత్రి; చయ్యనన్= వేగంగా; చని= వెడలి; భార్యాసహితుండు+ అయి= భార్యతో కూడినవాడయి; ఉన్న= ఉన్నటువంటి; తనమామకున్= ద్యుమత్సేనుడికి; ప్రణమిల్లి= నమస్కరించి; 'మీకొడుకు= మీపుత్రుడు - సత్యవంతుడు; వనంబునకున్= అడవికి; అగ్నిహోత్ర+అర్థంబు= అగ్నికార్యంకొరకు; సమిధలు= మోదుగుపుల్లలు

మొదలైనవి; తేరన్= తేవటానికి; అరిగెడున్= వెడలుతున్నాడు; నాకును= నాకుకూడ; అతనితోడన్+అ= ఆయనతోడనే; చని= వెళ్ళి; వనంబు= అడవిని; చూడన్= చూచుటకు; వేడుక+అయ్యెడున్= కుతూహలం కలిగింది; మీరు= మీరు (అత్తమామలు); నాకున్= నాకు; ఈ+వరంబు= ఈ విశేషమైన కోరిక; కృప+చేయవలయున్= అనుగ్రహించవలెను;' అనినన్= అని (సావిత్రి) చెప్పగా; వారును= ఆ అత్తమామలును; ఈ+మగువ= సావిత్రి; ఎన్నండును= ఎప్పుడును; ఎయ్యదియును= ఏదియున్నూ; అడుగదు= కోరదు; ఈ+తెఱంగు= ఈ రీతి; దీనికిన్= ఈమెకు - సావిత్రికి; ఎన్నండును= ఎప్పుడును; ఎయ్యదియును= ఏదియున్నూ; అడుగదు= కోరదు; ఈ+తెఱంగు= ఈ రీతి; దీనికిన్= ఈమెకు- సావిత్రికి; ప్రియంబు+ఐ+ ఉన్నది= ఇష్టం అయి ఉన్నది; మాకున్; నివారింపన్+ఏల= వద్దనటం ఎందుకు? అని తలంచి= అని ఆలోచించి; అనుమతించుటయున్= అంగీకరించుటయున్నూ; ఆ+ఇరువుర+ అడుగులన్+పడి= ఆ ఇద్దరిపాదాలపై వ్రాలి (నమస్కరించి); వీడ్కొని= వెళ్ళుటానికి సెలవు గైకొని.

**తాత్పర్యం:** అని సావిత్రి చెప్పగా సత్యవంతుడు, 'సరే రమ్మ' అన్నాడు. అంతట సావిత్రి వేగంగా వెడలి, భార్యతో పాటుగ నున్న మామగారు ద్యుమత్సేనుడికి నమస్కరించి 'మీకొడుకు అగ్నికార్యాలు చేయటానికి చిదుగులు తేవటానికి అరణ్యంలోకి పోతున్నాడు. నాకును ఆయనతో కలిసి వెళ్ళి అరణ్యాన్ని దర్శించవలెనని కుతూహల మేర్పడింది. మీరు నా యీ కోరికను అనుగ్రహించవలెను' అని విన్నవించుకొన్నది. ఆ అత్తమామలు, 'ఈ సావిత్రి ఎన్నడూ ఏదీ మనలను ఇంతవరకు కోరిందిలేదు. అరణ్యాన్ని దర్శించటానికి ఈ రీతిగా వేడుక పడుతున్నది. మన మెందుకు ఈమెను నివారించాలి?' అని తలపోసి అంగీకరించారు. సావిత్రి అత్తమామలు ఇరువురి పాదాలకు మ్రొక్కి, వెళ్ళటానికి సెలవు తీసికొన్నది.



**సత్యవంతుఁడు సావిత్రీ సహితుండై వనంబునకుం బోవుట (సం. 3-280-29)**

**క. చిత్తంబునఁ బైకొనియెడు।**
**నుత్తలము నడంచి ముఖపయోరుహమునఁ ద**
**ళ్కొత్తెడు వెడనవ్వునఁ బ్రియు।**
**చిత్తం బిగురొత్తఁ జనియెఁ జెలువ యడవికిన్. 42**

**ప్రతిపదార్థం:** చెలువ= సుకుమారి సావిత్రి; చిత్తంబునన్= మనస్సులో; పైకొనియెడు= ఉబికివచ్చే; ఉత్తలమున్= పరితాపాన్ని; అడంచి= అణచికొని; ముఖ, పయస్+ రుహమునన్= మొగం అనే పద్మంలో; తళ్కు+ఒత్తెడు= వెలుగొందే; వెడనవ్వునన్= చిరునవ్వుతో; ప్రియుచిత్తంబు= భర్తమనస్సు; ఇగురు+ఒత్తన్= చిగురించగా; అడవికిన్= అరణ్యానికి; చనియెన్= వెళ్ళింది.

**తాత్పర్యం:** అంతరంగంలో చెలరేగిన విచారాన్ని అణచివేసికొంటూ, ముఖపద్మంలో మందహాసం వెలుగొందగా, ప్రియుడైన సత్యవంతుడిమనస్సు చిగురించేటట్లుగా సుకుమారి అయిన సావిత్రి అరణ్యానికి వెళ్ళింది.

**వ. ఇట్లాదంపతులు మందగమనంబున నరిగి పరిసరారణ్యంబు దఱియం జొచ్చి; రప్పుడు. 43**

**ప్రతిపదార్థం:** ఇట్లు= ఈ విధంగా; ఆ దంపతులు= ఆ భార్యాభర్తలు, సావిత్రీ సత్యవంతులు; మందగమనంబునన్= మెల్లనినడకతో; అరిగి= వెళ్ళి; పరిసర+ అరణ్యంబు= సమీపాన ఉన్న అడవి; తఱియన్+చొచ్చిరి= సమీపానికి చేరారు; అప్పుడు= ఆ సమయంలో.

**తాత్పర్యం:** ఈ విధంగా ఆ దంపతులు సావిత్రియు సత్యవంతుడును మెలమెల్లగా నడచి, సమీపంలో ఉన్న అరణ్యాన్ని సమీపించారు. ఆ సమయంలో.

**సీ. కమనీయ కమలినీ కల్లోలవీథులఁ।**
**గదలు రాయంచలగతుల యొప్పు,**

**బహుపుష్పపల్లవప్రకర చిత్రితములై ।**
**తనరారు తరులతాతతుల సొంపు,**
**మకరందరసపానమదవిలోలంబులై ।**
**క్రాలెడి యెలదేఁటి గముల యులివుఁ,**
**బరిపక్వమంజుల ఫలరసోద్ధతములై ।**
**పలుకు రాచిలుకలు పటురవంబుఁ,**

**ఆ. బ్రియుఁడు వేఱు వేఱ ప్రీతిమైఁ జూపుచుఁ ।**
**జెప్పుచును జనంగఁ జిగురుఁ బోఁడి**
**గనుచు వినుచు నిర్వికారసల్లాప మిం ।**
**పార నతనితెఱఁగు నరయుచుండె. 44**

**ప్రతిపదార్థం:** కమనీయ, కమలినీ, కల్లోలవీథులన్= సుందరా లైన సరోవరాల కెరటాలనే తెరువులలో (వరుసలలో); కదలు= నడయాడు; రాయంచల= రాజహంసల; గతుల+ ఒప్పు= కదలికల అందం; బహు, పుష్ప, పల్లవ, ప్రకర, చిత్రితములు+ఐ= పెక్కుపువ్వుల యొక్క, చిగురుటాకుల సముదాయాలయొక్క రంగురంగులతో శోభిల్లునవై; తనరారు= విలసిల్లే; తరులతాతతులసొంపు= చెట్లయొక్కయు, తీగెలసమూహాల యొక్కయు సొగసు; మకరంద, రస, పాన, మద, విలోలంబులు+ఐ= తేనెద్రవాన్ని త్రాగటంచేత మత్తెక్కి చరించేవి అయి; క్రాలెడి= ఒప్పెడి; ఎలతేఁటిగముల= కొదమ తుమ్మెదలయొక్క; ఉలివున్= ఝంకారమునూ; పరిపక్వమంజుల ఫలరస+ ఉద్ధతములు+ఐ= పండినవీ మనోహరములైనవీ అయిన పండ్లరసం త్రాగటంచేత గర్వించినవి అయి; పలుకు= మాటాడు; రాచిలుకన్= గండుచిలుకల; పటురవంబున్= పెనురవళులును; ప్రియుఁడు= భర్త-సత్యవంతుడు; వేఱువేఱ= విడివిడిగా; ప్రీతిమైన్= ప్రియమార; చూపుచున్= చూపి; చెప్పుచును= వివరంగా వచిస్తూ; చనంగన్= నడువగా; చిగురుఁబోఁడి= చిగురుటాకులవంటి సుకుమారమైన శరీరం కల సావిత్రి; కనుచున్= చూస్తూ; వినుచున్= ఆలకిస్తూ; నిర్+వికార, సల్లాపము= వికారం లేని మధురభాషణం; ఇంపారన్= ప్రీతి గొలుపగా; అతని తెఱఁగున్= అతడితీరు (సత్యవంతుడితీరుతెన్నులు); అరయుచున్+ ఉండెన్= గమనిస్తూ ఉండింది.



**తాత్పర్యం:** రమణీయసరోవరాల కెరటాల వరుసలలో తేలియాడే రాజహంసల నడలతీరుతీయాలున్నూ, పెక్కుపువ్వులతో, చిగురుటాకులతో రంగురంగులు వెల్లివిరిస్తూ శోభిల్లే చెట్ల, తీగలసొగసున్నూ, తేనెద్రవాన్ని గ్రోలి మత్తెక్కి విహరించే కొదమతుమ్మెదల ఝంకారాలున్నూ, పండినపండ్ల మెత్తనిగుజ్జురసం పీల్చి పొగరెక్కి మాటలు పలికే చిలుకల కలరవాలనూ సత్యవంతుడు విడివిడిగా చూపిస్తూ, వివరించి చెప్పుతూ వెళ్ళుతున్నాడు. చిగురుటాకులవంటి సుకుమారమైన దేహం గల సావిత్రి ప్రియుడు చూపించే సుందరదృశ్యాలను చూస్తూనే ఉన్నది; ప్రియుడు చెప్పే మాటల నాలకిస్తూ ఉన్నది. నిర్వికారసల్లాపాలతో ఆమె అతడికి బదులు చెబుతూఉంటూనే అతడికి తెలియకుండా ఆతని తీరుతెన్నులను పరిశీలిస్తూ ఉన్నది.

**విశేషం:** సత్యవంతుడు సౌందర్యలాలసుడై ప్రకృతివైభవాన్ని సహృదయతతో అరసి సావిత్రికి చూపుతున్నాడు. వర్ణించి చెప్పుతున్నాడు. ఆతడికి రానున్న విపత్తునుగూర్చి తెలియనే తెలియదు. సావిత్రికి రాబోయేఘోరవిపత్తును గూర్చి తెలియును గదా. ఆమె నిర్వికారసల్లాపచాతురి ఉగ్గడించదగింది.

**వ. తదనంతరంబ యారాజర్షినందనుండు మధురంబు లగు ఫలంబులు గోయుచు గరిడియ నిండించి, యొక్కయెడఁ బరశుపాతంబునఁ గాష్ఠదళనంబు సేయందొడంగి శ్రమంపడి యొల్లంబోయి గొడ్డలి పుడమిపై వైచి, నిరంతరనిశ్వాసవేగవిషణ్ణవదనుం డగుచు సావిత్రిం గనుంగొని. 45**

**ప్రతిపదార్థం:** తద్+అనంతరంబు+అ= అటు పిమ్మట; ఆరాజ+ఋషి, నందనుండు= రాజులలో ఋషి అయిన ద్యుమత్సేనుడికొడుకు సత్యవంతుడు; మధురంబులు+అగు= తియ్యనివి అయిన; ఫలంబులు= పండ్లు;

కోయుచున్= త్రెంపుచు; గరిడియ= గంప; నిండించి= నింపి; ఒక్క+ఎడన్= ఒక్కచోట; పరశు, పాతంబునన్= గండ్రగొడ్డలి వ్రేటుచేత; కాష్ఠదళనంబు+ చేయన్+తొడంగి= కట్టెలు నరకటానికి పూని; శ్రమంపడి= అలసటచెంది; ఒల్లన్+పోయి= డస్సి; గొడ్డలి= పరశువు; పుడమిపైన్= భూమిపై; వైచి= వేసి; నిరంతర, నిశ్వాస, వేగ, విషణ్ణ, వదనుండు+అగుచున్= విడువకుండ వెడలే నిట్టూర్పులవేగంచేత విషాదం పొందిన మొగం కలవాడు ఔతూ; సావిత్రిన్= సావిత్రిని; కనుంగొని= చూచి.

**తాత్పర్యం:** అటుపిమ్మట రాజర్షి యగు ద్యుమత్సేనుడిసుతుడైన సత్యవంతుడు తియ్యనిపండ్లను కోసి బుట్టను నింపాడు. అనంతరం గొడ్డలితో కట్టెలను నరకుతూ అలసటచెంది, గొడ్డలి పుడమిపై విడిచాడు. ఎడతెగని నిట్టూర్పులు విడుస్తూ విషాదం చెంది, సావిత్రిని చూచి.

**చ. 'ఒడలు వశంబు గాదు, భ్రమ నొందినయట్లు మనంబు దూలెడిం,**
**గడఁగి శిరంబు శూలవిశిఖప్రకరంబున నొంచినట్టి ద**
**య్యెడు, నిలువంగ నోప; నొకయించుకసేపు శ్రమంబు దీఱ నీ**
**యెడ శయనింతు' నావుడు సితేక్షణ మెత్తని సంభ్రమంబుతోన్. 46**

**ప్రతిపదార్థం:** ఒడలు= శరీరం; వశంబు+కాదు= స్వాధీనంలో లేదు; మనంబు= చిత్తం; భ్రమన్= మోహము; ఒందిన+అట్లు= పొందినట్లు; తూలెడిన్= వణకి వాలు తున్నది; కడఁగి= పూని; శిరంబు= తల; శూలవిశిఖ ప్రకరంబునన్= బల్లెములు బాణాల సమూహంచేత; నొంచినట్టిది+ అయ్యెడున్= నొప్పి కలిగించినట్టిది అయింది; నిలువంగన్+ఓపన్= నిలబడ జాలను; ఒక+ఇంచుక, సేపు= ఒకకొంతసేపు; ఈ+ఎడన్= ఈ చోట; శ్రమంబు+తీఱన్= అలసట తగ్గేటట్లుగా; శయనింతున్= పండుకొంటాను; నావుడున్= అని (సత్యవంతుడు) చెప్పగా; సిత+ఈక్షణ= తెల్లని కాంతితో గూడిన కన్నులు (చూపులు) గల సావిత్రి; మెత్తని సంభ్రమంబుతోన్= మృదువయిన తత్తరపాటుతో.



**తాత్పర్యం:** 'శరీరం స్వాధీనం తప్పింది. మనస్సు భ్రమచెందినట్లు తూలుతున్నది. బల్లేలతో బాణాలతో పొడిచినట్లు తలపోటు పుట్టుతున్నది; కొంచెంసేపుకూడ ఇక నిలువలేను. అలసట తీరేవరకు శయనిస్తాను' అని సత్యవంతుడు పలుకగా, సావిత్రి మృదువైన తత్తరపాటుతో.

**క. తనయంకతలము ప్రియుశిర।**
**మున కుపధానముగఁ జేయ భూపతనయుఁ డొ**
**య్యన వ్రాలి సోలి నిశ్చే।**
**తనుఁడైనట్లుండెఁ; గొంతతడవున కెదురన్. 47**

**ప్రతిపదార్థం:** తన+అంక, తలమున్= తన ఒడిని; ప్రియుశిరమునకున్= భర్తయొక్కతలకు; ఉపధానముగన్= తలగడగా; చేయన్= అమర్చగా; భూప తనయుఁడు= రాజకుమారుడు - సత్యవంతుఁడు; ఒయ్యనన్= తిన్నగా; వ్రాలి= ఒరిగి; సోలి= వివశత్వం పొంది; నిశ్చేతనుఁడు+ఐనట్లు+ఉండెన్= ప్రాణాలు లేనట్టివాడుగా ఉండినాడు; కొంత తడవునకున్= కొంతసేపటికి; ఎదురన్= ఎదురుగా.

**తాత్పర్యం:** సావిత్రి తన అంకతలాన్ని భర్తకు తలగడగా చేసింది. రాజకుమారుడైన సత్యవంతుడు తిన్నగా దానిపై వ్రాలి వివశత్వం చెంది, చైతన్యం లేనివాడుగా ఉండిపోయాడు. కొంతసేపటికి ఎదురుగా.

**మ. కనియెం గోమలి నీలమేఘవిలసత్కాలాంజనాకారు, ఘో**
**రనిశాతోత్కటదంష్ట్రు, నుజ్జ్వలచలద్రక్తాక్షుఁ, బ్రత్యగ్ర కాం**
**చనవర్ణాంబరు, నంత్యకాలదహనజ్వాలాప్రచండున్, జగ**
**జ్జనసంత్రాసను, నొక్కదివ్యుఁ, బటుపాశప్రౌఢహస్తోద్ధతున్. 48**

**ప్రతిపదార్థం:** నీల, మేఘ, విలసత్కాల+అంజన+ఆకారున్= నల్లని మబ్బువలె శోభిల్లే నల్లని కాటుకవంటి రూపం కలవాడిని; ఘోర, నిశాత, ఉత్కట, దంష్ట్రున్= భయంకరమై, వాడిఅయి, క్రూరములైన కోరలు కలవాడిని;

ఉత్+జ్వల, చలత్+రక్త+అక్షున్= ప్రకాశ మానాలై చలించే ఎర్రనికన్నులు కలవాడిని; ప్రత్యగ్రకాంచనవర్ణ+అంబరున్= పరిశుద్ధమైన బంగారురంగుతో కూడిన వస్త్రాలు కలవాడిని; అంత్య, కాల, దహన, జ్వాలాప్రచండున్= ప్రళయకాలంలోని అగ్నిశిఖవలె భయంకరమైన ఆకృతికలవాడిని; జగత్+జన, సంత్రాసనున్= లోకంలోని జనులకు భీతిని కలిగించేవాడిని; ఒక్కదివ్యున్= ఒకవేలుపును; పటు, పాశ, ప్రౌఢ, హస్త+ ఉద్ధతున్= తీక్ష్ణమైన పాశాయుధమును ధరించుటయందలి నేర్పుతోగూడిన చేతిచేగర్వించినవాడిని; కోమలి= సుకుమారి- సావిత్రి; కనియెన్= చూచింది.

**తాత్పర్యం:** సుకుమారి సావిత్రి తనకట్టెదుట ఒక వేలుపుదొరను చూచింది. ఆ దివ్యపురుషుడు నల్లనిమబ్బువలె శోభిల్లే నల్లనికాటుకవంటి ఆకారం కలవాడు, భయంకరమై వెలుపలికి వ్యాపించిన వాడికోరలు గలవాడు, నెత్తురు రంగు కలిగి మిలమిల మెరసే నేత్రాలు కలవాడు, తళతళలాడే బంగారురంగుతో వెలుగొందే బట్టలు ధరించినవాడు, ప్రళయకాలంలోని అగ్నిజ్వాలవలె మండేవాడు, లోకంలోని జనులకు భీతిని కలిగించేవాడు, గొప్పపాశాయుధాన్ని ఒడుపుగా త్రిప్పే నేర్పుగల హస్తం చేత గర్వించినవాడు.

**విశేషం:** (1) ఆ లోకభీకరమూర్తిని చూచినది ఎవరు??.... "కోమలి" సావిత్రి ఇది హృదయంగమమైన ప్రతియోగస్ఫూర్తి. (2) అసాధారణం ఆశ్చర్యకరమునైన దృశ్యాన్ని ఆకస్మికంగా కన్నులు చెదరేటట్లు కన్పించటాన్ని వర్ణించటం కవితాకళలోని ఉన్నతశిఖరాలలో ఒకటి. అర్వాచీనకవులకు ఎఱ్ఱనపద్యం చక్కని చిక్కని ఒరవడి తీర్చిదిద్దింది. ఇందు - 'కనియెన్' - అనే ఒక్కపదంమాత్రమే తెలుగు. పద్యం అంతా ప్రౌఢ సంస్కృతసమాస భూయిష్ఠం. ఇట్లే - తరువాతి కాలంలో ఎన్నోపద్యాలు "అటచని కాంచె భూమిసురుఁడు' - (అల్లసానిపెద్దనగారి మనుచరిత్రలోనిది) మున్నగునవి అవతరించాయి.

**వ. అప్పురుషుండును నధికసంరంభంబున సత్యవంతుం గదిసిన నయ్యింతి యెంతయు భయంబునం బ్రియునిశిరం బొయ్యన దిగువం జేర్చి**



**నిల్చి కృతాంజలియై 'యయ్యా! నీ వెవ్వ? రియ్యెడకు నెయ్యది సేయం దలంచి విజయంచేసి?' తనిన నతం డిట్లనియె.** **49**

**ప్రతిపదార్థం:** ఆ+పురుషుండును; అధిక, సంరంభంబునన్= మిక్కుటమైన దర్పంతోకూడిన వేగిరపాటుతో; సత్యవంతున్= సత్యవంతుడిని; కదిసినన్= సమీపించగా; ఆ+ఇంతి= సావిత్రి; ఎంతయున్= మిక్కుటమైన; భయంబునన్= భీతితో; ప్రియుని శిరంబు= భర్తతల; ఒయ్యనన్= మెల్లగా; దిగువన్+చేర్చి= క్రింద పెట్టి; నిల్చి= నిలబడి; కృత+అంజలి+ఐ= చేసిన నమస్కారం కలది అయి (నమస్కరించినదై); అయ్యా!= ఆర్యా!; నీవు+ఎవ్వరు?= నీవు ఎవరవు?; ఈ+ఎడకున్= ఈ చోటికి; ఎయ్యది+ చేయన్+ తలంచి= ఏ పనిని చేయటానికి ఆలోచించి; విజయంచేసితి= విచ్చేశావు?; అనినన్= అని (సావిత్రి) అడుగగా; అతండు= ఆ దివ్యపురుషుడు; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నాడు.

**తాత్పర్యం:** ఆ దివ్యపురుషుడు మిక్కుటమైన దర్పంతో కూడిన వేగిరపాటుతో సత్యవంతుడిని సమీపించగా సావిత్రి మిక్కిలి భయపడి భర్తతలను మెల్లగా క్రిందికి దింపి, నిలబడి నమస్కరించి, 'ఆర్యా, నీవు ఎవ్వరవు? ఇక్కడకు ఏ పనిచేయటానికై ఇప్పుడు వచ్చావు?' అని ప్రశ్నించింది. అంతట ఆ దివ్యపురుషుడు సావిత్రితో ఈ విధంగా అన్నాడు.

**సీ. 'కాలుండఁ జువ్వె యేఁ గమలాక్షి! నను నీవు ।**
**మహిత పాతివ్రత్యమహిమఁజేసి**
**కానంగఁ జాలితి; కానరా దన్యుల; ।**
**కిదె నీదుభర్తకు నిపుడు కాల**
**మగుటయు వీఁడు మహాపుణ్యనిధి గాన ।**
**యితరులఁ బనుపక యేన వీనిఁ**
**గ్రచ్చఱఁ గొనిపోవఁగాఁ జనుదెంచితి' ।**
**నని యుగ్రభంగి నయ్యంతకుండు**

**ఆ. ధరణినాథతనయుతనువునఁ బ్రాదేశ।**
**పరిమితాత్ముఁ డగుచుఁ బ్రజ్వరిల్లు**
**జీవు వెడలఁ దిగిచి, చెచ్చెర నతిదీర్ఘ।**
**భయదపాశనికరబద్ధుఁ జేసి. 50**

**ప్రతిపదార్థం:** కమల+అక్షి!= పద్మాలవంటి కన్నులు కలదానా ఓ సావిత్రీ!; ఏన్= నేను; కాలుండన్+చువ్వె= యముడను సుమా; ననున్= నన్ను; ఈవు= నీవు; మహిత, పాతివ్రత్య మహిమన్+చేసి= గొప్పదైన పాతివ్రత్య శక్తివలన; కానంగన్+చాలితి(వి)= చూడగలిగావు; అన్యులకున్= ఇతరులకు; కాన, రాదు= కనపడదు, చూడటానికి సాధ్యం కాదు; ఇది+ఎ= ఇదిగో (విను); నీదు+భర్తకున్= నీమగనికి; ఇపుడు= ఈ సమయంలో; కాలము+ అగుటయున్= ఆయువు తీరటంచేత; వీఁడు= నీభర్త - సత్యవంతుడు; మహా, పుణ్య, నిధి= గొప్ప సుకృతానికి నిక్షేపమైనవాడు; కాన= కావున; ఇతరులన్= ఒరులను (నాభటులను); పనుపక= నియోగించక; ఏను+అ= నేనే; వీనిన్= ఇతడిని (సత్యవంతుడిని); క్రచ్చఱన్= వెంటనే; కొనిపోవఁ గాన్= తీసికొనిపోవటానికై; చనుదెంచితిన్= వచ్చాను; అని= అని పలికి; ఆ+అంతకుండు= ఆ యముడు; ఉగ్రభంగిన్= భయంకర రీతిని; ధరణినాథ తనయుతనువునన్= రాజకుమారుడైన సత్యవంతుడిశరీరంలో; ప్రాదేశపరిమిత+ఆత్ముఁడు+అగుచున్= చూపుడువ్రేలు బొటనవ్రేలు చాపగా నైన నడిమి కొలతకు లోబడిన ఆకృతి కలవాడు ఔతూ; ప్రజ్వరిల్లు= వెలుగొందే; జీవున్= జీవుడిని (ఆత్మను); వెడలన్+తిగిచి= బయటకు వచ్చేటట్లు లాగి; చెచ్చెరన్= శీఘ్రంగా; అతి, దీర్ఘ, భయదపాశ నికర, బద్ధున్+చేసి= మిక్కుటమైన నిడివి కలిగి, భీతిని గొలిపే త్రాళ్ళసముదాయం చేత కట్టబడినవాడినిగా చేసి.

**తాత్పర్యం:** 'పద్మాలవంటి కన్నులు కల సావిత్రీ! నేను యమధర్మరాజును సుమా! నీవు గొప్పపతివ్రతవు కాబట్టి నన్ను చూడగలిగావు. సామాన్యమానవులు



నన్ను చూడజాలరు. నీభర్త అయిన సత్యవంతుడికి ఆయువు తీరింది. ఆతడు గొప్ప పుణ్యాత్ముడు కాబట్టి నేనే స్వయంగా వచ్చాను. ఈ పనిని ఇతరులకు అప్పగించలేదు.' అని పలికి ఆ యముడు మిక్కిలి నిడివియైన పాశాలను భయంకరరీతిలో ప్రయోగించి రాజకుమారుడైన సత్యవంతుడి శరీరంనుండి జుత్తిలి కొలతగల జీవుడిని బంధించి బయటకు లాగాడు.

**విశేషం:** ఈపద్యంలో "ప్రాదేశ పరిమితాత్ముడగుచుఁ బ్రజ్వరిల్లు జీవుఁడు" - అనే ఈ ప్రయోగం మిక్కిలి ప్రౌఢమైనది. ఆత్మస్వరూపాన్ని గూర్చి ఉపనిషత్తులలో సవిస్తరంగా చెప్పబడింది. ఉపనిషత్సారమైన భగవద్గీత భారతంలో ప్రకరణాంతరాన నిర్వచించబడింది. యముడు పాశవితతిచేత బంధించినది సత్యవంతుడి శరీరంలోని జీవుడిని మాత్రమే.

**మ. కొని వేగంబున దక్షిణాభిముఖుఁడై ఘోరంపుమార్గంబునం**
**జనఁగాఁ జొచ్చె; ననంతరంబ మదిలో సావిత్రి శోకంబు పై**
**కొనఁ బ్రాణేశ్వరుదేహ మొక్కయెడ సంగుప్తంబు గావించి యా**
**తనిపజ్జం దగఁ దాను నేఁగెఁ బదపద్మంబుల్ పారిం దొట్రిలన్. 51**

**ప్రతిపదార్థం:** (యముడు); కొని= (సత్యవంతుడి జీవుడిని) తీసికొని; వేగంబునన్= త్వరగా; దక్షిణ+అభిముఖుఁడు+ఐ= దక్షిణదిక్కుకు మొగం కలవాడై; ఘోరంపు మార్గంబునన్= భయంకరమైన దారివెంబడిని; చనఁ గాన్+చొచ్చెన్= వెడలసాగాడు; అనంతరంబు+అ= అటుపిమ్మట; సావిత్రి= సావిత్రి; మదిలోన్= చిత్తంలో; శోకంబు= దుఃఖం; పైకొనన్= విస్తరిల్లగా; ప్రాణ+ఈశ్వరు, దేహము= భర్తయొక్క శరీరం; ఒక్క+ ఎడన్= ఒకచోట, సంగుప్తంబు+కావించి= భద్రం చేసి; ఆతని పజ్జన్= ఆతడివెంట (యముడివెంట); తగన్= ఒప్పిదంగా; తాను= తాను సావిత్రి; పదపద్మంబుల్= అడుగుదమ్ములు (పద్మాలవంటి పాదాలు); పారిన్= మాటిమాటికి; తొట్రిలన్= తడబడగా; ఏగెన్= వెళ్ళింది.

**తాత్పర్యం:** యమధర్మరాజు సత్యవంతుడి శరీరంలోని జీవుడిని పరిగ్రహించి, భయంకరమైనదారిబట్టి దక్షిణదిక్కుగా వెడలసాగాడు. దుఃఖపరితప్తురాలైన సావిత్రి తనప్రాణేశ్వరుడిదేహాన్ని ఒకచోట భద్రంగా దాచిపెట్టి యమధర్మరాజును వెంబడించింది. పద్మాలవలె సుకుమారమైన ఆమెపాదాలు ఆ భయంకరమార్గంలో నడిచేటప్పుడు మాటిమాటికి తడబాటుచెందుతున్నా ఆమె పయనం సాగించింది.

**ఆ. దానిఁ జూచి దండధరుఁడు 'నీ విట్లేల ।**
**వచ్చెదవు లతాంగి! వలదు నిలువు**
**మింక; నీ కగమ్య మిటమీఁది తెరువెల్ల' ।**
**ననిన నతని కిట్టు లనియెఁబొలఁతి. 52**

**ప్రతిపదార్థం:** దానిన్+చూచి= ఆమెను (సావిత్రిని) కాంచి; దండధరుఁడు= యముడు; లతా+అంగి!= తీగవలె సుకుమార మైన దేహం కలదానా, ఓ సావిత్రీ!; నీవు= నీవు; ఇట్లు= ఈ రీతిగా; ఏల= ఎందుకు; వచ్చెదవు= వస్తావు; వలదు= రావలదు; నిలువుము= ఆగుము; ఇంకన్= ఇకమీద; ఇట మీఁదితెరువు= పైన ఉన్న మార్గం; నీకున్= నీకు; అగమ్యము= పయనించ శక్యం గానిది; అనినన్= అని (యముడు) చెప్పగా; అతనికిన్= ఆ యముడికి; పొలఁతి= పడతి సావిత్రి; ఇట్టులు= ఈ రీతిగా; అనియెన్= వచించింది.

**తాత్పర్యం:** యముడు సావిత్రిని చూచి 'లతవలె కోమలమైన శరీరం కలదానా! నీవు ఎందుకు ఈ విధంగా నన్ను వెంబడిస్తున్నావు? ఇక రావలదు. ఆగుము. ఇకపై నున్న దారి నీవు పయనించరానిది. వెనుకకు మరలిపొమ్ము.' అని చెప్పాడు. ఆ యమధర్మరాజుకు సావిత్రి ఇట్లా బదులు పలికింది.

**క. 'పతు లెందుఁ జనిన నచటికి ।**
**సతులుం జనవలదె? నీప్రసాదమునను మ**
**త్పతిభక్తికతమునను సం ।**
**స్తుతగుణ! నా కరుగరానిచోటుం గలదే? 53**



**ప్రతిపదార్థం:** సంస్తుతగుణ!= బాగా పొగడబడిన గొప్పగుణాలు కలవాడా, ఓ యమధర్మరాజా!; పతులు= భర్తలు; ఎందున్+చనినన్= ఎచటకు వెళ్లినా; అచటికిన్= ఆ చోటికి; సతులున్= భార్యలును; చనన్వలదె= వెళ్లవలదా? వెళ్లవలెనుకదా; నీ ప్రసాదమునను= నీ అనుగ్రహంవలననూ; మత్+పతిభక్తి, కతమునను= నాకు భర్తయందు ఉన్న పూజ్యభావం కారణంగా; నాకున్= నాకు; అరుగరాని= చేరరాని; చోటున్= స్థలమన్నది; కలదే?= ఉన్నదా? (లేదు).

**తాత్పర్యం:** 'భర్తలు ఎక్కడికి వెళ్ళితే అక్కడికి భార్యలు కూడ వెళ్ళవలెను కదా. బాగా పొగడబడిన గొప్ప గుణాలుకల ఓ యమ ధర్మరాజా! నీ కారుణ్యంవలనను, నాకు భర్తపై గల పూజ్యభావంవలనను నేను చేరలేనిచోటు లేదు.

**వ. సకలమార్గంబులయందును ధర్మమార్గంబు ప్రధానం; బట్టి ధర్మంబునకు నాధారంబు సజ్జనుల యని వినంబడు; సజ్జనసందర్శనం బెప్పుడువృథగాదు గావున సజ్జనశేఖరుండ వనంజను నీదైన సందర్శనంబునం బరమశుభంబు నొందక యేను రిత్తజనంబులతెఱంగున నూఱక యెట్లు మగుడుదు?' ననిన దాని ప్రగల్భవచనంబులకు నద్భుతం బంది ధర్ముం డిట్లనియె. 54**

**ప్రతిపదార్థం:** సకలమార్గంబులయందును= అన్నితెరువులలోను; ధర్మ మార్గంబు= ధర్మంతో కూడిన దారి; ప్రధానంబు= ముఖ్యమైనది; అట్టి= అటువంటి; ధర్మంబు నకున్= ఈ జగతిని సవ్యంగా నడపే ఆధర్మానికి; ఆధారంబు= మూలం; సజ్జనులు+ అ= మంచివారుమాత్రమే; అని= అని; వినంబడున్= పెద్దలు చెప్పేమాటలు వినబడతాయి; సత్+జన, సందర్శంబు= మంచివారల దర్శనం; ఎప్పుడున్= ఎన్నడును; వృథ+కాదు= వ్యర్థం కాదు; కావునన్= కాబట్టి; సజ్జన, శేఖరుండవు+అనన్+చను= మంచివారిలో శ్రేష్ఠుడవు అని చెప్పదగిన; నీదైన= నీయొక్క; సందర్శనం బునన్= సాక్షాత్కారంవలన;

పరమశుభంబున్+ఒందక= గొప్ప మేలు పొందక; ఏను= నేను; రిత్త, జనంబుల, తెఱంగునన్= వ్యర్థులు అయిన ప్రజలపోలిక; ఊఱక= నిరుప యోగంగా; ఎట్లు= ఏరీతిగా; మగుడుదున్?= మరలివెళ్ల గలను? అనినన్= అని వచించగా; దాని= ఆమెయొక్క - (సావిత్రియొక్క) ప్రగల్భ, వచనంబులకున్= తెలివితేటలతో నిండిన మాటలకు; అద్భుతంబు+ అంది= అచ్చెరువు నంది; ధర్ముండు= యముడు; ఇట్లు+అనియెన్= ఈ రీతిగా పలికాడు.

**తాత్పర్యం:** అన్నిదారులలో ముఖ్యమైనదారి ధర్మమే. కాగా, ధర్మాన్ని అనుష్ఠించి చూపేవారు సజ్జనులు మాత్రమేకదా! అందుచేత సజ్జనులే ధర్మానికి ఆధారం - అని పెద్దలప్రవచనం. సజ్జనులలో నీవు శ్రేష్ఠుడవు, ధర్మరాజువు- అని చెప్పుతారు. సజ్జనసందర్శనం ఎన్నడూ వ్యర్థం కాదు. నీదివ్యసందర్శనం నాకు లభించింది కదా! దానివలన నేనేదైనా గొప్పమేలు పొందకుండా వ్యర్థజనులవలె ఊరక తిరిగిపోగలనా?' అని సావిత్రి విన్నవించింది. తెలివితేటలతో నిండిన ఆమెవాక్కులకు అచ్చెరువంది, యమధర్మరాజు ఇట్లా బదులు పలికాడు.

**విశేషం:** (1) ఈ గద్యంలోని విషయం మిక్కిలిప్రధానమైన దని, సావిత్రి వెలిబుచ్చిన అభిప్రాయాలు విలువగలవని ఎఱ్ఱనమహాకవి సహృదయులను సుకుమారసుందరంగా హెచ్చరించటానికి 'దానిప్రగల్భవచనంబులకు' యమధర్మరాజే అచ్చెరువు పొందినట్లు వ్రాశాడు. యముడు సావిత్రిని 'ఇటమీది తెరువు' 'నీకు అగమ్యము' అని హెచ్చరించాడు. ఆమె చెప్పినసమాధానం 'అన్నిదారుల కంటెను ధర్మం గొప్పదారి'. అయితే ధర్మం- కన్పించే తెరువు గాదు. అది అదృశ్యంగా ఉండే ఆదర్శవిశేషం. అట్టిధర్మాన్ని అనుష్ఠించే సజ్జనులు మాత్రమే చూడగలరు. సావిత్రి యమధర్మరాజునే- 'మూర్తీభవించినధర్మం' అని చెప్పదగిన వాడినే సందర్శించింది. సాధారణ మానవులు చర్మచక్షువులతో తనను చూడజాలరని ఆతడే వచించిఉన్నాడు. అందుచేత పరమపథమైన ధర్మాన్నే తాను అనుసరిస్తుండగా ఇక ఆమెకు అగమ్యమైన దారియే ఉండజాలదని



సావిత్రి యముడికి విన్నవించింది. తనమాటకు ఋజువుగా ఆమె యమధర్మరాజునందర్శనాన్నే పేర్కొన్నది. అందుచేత ధర్ముడు ఆశ్చర్యచకితుడయ్యాడు.

**ఆ. 'తనులతాంగి! భవదుదారవాగ్భంగికి।**
**మెచ్చు వచ్చె నాత్మ; నిచ్చువాఁడ**
**వేఁడు మొక్కవరము విభునిజీవితమొక్క।**
**టియును దక్కనేది యయిన నొండు.' 55**

**ప్రతిపదార్థం:** తనులతాంగి!= సన్నని సుకుమారమైన తీగవంటి శరీరం కలదానా, సావిత్రీ!; భవత్+ఉదార (భవదుదార,) వాక్+భంగికిన్= నీదైన గొప్పదైన మాటల తీరుకు; ఆత్మన్= మనస్సులో; మెచ్చువచ్చెన్= మెచ్చికోలు ఏర్పడింది; ఒక్కవరము= ఒకవిశిష్టమైన కోరిక; వేఁడుము= అర్థించుము; విభుని, జీవితము= భర్త జీవించటం అనే; ఒక్కటియును= ఒక్క అంశాన్ని; తక్కన్= తప్ప; ఏది+అయినన్= ఏదైన; ఒండు= వేరొకటి; ఇచ్చువాఁడన్= ఈయగలను.

**తాత్పర్యం:** 'సన్నని లతవంటి సుకుమారమైన శరీరం కల సావిత్రీ! నీమాటలు నామనస్సును అలరించాయి. నేను నిన్ను మెచ్చాను. నీభర్త జీవిత మొక్కటి తప్ప, మరి ఏవరమైనా కోరుకొమ్ము. నీకు ఆ వరాన్ని ఇవ్వగలను.'

సావిత్రి యమునివలన నభీష్టవరంబులు వడయుట (సం. 3-281-26)

**చ. అనవుడు మద్రరాజసుత ప్రాంజలియై సమవర్తితోడ ని**
**ట్లను 'రిపుకోటిచే నపజయంబును బొంది వనాంతరంబునం**
**దనవరతవ్రతాభిరతుఁ డైన మహాత్ముఁడు సాళ్వభూవిభుం**
**డనఘుఁడు లబ్ధచక్షుఁ డగు నట్టులుగాఁ గరుణింపవే మదిన్.' 56**

**ప్రతిపదార్థం:** అనవుడున్= అని యముడు చెప్పగా; మద్రరాజసుత= మద్రదేశాధిపతి అయిన అశ్వపతికూతురు సావిత్రి; ప్రాంజలి+ఐ= కైమోడ్పు

ఘటించినది అయి; సమవర్తితోడన్= యమధర్మరాజుతో; ఇట్లు+అనున్= ఈవిధంగా చెప్పింది; 'రిపుకోటి చేన్= శత్రుసమూహాలచేత; అపజయం బును+పొంది= పరాజయం పొంది; వన+ అంతరంబునందున్= అరణ్యం లోపల; అనవరత, వ్రత+అభిరతుఁడు+ఐన= ఎల్లప్పుడును నోములు నోమటంలోనే ఆసక్తి కలవాడయిన; మహా+ఆత్ముఁడు= మహానుభావుడు; అనఘుఁడు= పాపరహితుడు; పుణ్యాత్ముడు; సాళ్వభూవిభుండు= సాళ్వదేశాధిపతి ద్యుమత్సేనుడు; లబ్ధచక్షుఁడు= పొందిన కన్నులు కలవాడు; అగునట్టులుగాన్= అయినరీతిగా; మదిన్= మనస్సులో; కరుణింపవే= అనుగ్రహింపుమా.

**తాత్పర్యం:** అని యముడు చెప్పగా, సావిత్రి నమస్కరించి, అతడితో ఇట్లా పలికింది- 'శత్రువులచేత పరాభవం పొంది, మహానుభావుడైన సాళ్వదేశాధిపతి ఎల్లప్పుడు నోములునోస్తూ అరణ్యాలలో కాలం గడుపు తున్నాడు. ఆ మహానుభావుడు ద్యుమత్సేనుడు కన్నులు తిరిగిపొందేటట్లుగా దయతో అనుగ్రహించుము.'

**క. నావుడు 'నట్టుల యయ్యెడు;।**
**నీ విట రావలవ దుడుగు నెమ్మి' నని వెసం**
**బోవఁ దొడంగెను బితృపతి;।**
**యా వెలఁదియు నంత నిలువ కరిగెఁ బిఱుందన్. 57**

**ప్రతిపదార్థం:** నావుడున్= అని పలుకగా; 'అట్టుల+అయ్యెడున్= ఆ విధంగానే జరుగుగాక- (ద్యుమత్సేనుడికి గ్రుడ్డితనం పోయి తిరిగి దృష్టి లభించుగాక); నీవు= ఓ సావిత్రీ! నీవు; ఇటన్= ఇచటికి; రావలవదు= రావద్దు; నెమ్మిన్= ప్రీతితో; ఉడుగు(ము)= మానుము; అని= అని వచించి; వెసన్= వేగంగా; పితృపతి= యమ ధర్మరాజు; పోవన్+తొడంగెను= పోసాగాడు; ఆ వెలఁదియున్= ఆ వనితయు, సావిత్రియు; అంతన్= ఆ సమయంలో; నిలువక= ఆగక; పిఱుందన్= (యమధర్మరాజు) వెనుకనే; అరిగెన్= వెళ్ళింది.



**తాత్పర్యం:** సావిత్రి వరాన్ని కోరగా, 'సరే!, సాళ్వపతి ద్యుమత్సేనుడికి మరల దృష్టి ఏర్పడుగాక! నీవు కోరిన వరం ఇచ్చాను. ఇక సంతృప్తి చెంది నావెంబడి రావద్దు' అని చెప్పి యమధర్మరాజు పోసాగాడు. కాని, సావిత్రి యముడిని వెంబడించి వెళ్ళింది.

**వ. ఇట్లు సనిచని మఱియు నిట్లనియె. 58**

**తాత్పర్యం:** ఈవిధంగా చాలదూరం పోయి ఇంకా ఈ విధంగా అన్నది.

**చ. 'ఎడపక వాఙ్మనఃక్రియల నేరికి హింస యొనర్పఁబూన; రె**
**య్యెడలను దీనులం గరుణ యేర్పడఁ బ్రోవఁగఁజూతు; రిచ్చుచోఁ**
**గడమ పడంగ నీ కెదిరి కాంక్షితముల్ దుదిముట్టఁ దీర్తు; రె**
**క్కుడు మదిఁ గూర్తు రాశ్రితులకున్; విను మిన్నియు నార్యధర్మముల్.59**

**ప్రతిపదార్థం:** వినుము= వినుడు; ఎడపక= వ్యవధానం లేకుండా (వేగంగా); వాఙ్మనఃక్రియలన్ (వాక్+మనస్+క్రియలన్)= మాటలలో, మనస్సులో, చేతలలో; ఏరికిన్= ఎవరికీ; హింస= హాని; ఒనర్పన్+పూనరు= చేయటానికి ప్రయత్నించరు; ఎ+ఎడలను= ఏ సందర్భాలందైనా; దీనులన్= ఆర్తులను, కష్టాలలో ఉన్నవారిని; కరుణ ఏర్పడన్= దయసమకూడగా; ప్రోవఁగన్+చూతురు= కాపాడుటకే యత్నిస్తారు; ఇచ్చుచోన్= దానం చేసేటప్పుడు; కడమ+పడంగనీక= కొరతలేకుండగా; ఎదిరి, కాంక్షితముల్= ఇతరుల కోరికలు; తుదిముట్టన్= సంపూర్ణంగా; తీర్తురు= నెరవేరుస్తారు; ఆశ్రితులకున్= తమను సహాయంకొరకు ఆశ్రయించినవారికి; మదిన్= హృదయంలో; ఎక్కుడు= అధికంగా; కూర్తురు= సంతోషం కలిగిస్తారు; ఇన్నియున్= ఇవి అన్నియును; ఆర్యధర్మముల్= పూజ్యులైనవారు నిర్వహించే ధర్మాలు, నెరవేర్చే కర్తవ్యాలు.ట

**తాత్పర్యం:** ఈవిధంగా సావిత్రి యమధర్మరాజును విడువక వెంబడించి ఇట్లా వచించింది: 'దయచేసి ఆర్యధర్మాలను ఆలకించవలసింది.

ఆర్యధర్మాలలో ప్రధానమైనది- త్రికరణశుద్ధి. వాక్కు, మనస్సు, క్రియ ఈ త్రికరణాలలో ఎట్టి ఎడము ఉండరాదు. మనస్సులో ఆలోచించిందే పలుకవలెను. వచించిందే చేయవలెను. మనస్సు ఒకటి, మాట ఒకటి, క్రియ ఇంకొకటి కారాదు. త్రికరణాలతో ఎవరికిని ఎట్టి హింస చేయరాదు. దీనులయెడ దయ చూపాలి. దానం చేయాలి. దానం చేసేటప్పుడు ఎట్టి కొరతలకు ఆస్కారం లేకుండా, కోరినవారు సంతృప్తి చెందేటట్లు సంపూర్ణంగా దానం చేయాలి. ఆశ్రితులను మనసార ఆదరించాలి. ఇవి ఆర్యులు నెరవేర్చవలసిన కర్తవ్యాలు. ఆచరించవలసిన ధర్మాలు.

**క. నీ వెఱుఁగనియది యెయ్యది ।**
**దేవోత్తమ! ధర్మగతులతెఱఁ గెల్ల భవ**
**ద్భావాధీన మగుటఁ గా ।**
**దే వెలసితి నీవు ధర్మదేవత వనఁ గాన్. 60**

**ప్రతిపదార్థం:** దేవ+ఉత్తమ!= దేవతలలో శ్రేష్ఠుడవైనవాడా! ఓ యమధర్మ రాజా!; నీవు+ ఎఱుఁగని+అది= నీవు తెలియనట్టిది; ఎయ్యది= (ఏ+అది) ఏది; ధర్మ, గతుల, తెఱఁగు+ఎల్లన్= ధర్మంనడచే తీరులు అన్నియును; భవత్+భావ+అధీనము+ అగుటన్+ కాదే= నీయొక్క సంకల్పానికి లోనుకావటం వలననే కదా; ధర్మదేవతవు= ధర్మానికి అధిష్ఠానదైవం; అనఁ గాన్= అనునట్లుగా; ఈవు= నీవు; వెలసితి(వి)= శోభిల్లావు.

**తాత్పర్యం:** దేవతలలో శ్రేష్ఠుడ వైన ఓ యమధర్మరాజా! నీవు సర్వజ్ఞుడవు. నీకు అన్నిధర్మసూక్ష్మాలును తెలిసినట్టివే. అందుచేతనే నీకు ధర్మదేవత అనేపేరు సిద్ధించింది. ధర్మగతులు నీసంకల్పానికి అధీనాలు అయినవే గదా.

**క. సమబుద్ధితోడఁ దత్త ।**
**త్సముచిత కర్మఫల మఖిలజంతుతతులకున్**



**సమకూర్చుట నీ కయ్యెను ।**
**సమవర్తి యనంగఁ బేరు జగదభినుతమై. 61**

**ప్రతిపదార్థం:** సమ, బుద్ధితోడన్= తుల్యమైన చిత్తంతో; తద్+తద్+ సముచిత, కర్మ ఫలము= ఆయావాటికి తగిన కర్మఫలం; అఖిలజంతు తతులకున్= అన్ని ప్రాణికోటులకును; సమకూర్చుటన్= ఏర్పాటుచేయటం చేత; నీకున్= నీకు, జగత్+ అభినుతము+ ఐ= లోకంచేత పొగడబడునట్టిదై; సమవర్తి+అనంగన్+పేరు= సమవర్తి అనేపేరు; అయ్యెను= ఏర్పడింది.

**తాత్పర్యం:** ఈ ప్రపంచంలోని ప్రాణికోటికి అంతటికిని నీవు ఆయా కర్మలకు తగిన ఫలితాన్ని తుల్యమైన బుద్ధితో సమకూర్చేవాడవు కావున, సుప్రసిద్ధమైన సమవర్తి అనే బిరుద నామం నీకు లోకంలో ఏర్పడింది.

**విశేషం:** (1) యమధర్మరాజుకు నామాంతరం "సమవర్తి". సమస్తజీవకోటి తాను చేసిన కర్మలఫలితాలు అనుభవించవలసిందే. ఇక, యమధర్మరాజు వహించే భూమిక యెట్టిది? అతడు అందరియెడ సమంగా వర్తించేవాడు. ఎవరి పుణ్యాపాపాలు వారు అనుభవించ వలసిందే. యముడు తటస్థుడు. కర్మసిద్ధాంతం విశ్వవేదాంతానికి ప్రాచీన భారతీయులు సమర్పించిన బహుమానం. ఈ సిద్ధాంతానికి-కేవలం ఆస్తికమతం అని కాని, నాస్తికమతం అనికాని ముద్ర వేయటానికి వీలు లేదు. ఇందు ఈశ్వరుడు తటస్థుడు, సమవర్తి, సాక్షిభూతుడు. (2) ఇక, కర్మ అనే పదానికి ఎన్నోఅర్థాలు ఉన్నాయి. "గహనా కర్మణోగతిః" - అని భగవద్గీత చెప్పేమాట. ఇచ్చట ఈపద్యంలో చెప్పినమాట - "కర్మ" ఫలం. ప్రాణులు తాము చేసిన కర్మలకు అనుగుణమైన ఫలితాన్ని అనుభవించ వలసి ఉంటుంది. అట్టికర్మ జన్మజన్మాంతరాలు పేరుకొంటుంది. కర్మను వింగడించినచో - (1) సంచితం (2) ప్రారబ్ధం (3) ఆగామి అని త్రివిధాలు. పూర్వజన్మలలో పేరుకున్న కర్మలఫలితం 'సంచితం'. ఈ జన్మలో అనుభవించేది ప్రారబ్ధం. ఈ జన్మలో చేసే కర్మలఫలితం ఆగామి అని చెప్పవచ్చు. కర్మసిద్ధాంతం అనే సమాసంలో ప్రధానాంశం 'కర్మ' మాత్రమే గాక 'కర్మఫలం' అని గుర్తింపవచ్చును.

**క. యముఁ డండ్రు నిన్ను నార్యులు ।**
**యమియింపుదు భూతతతుల నట్లగుటఁదగన్;**
**శమనుండ వైతి కల్మష ।**
**శమనంబునఁ జేసి నీవు జలజాప్తసుతా!' 62**

**ప్రతిపదార్థం:** జలజ+ఆప్త, సుతా! పద్మాలకు ఆప్తుడైన సూర్యుడి పుత్రుడా, ఓ యమధర్మరాజా!; ఆర్యులు= పూజ్యులైన పెద్దలు; నిన్నున్= నిన్ను; యముఁడు+ అండ్రు= యముడు అని అంటారు; అట్లు+అగుటన్= అందుచేతనే (నీవు); భూతతతులన్= ప్రాణికోటులను; తగన్= యథోచితంగా; యమియింపుదు= నియమిస్తావు; కల్మష, శమనంబునన్+చేసి= పాపాలను అణచటంచేత; నీవు= నీవు; శమనుండవు= 'శమనుడు' అనేవాడవు (శమింపచేసేవాడవు); ఐతి(వి)= అయినావు.

**తాత్పర్యం:** సూర్యుడికుమారుడ వైన ఓ యమధర్మరాజా! పూజ్యు లైన పెద్దలు నిన్ను యముడు అని అంటారు. అందుచేతనే నీవు ప్రాణికోటులను అణుస్తావు. నీకు శమనుడు అనే సార్థకనామధేయంకూడా ఉన్నది. నీవు పాపాలను శమింపజేస్తావు.'

**విశేషం:** యమదండనవలన పాపకర్మ క్షయమౌతుంది.

**వ. అనినం బ్రేతపతి యాపుణ్యసతి కి ట్లనియె. 63**

**తాత్పర్యం:** అనగా యముడు పుణ్యాత్ముౖరా లయిన సావిత్రితో ఇట్లా అన్నాడు.

**క. 'తృషితుఁ డగు వాని శీతల ।**
**తుషారతోయములు మోదితునిఁ జేయుగతిన్**
**హృషితాత్ముఁ జేసె ననుఁ గ ।**
**ల్మషహరణము లైన నీ సమంజసఫణితుల్. 64**



**ప్రతిపదార్థం:** కల్మషహరణములు+ఐన= పాపాలను పోగొట్టేవి అయిన; నీసమంజస ఫణితుల్= సరిగా అమరేటట్లు చెప్పిన నీమాటల తీరుతెన్నులు; తృషితుఁడు+అగు వానిన్= దప్పిగొన్నవాడిని; శీతల, తుషారతోయములు= చల్లని మంచినీళ్ళు; మోదితునిన్+ చేయుగతిన్= సంతోషసంభరితుడిని చేసేటట్లుగా; ననున్= నన్ను; హృషిత+ఆత్మున్+ చేసెన్= సంతృప్తిచెందిన ఆత్మగల వాడినిగా చేశాయి.

**తాత్పర్యం:** దప్పిగొన్నవాడిని చల్లనిమంచినీళ్ళు సంతోషసంభరితుడిని చేసేటట్లుగా పాపాలను పారద్రోలే నీమాటలు చక్కగా సందర్భశుద్ధి కలిగి నన్ను సంతృప్తిపరచాయి.

**విశేషం:** (1) అలం: ఉపమ. (2) ఈ పద్యంలో - కృతజ్ఞతతో యమధర్మరాజు సావిత్రికి ధన్యవాదాలు సమర్పిస్తున్నాడు! అతడికి సావిత్రి చేసిన మేలేది? సావిత్రిమాటలు దప్పిగొనినవాడికి 'శీతలతుషారతోయములు' ఎట్లు అయినవి? యమధర్మరాజు నిర్వహించే భూమిక అంత సులువైనది కాదు. స్థూలదృష్టికి యముడు దండధరుడు. ప్రాణులను శిక్షించేవాడు. సూక్ష్మదృష్టికి అతడు సమవర్తి. కేవలం తటస్థుడు. సావిత్రి జ్ఞానమయి. బ్రాహ్మీమూర్తి. యమధర్మరాజుకు గూడ 'వెలుగు' ప్రసాదించింది. కనుక యముడు సావిత్రికి కృతజ్ఞత తెలుపవలసివచ్చింది.

**వ. 'కావున సత్యవంతునిప్రాణంబు దక్కందక్కినకోర్కియెయ్యది యైనం జెప్పుము; సఫలంబు సేసెద' ననిన సావిత్రి 'దేవా! వైరులచేత నపహృతం బైన రాజ్యం బెప్పటియట్ల ద్యుమత్సేనుం బ్రాపించు నట్లుగా ననుగ్రహింపవే' యని వేడుటయు, వైవస్వతుం 'డట్ల యగు' నని పలికి యి ట్లనియె. 65**

**ప్రతిపదార్థం:** కావున= కాబట్టి; సత్యవంతుని ప్రాణంబు+తక్కన్= సత్యవంతుడి అసువులు తప్ప; తక్కిన= మిగిలిన; కోర్కి= కోరిక; ఏ+అది+ ఐనన్= ఏది అయినప్పటికి; చెప్పుము= వచింపుము; సఫలంబు+చేసెదన్=

ఈడేరుస్తాను; అనినన్= అని చెప్పగా; సావిత్రి; 'దేవా!= ప్రభూ!; వైరులచేతన్= శత్రువులచేత; అపహృతంబు+ఐన= అపహరించబడిన; రాజ్యంబు= ప్రభుత్వం (పరిపాలన చేసే దేశం); ఎప్పటి+అట్లు+అ= యథా ప్రకారం; ద్యుమత్సేనున్= ద్యుమత్సేనుడిని; ప్రాపించునట్లుగాన్= చేరేటట్లుగా; అను గ్రహింపవే= కరుణించుమా; అని= అని; వేఁడుటయున్= ప్రార్థించగా; వైవస్వతుండు= యమధర్మరాజు; అట్లు+అ= అదే రీతిగా; అగున్= అగుగాక; అని, పలికి= అని చెప్పి; ఇట్లు+అనియెన్= ఈవిధంగా అన్నాడు.

**తాత్పర్యం:** 'కాబట్టి, సత్యవంతుడి ప్రాణంతప్ప మిగిలిన ఏకోర్కె అయినా కోరుకొమ్ము; తీరుస్తాను' అని అనగా సావిత్రి ఇట్లా అడిగింది. 'దేవా! ద్యుమత్సేనుడికి శత్రువు లపహరించిన రాజ్యం ఎప్పటివలె లభించేటట్లు అనుగ్రహించుము' అని వేడగా ఆ ప్రార్థన విని యమధర్మరాజు 'అట్లే అగుగాక' అని పలికి, ఇంకా ఇట్లా అన్నాడు.

**ఆ. 'వలదు నిలువు మింక; వదలక నీభక్తి ।**
**మగని కెక్కెఁ దుర్గమంపుఁ ద్రోవ**
**యిది; కృతంబు లయ్యె నెల్లయు; నీ విట ।**
**వచ్చు సెలవు లేదు వనజనయన!' 66**

**ప్రతిపదార్థం:** వనజనయన!= పద్మాలవంటి కన్నులు కలదానా! ఓ సావిత్రీ!; వలదు= (రా)వలదు; నిలువుము= ఆగుము; ఇంకన్= ఇకమీద; వదలక= వీడక; నీభక్తి= నీపూజ్యభావం; మగనికిన్= భర్తకు; ఎక్కెన్= అతిశయంగా చెందింది; ఇది= ఇది; దుర్గమంపుఁద్రోవ (దుర్గమము+త్రోవ)= నడవటానికి వీలులేనిదారి; ఎల్లయున్= నీకోరికలు అన్నియును; కృతంబులు+అయ్యెన్= చేయబడినవి అయ్యాయి (తీరాయి); ఈవు+ఇటవచ్చు= నీవు ఇక్కడకు వచ్చే; సెలవు= అనుమతి; లేదు= లేదు.

**తాత్పర్యం:** 'పద్మాలవంటి కన్నులు కల సావిత్రీ! నీవు ఇంక ఇచట ఆగుము. వదలని నీ పతిభక్తి అతడికి చెందింది. నీవు కోరినకోరికలు అన్నియు



నెరవేర్చబడినవి. ఇది చొరరాని తెరువు. ఇక్కడికి రావటానికి నీకు అనుమతి లేదు.'

**వ. అనిన నమ్మహాభాగ యతని కి ట్లనియె. 67**

**తాత్పర్యం:** అనగా ఆ మహానుభావురాలైన సావిత్రి యముడితో ఇట్లా మాట్లాడింది.

**క. 'ధర్మాత్ములు దమ సలిపెడు ।**
**ధర్మక్రియ దప్ప రెట్టి దశలందును మో**
**హోర్ములుఁ దాపముఁ బుట్టవు ।**
**ధార్మికహృదయములఁ బ్రథమధర్మాధ్యక్షా! 68**

**ప్రతిపదార్థం:** ధర్మాత్ములు= (ధర్మ+ఆత్ములు) ధార్మికులు; తమ, సలిపెడు= తాము చేసే; ధర్మక్రియ= ధర్మంతో కూడిన ప్రవర్తన; ఎట్టి= ఎటువంటి; దశల+అందును= అవస్థలలోను; తప్పరు= వదలి పెట్టరు; ప్రథమ+ధర్మ+అధ్యక్షా!= ధర్మపథాన్ని ఆరోహించే వారలలో మొట్టమొదటి వాడా!; ధార్మిక, హృదయములన్= ధర్మాన్ని ఆచరించేవారి మనస్సులలో; మోహ+ఊర్ములున్= భ్రాంతి అనే కెరటాలున్నూ; తాపమున్= వేడిమి ఒనగూర్చేబాధయున్నూ; పుట్టవు= జనించవు.

**తాత్పర్యం:** 'ధర్మపీఠం అధిరోహించేవారిలో మొట్టమొదట ఎన్నదగినవాడా, ఓ యమధర్మరాజా! ఎట్టి దురవస్థలలోనైనా ధర్మాత్ములు ధర్మంతోకూడిన తమకర్తవ్యాలను వదలజాలరు. ధార్మికుల హృదయంలో పరితాపం, భ్రాంతితరంగాలు జనించవు.

**క. కావునఁ బతియనుగమనం ।**
**బేవిధమున విడువఁదగునె? యెట్లయినను మో**
**హావేశముఁ బొందక ధ ।**
**ర్మావస్థితి సలుప వలదె యవహితబుద్ధిన్. 69**

**ప్రతిపదార్థం:** కావునన్= కాబట్టి; పతి+అనుగమనంబు= భర్తను అనుసరించి వెళ్ళటం; ఏవిధమునన్= ఏరీతిగా; విడువన్+తగునె= వీడటం తగునా- వీడటం భావ్యం కాదు; ఎట్లు+అయినను= ఏవిధంగానైనా; మోహ+ఆవేశమున్+ పొందక= భ్రాంతిమూలక మైన ఉద్వేగాన్ని చెందక; ధర్మ+అవస్థితి= ధర్మాన్ని నిలపటం; అవహితబుద్ధిన్= నిష్ఠతో కూడిన చిత్తంతో; సలుపన్‌వలదె= చేయవలదా= తప్పక చేయవలెను కదా.

**తాత్పర్యం:** కాబట్టి, భర్తను అనుసరించి వెళ్ళటం ఏవిధంగా వదలిపెట్టేది? వదలటం న్యాయమా? ఏవిధంగా నైనా సరే భ్రాంతిమూలకమైన ఉద్వేగాన్ని వదలి అచంచలమైన నిష్ఠతో ధర్మాన్ని నిలపాలి కదా!'

**తే. అనిన నంతకుఁ డిట్లను 'సతివ! నీవు ।**
**ప్రకటధర్మవిశేష తత్పరవు గాన**
**యింక నొక వర మిత్తుఁ; బ్రాణేశు బ్రతుకు ।**
**వలదు గాని యొం డడుగుము వలయుదాని.' 70**

**ప్రతిపదార్థం:** అనినన్= అని సావిత్రి చెప్పగా; అంతకుఁడు= యముడు; ఇట్లు+అనున్= ఈ రీతిగా పల్కాడు; అతివ!= పడతీ! ఓ సావిత్రీ!; నీవు= నీవు; ప్రకట, ధర్మ, విశేష, తత్పరవు= ప్రసిద్ధమైన ధర్మంలోని విశిష్టతయందు మిగుల నిష్ఠ కలదానవు; కాన= కాబట్టి; ఇంకన్= ఇంకను; ఒక, వరము= ఒక వరం; ఇత్తున్= ఇచ్చెదను; ప్రాణ+ఈశు, బ్రతుకు= మగడి జీవితం; వలదు+కాని= కోరవలదు కాని; వలయుదానిన్= ఇష్టమైన దానిని (వరాన్ని); ఒండు= వేరొకటి; అడుగుము= కోరుము.

**తాత్పర్యం:** అని సావిత్రి పలుకగా, యమధర్మరాజు ఈ రీతిగా బదులు పలికాడు. 'ఓ సావిత్రీ! ప్రసిద్ధమైన ధర్మమునందు మిగుల ఆసక్తి కలదావు. సంతోషం. నీ మగడిప్రాణాలను మాత్రం అడుగవద్దు. మరి ఇంకేవరాన్నైనా అర్థించుము. నీకు ఒసంగగలను'.



**వ. అనుటయు నక్కాంత గృతాంజలియై 'మాతండ్రిమద్రేశ్వరుం డపుత్త్రకుం; డతనికిఁ బుత్త్రశతలాభంబు గావలయు' నని యభ్యర్థించిన నట్ల కా నిచ్చితి' నని పల్కి ధర్మరాజు 'నీవు గడుదూరంబు వచ్చి డస్సి; తింక మగుడుట లెస్స' యని పలికిన నప్పతివ్రత యి ట్లనియె. 71**

**ప్రతిపదార్థం:** అనుటయున్= అని (యముడు) చెప్పగా; ఆ+కాంత= ఆ వనిత; కృత+అంజలి+ఐ= ఘటించిన కైమోడ్పు కలదియై; 'మా తండ్రి= నా జనకుడు అశ్వపతి; మద్ర+ఈశ్వరుండు= మద్రదేశానికి రాజు; అపుత్త్రకుండు= కొడుకులు లేనివాడు; అతనికిన్= మా తండ్రికి; పుత్త్ర, శత, లాభంబు= కొడుకులు వందమంది కలగటం; కావలయున్= కావాలి; అని= అని పలికి; అభ్యర్థించినన్= వేడగా; అట్లు+అ, కాన్= అటులే జరుగుగాక; ఇచ్చితిన్= (వరాన్ని) ఒసగితిని; అని పల్కి= అని వచించి; ధర్మరాజు= యముడు; 'నీవు= ఓ సావిత్రీ! నీవు; కడుదూరంబు= మిక్కిలిదవ్వు; వచ్చి= అరుదెంచి; డస్సితి= అలశావు; ఇంకన్= ఇకమీద ఇచ్చటినుండి; మగుడుట= తిరిగివెళ్ళటం; లెస్స= మంచిది; అని పలికినన్= అని వచించగా; ఆ పతివ్రత; ఇట్లు+అనియెన్= ఈ విధంగా అన్నది.

**తాత్పర్యం:** అని యమధర్మరాజు చెప్పగా, సావిత్రి అతడికి చేతులు మోడ్చి నమస్కరించి, 'మా జనకుడు మద్రదేశప్రభువైన అశ్వపతికి కొడుకులు లేరు. అతడికి కొడుకులు వందమంది కలిగేటట్లు అనుగ్రహించుము' అని ప్రార్థించింది. 'సరే నీకోరిక ఈడేరుగాక. నీ తండ్రికి నూర్గురు కొడుకులు కలిగెదరుగాక. నీవు కడుదూరం వచ్చావు. మిక్కిలి అలసిపోయావు. ఇంక వెనుకకు మరలటం మంచిది' - అని చెప్పగా, ఆ పతివ్రత యముడితో ఇంకా ఇట్లా పలికింది.

**తే. 'నాకు డప్పి యెక్కడిది? మనంబు భర్తృ ।**
**చరణపంకజాసక్తమై కరము భక్తి**

**నలరుచున్నది; సతులకు నన్య మెట్టి ।**
**దియును ధర్మమె భర్తృసంశ్రయము కాక! 72**

**ప్రతిపదార్థం:** నాకున్= నాకు; డప్పి+ఎక్కడిది= శ్రమ ఎక్కడిది?; మనంబు= చిత్తం; భర్తృ, చరణ, పంకజ+ఆసక్తము+ఐ= మగడియొక్క పాదపద్మాలపై కూర్మికలదై; కరము= మిక్కిలి; భక్తిన్= పూజ్యభావంతో; అలరుచున్+ ఉన్నది= శోభిల్లుతున్నది; సతులకున్= పతివ్రతలకు; అన్యము= వేరొండు; ఎట్టిదియును= ఎటువంటిది అయినను; భర్తృ, సంశ్రయము కాక= మగడియొక్క అండ తప్ప; ధర్మమె= ధర్మమగునా? (ధర్మం కాజాలదు).

**తాత్పర్యం:** 'ఓ యమధర్మరాజా! నాకు శ్రమ ఎక్కడిది? నామనస్సు నాభర్తపాదపద్మాలయందే ఆసక్తికలిగి మిక్కుటమైన పూజ్యభావంతో శోభిల్లుతున్నది. ఎన్నివరాలు లభించినా అవి పతివ్రతలకు భర్తను ఆశ్రయించి ఉండటంతో సరిపోలవు కదా! సతికి ఏకైకపరమధర్మం భర్తృసంశ్రయమే.

**వ. మఱియు నొక్కవిన్నపంబు సేసెద. 73**

**తాత్పర్యం:** ఇంకా ఒక్క మనవి చేస్తాను.

**ఆ. ఆత్మధర్మనిరతు లైన పుణ్యాత్ములు ।**
**దుర్లభులు సమస్తదురితములును**
**శాంతిఁ బొందు వారి సంసర్గమునఁదీర్థ ।**
**భూతమతులు వారు భూతలమున. 74**

**ప్రతిపదార్థం:** ఆత్మధర్మనిరతులు+ఐన= తమధర్మాన్ని నెరవేర్చటంలో నిష్ఠకలవారు అయిన; పుణ్య+ఆత్ములు= సుకృతులు; దుర్లభులు= అరుదుగా దొరుకుతారు; (అట్టి) వారి సంసర్గమునన్= వారియొక్క సమాగమంవలన; సమస్త, దురితములును= అన్నిపాపాలు; శాంతిన్+పొందున్= శమిస్తాయి; వారు= ఆత్మధర్మనిరతులు అయిన పుణ్యాత్ములు; భూతలమునన్= భూప్రదేశంలో; తీర్థభూతమతులు= గంగాది తీర్థముల వలె పవిత్రమైన మనస్సులు గలవారు.



**తాత్పర్యం:** తమధర్మాన్ని నిర్వహించటంలో నిష్ఠ గల మహానుభావులు చాల అరుదుగా కన్పిస్తారు. అట్టివారి సంపర్కంవలన సమస్తపాపాలు పోతాయి. బుద్ధివిశేషంచేత వారు పవిత్రతీర్థాలతో సమానులు. వారు జంగమ పుణ్యతీర్థాలు.

**ఉ. వారల పేర్మిఁ గాదె శశివారిజమిత్త్రులు నిర్వికారసం**
**చారత నుల్లసిల్లెదరు, సర్వపయోనిధులున్ నిరాకులా**
**కారతఁ గ్రాలెడుం, గులనగంబులు నిశ్చలరూఢిఁ జాల నొ**
**ప్పారెడు భూతధాత్రి నిఖిలైకధురీణతఁ బేర్మిఁ బొందెడున్.' 75**

**ప్రతిపదార్థం:** వారలపేర్మిన్+కాదె= వారలయొక్క అనగా ఆత్మధర్మనిరతు లైన పుణ్యాత్ముల గొప్పతనంచేతనే కదా; శశి, వారిజ, మిత్త్రులు= చంద్రుడు, సూర్యుడు; నిర్వికార, సంచారతన్+ఉల్లసిల్లెదరు= గతులు తప్పక నడుస్తూ శోభిల్లుతూ ఉంటారు; సర్వ, పయోనిధులున్= సర్వసముద్రాలున్నూ; నిరాకుల+ఆకారతన్= మేరమీరని రూపంతో; క్రాలెడున్= వెలుగొందుతాయి; కులనగంబులు= కులపర్వతాలు; నిశ్చల, రూఢిన్= కదలకుండ ఉండే స్థితి కలిగి; చాలన్= మిక్కిలి; ఒప్పారెడున్= విలసిల్లుతున్నవి; భూతధాత్రి= ప్రాణులతో కూడిన భూమి; నిఖిల+ఏక, ధురీణతన్= సమస్తమున్నూ తానే భరించటంలో; పేర్మిన్= గొప్పతనాన్ని; పొందెడున్= సంపాదిస్తుంది.

**తాత్పర్యం:** ఆత్మధర్మనిరతు లైన మహానుభావుల గొప్పతనంవలననే కదా ఈ సృష్టి ప్రశాంతంగా కొనసాగుతున్నది. అట్టివారలమహిమవలననే సూర్యచంద్రులు గతులు తప్పక తిరుగుతున్నారు. సర్వసముద్రాలు మేరదప్పక శోభిల్లుతున్నాయి. కులపర్వతాలు కదలికలేని ఠీవితో విలసిల్లుతున్నాయి. సకలప్రాణులతో కూడినభూమి సమస్తాన్ని భరిస్తున్నగౌరవాన్ని పొందుతున్నది.

**విశేషం:** నిర్ణీతగణితబద్ధమై ఈ ప్రపంచం సర్వం ఒకశ్రుతిలో ఒకలయకు అనుబద్ధమై ఉండటం మహానుభావుల ధర్మనిరతితో సంవదించటం మనోహరమైన ఉదాత్తకల్పన.

**వ. అని పలికి మఱియు నిట్లనియె. 76**

**తాత్పర్యం:** అని చెప్పి, ఇంకా ఇట్లా అన్నది.

**తే. 'ఏడుమాట లాడినయంత నెట్టివారు।**
**నార్యజనులకుఁ జుట్టంబు లగుదు రనినఁ**
**జిరసమాలాపసంసిద్ధిఁ జేసి నీకు ।**
**నేను జుట్టమ నని చెప్ప నేల వేఱ? 77**

**ప్రతిపదార్థం:** ఏడుమాటలు+ఆడిన= ఏడుపలుకులు పలికిన; అంతన్= మేరకు; ఎట్టివారున్= ఎవరు అయినను; ఆర్యజనులకున్= పూజ్యులైన పెద్దమనుష్యులకు; చుట్టంబులు= బంధువులు; అగుదురు= ఔతారు; అనినన్= అని చెప్పగా; చిర, సమ్+ఆలాప, సంసిద్ధిన్+చేసి= చాలకాలం మాటలాడటం ఏర్పడటంవలన; నీకున్= ఓ యమధర్మరాజా, నీకు; నేను; చుట్టమన్= చుట్టాన్ని; అని= అని; వేఱు+అ= వేరుగా; చెప్పన్+ఏల?= చెప్పటం ఎందుకు?

**తాత్పర్యం:** "ఏడుమాటలు మాట్లాడితే ఎటువంటివారైనా బంధువులు ఔతారు - అని పెద్దల ప్రవచనం. మనం చాల సంభాషణ కొనసాగించాం. కాబట్టి నేను నీకు ఈ విధంగా చుట్టాన్ని ఐతిని కదా!

**విశేషం:** "సఖ్యం సాప్తపదీనమ్'' అన్న సంస్కృతలోకోక్తికి ఇది అనుసరణ. ఏడుపదాలు స్నేహాన్ని ఘటిస్తాయి- అనునప్పుడు 'ఏడుమాటలు మాటాడినను లేదా ఏడుఅడుగులు కలిసి నడిచినను చాలు సఖ్యానికి అని రెండువిధాల అర్థం చెప్పవచ్చును. సావిత్రియు యముడును చాలదూరం నడచారు.



చాలమాటలు మాటాడారు. ఎఱ్ఱన ఈ లోకోక్తిని తెలిగిస్తూ చుట్టరికం సాప్తపదీనం అనినను, వెనువెంటనే "మిత్రమనోరథమును'' అని వాడుటచేత - కవిహృదయం 'సఖ్యంసాప్తపదీనం' అనే సుభాషితం అనియే సుస్పష్టం.

**వ. కావున మిత్త్రమనోరథం బవశ్యకర్తవ్యంబుగాఁ జిత్తగింపు' మనిన నమ్మహానుభావుం డబ్భామినిదెసం గనుంగొని 'నీకుం బ్రసన్నుండ నైతి నీ కిష్టం బైన వరం బొక్కటి యిచ్చెద; నడుగు' మనిన నమ్మానినియిట్లనియె.78**

**ప్రతిపదార్థం:** కావునన్= కాబట్టి; మిత్త్ర మనోరథంబు= మిత్రులకోరిక; అవశ్యకర్తవ్యంబు గాన్= తప్పనిసరిగా తీర్చదగినట్టిదిగా; చిత్తగింపుము= కరుణించుము; అనినన్= అని (సావిత్రి చెప్పగా); ఆ+మహా+ అనుభావుండు= ఆ మహాభాగుడు; ఆ+భామిని, దెసన్+ కనుంగొని= ఆ వనితవైపు చూచి; నీకున్= నీకు; ప్రసన్నుండన్+ ఐతిన్= అనుగ్రహం కలవాడను అయినాను; నీకున్+ ఇష్టంబు+ఐన= నీకు ప్రీతికలిగించేదైన; వరంబు= వరం; ఒక్కటి= ఒకటి; ఇచ్చెదన్= ఇస్తాను; అడుగుము= కోరుకొనుము; అనినన్= అని అనగా; ఆ+మానిని= ఆ పడతి సావిత్రి; ఇట్లు+అనియెన్= ఈ విధంగా పలికింది.

**తాత్పర్యం:** 'కావున మిత్రులకోరిక ఈడేర్చటం తప్పనిసరిగా నెరవేర్చవలసిన ధర్మం, అనుగ్రహించుము' అని సావిత్రి యముడికి విన్నవించింది. మహానుభావుడైన యముడు సావిత్రిని చూచి 'నీకు నేను ప్రసన్నుడ నయినాను. నీవు ఇచ్చువచ్చిన వరాన్ని కోరుకొమ్ము' అని అన్నాడు. అంత సావిత్రి యమధర్మరాజును ఇట్లా అడిగింది.

**క. 'మది సత్యవంతుజీవిత।**
**మది యిమ్ముగఁ దొలఁగఁ బెట్టి యన్యంబుల ని**
**చ్చెద నని పలుకుదు మును నీ;।**
**వది యిప్పుడు లేద; యింక నడిగెదఁ బ్రీతిన్. 79**

**ప్రతిపదార్థం:** నీవు= నీవు; మదిన్= మనసులో; సత్యవంతుజీవితము= సత్యవంతుడి బ్రదుకు; అది= ఆ అంశాన్ని; ఇమ్ముగన్= ఉపాయంగా; తొలఁగన్+పెట్టి= తప్పించి; అన్యంబులన్= ఇతరాలైన వాటిని (వరములను); ఇచ్చెదన్= అనుగ్రహిస్తాను;అని, మును, పలుకుదు(వు)= అని ఇంతకు పూర్వం అంటూ ఉండేవాడవు; అది= ఆ అపసరణం; ఇప్పుడు= ఈసారి; లేదు+అ= లేదుకదా; ఇంకన్= ఇకమీద; ప్రీతిన్= సంతోషంతో; అడిగెదన్= (వరాన్ని) కోరుకొంటాను.

**తాత్పర్యం:** ఇంతవరకు నీవు నీ మనస్సులో సత్యవంతుడి ప్రాణాలను ఉపాయంగా తప్పించి, తక్కినవరాలను మాత్రమే కోరుకొమ్మని చెప్పావు. కాని, ఇప్పుడు ఆ అపసరణం లేకుండా కోరుకొనుమని అడిగావు. మహాప్రసాదం. ఇక యథేచ్ఛగా నేను వరాన్ని కోరుకొంటాను.

**చ. పతివిరహంబు దుస్సహము; భర్తృవినాకృత యైన కాంత దూ**
**షిత యగు సర్వమంగళవిశేషములందును గాన మత్ప్రియుం**
**డతులితకీర్తిశాలి సుగుణాఢ్యుఁడు సాళ్వసుతుండు లబ్ధజీ**
**వితుఁడుగ నిమ్ము ధర్మపదవీపరిరక్షణ! పుణ్యవీక్షణా! 80**

**ప్రతిపదార్థం:** ధర్మపదవీ పరిరక్షణ!= ధర్మస్థితిని చక్కగా కాపాడేవాడా!; పుణ్యవీక్షణా!= పవిత్రమైన దృష్టికలవాడా! పతివిరహంబు= భర్తనుండి యెడబాటు; దుస్సహము= భరించరానిది; భర్తృ, వినాకృత+ఐన, కాంత= మగడు లేని భార్య, భర్త మరణించిన భార్య; సర్వమంగళవిశేషములందును= సమస్తమైన శుభకార్యాలు మున్నగువాటిలో; దూషిత+అగున్= పరిహరించ బడుతుంది; కాన= కావున; మత్+ప్రియుండు= నాభర్త; అతులితకీర్తిశాలి= సాటిలేని యశస్సుతో ఒప్పేవాడు; సుగుణ+ఆఢ్యుఁడు= మంచి గుణాలు కలవాడు; సాళ్వసుతుండు= సాళ్వదేశపురాజు కొడుకు; లబ్ధజీవితుఁడుగన్= పొందిన జీవితము కలవాడుగా; ఇమ్ము= ఒసంగుము (వరంగా).



**తాత్పర్యం:** ధర్మస్థితిని చక్కగా కాపాడేవాడా! పవిత్రమైన దృష్టిగలవాడా! ఓ యమ ధర్మరాజా! మగడి యెడబాటు మగువకు భరించరాని ఆవేదన గొలుపుతుంది. మగడు మరణించిన మగువ సమస్తమైన శుభకార్యాలనుండి పరిహరించబడుతుంది. కావున సాటిలేనియశస్సు నార్జించినవాడు, సాళ్వభూపతిసుతుఁడు సద్గుణాలప్రోవు అయిన నాభర్త తిరిగి బ్రదికేటట్లుగా దయచేసి వరాన్ని ప్రసాదింపుము.

**వ. అనిన 'నట్లచేయుదు' నని యాక్షణంబ కృతాంతుండు సత్యవంతు**
**నపగతపాశుం జేసి యాసుందరి కిట్లనియె. 81**

**ప్రతిపదార్థం:** అనినన్= అని (సావిత్రి) పలుకగా, అట్లు+అ= అట్లే; చేయుదున్= చేస్తాను; అని= అని వచించి; ఆ, క్షణంబు+అ= ఆత్రుటిలోనే; కృతాంతుండు= యమధర్మరాజు; సత్యవంతున్= సత్యవంతుడిని; అపగతపాశున్= తొలగిన పాశం కలవాడినిగా; చేసి= ఒనరించి; ఇట్లు+ అనియెన్= ఈ రీతిగా చెప్పాడు.

**తాత్పర్యం:** సావిత్రి ఆరీతిగా విన్నవించగా, 'సరే; అటులనే చేస్తాను' అని చెప్పి, ఆ క్షణంలోనే సత్యవంతుడిని బంధించిన పాశాలను తొలగించి ఆ పొలతితో ఈ విధంగా అన్నాడు.

**చ. 'కొను మిదె నీమనఃప్రియునిఁ గోమలి! వీఁడు చతుశ్శతాబ్దముల్**
**మను నిటమీఁదఁ; బుత్త్రులఁ గ్రమంబున నూర్వురఁ గాంచుఁ; గీర్తివ**
**ర్ధనుఁ డగు; సంతతాధ్వరవితానములం బరితుష్టి సేయు న**
**య్యనిమిషకోటి కెల్లను; నిజాన్వయమౌళివిభూషణం బగున్.' 82**

**ప్రతిపదార్థం:** కోమలి!= సౌకుమార్యం కలదానా- సావిత్రీ!; నీమనస్+ ప్రియునిన్= (నీమనఃప్రియుడిని) నీ మనస్సుకు ప్రీతిని కలిగించేవాడిని- సత్యవంతుడిని; ఇదె= ఇదిగో; కొనుము= స్వీకరించుము; వీఁడు= ఇతఁడు

- సత్యవంతుడు; ఇటమీఁదన్= ఇంకమీద; చతుస్+శత+ అబ్దముల్= నాలుగవందల ఏండ్లు; మనున్= బ్రదుకును; పుత్త్రులన్= కొడుకులను; క్రమంబు నన్= వరుసగా; నూర్వ్వరన్= వందమందిని; కాంచున్= పొందుతాడు; కీర్తివర్ధనుఁడు+అగున్= యశస్సును వృద్ధిపొందించేవాడు ఔతాడు; సంతత+అధ్వర, వితానములన్= ఎల్లప్పుడును నిర్వహించే యజ్ఞాల సము దాయాలవలన; ఆ+అనిమిషకోటికిన్+ఎల్లను= ఆవేల్పులసమూహాలకు అందరికిని; పరితుష్టిన్+చేయున్= సంతృప్తిని కలిగిస్తాడు; నిజ+అన్వయ, మౌళి, విభూషణంబు+అగున్= తనవంశానికి శిరోభూషణం (శ్రేష్ఠుడు) కాగలడు.

**తాత్పర్యం:** 'సౌకుమార్యవతి వైన ఓ సావిత్రీ! ఇదుగో నీమనస్సుకు సంప్రీతిని కలిగించే నీభర్తప్రాణాలు తీసికొమ్ము. నీభర్త సత్యవంతుడు. ఇకమీద నాలుగువందలసంవత్సరాలు జీవించగలడు. నూరుమంది కొడుకులను కనగలడు; పేరుప్రతిష్ఠల నార్జించగలడు. పెక్కుయజ్ఞాలను చేసి వేల్పులను సంతుష్టిపరచగలడు; తనవంశంలో శ్రేష్ఠుడు కాగలడు'.

**వ. అని యాదేశించి యంతర్హితుం డయ్యెఁ; నక్కాంతయుఁగ్రమ్మఱి చని యెప్పటియట్ల జీవితేశ్వరు తల తొడలపై నిడుకొని కూర్చున్న యెడం గొండొకవడికి లబ్ధచేతనుండై సత్యవంతుండు దెలిసి నిజవల్లభం జూచి యిట్లనియె. 83**

**ప్రతిపదార్థం:** అని+ఆదేశించి= అని ఆజ్ఞాపించి; అంతర్హితుండు+అయ్యెన్= అదృశ్యుడు అయ్యాడు; ఆ+కాంతయున్= సావిత్రియు; క్రమ్మఱి, చని= మరలి వెళ్లి; ఎప్పటి+అట్లు+అ= యథాప్రకారం; జీవిత+ఈశ్వరు, తల= భర్త అయిన సత్యవంతుడి శిరస్సు; తొడలపైన్+ఇడుకొని= ఒడిలో పెట్టుకొని; కూర్చున్న= ఆసీనురాలు అయి ఉన్న; ఎడన్= తరుణంలో; కొండొకవడికిన్= కొంతసేపటికి; లబ్ధచేతనుండు+ఐ= పొందిన చైతన్యం కలవాడై; సత్యవంతుండు; తెలిసి= స్పృహవచ్చి; నిజవల్లభన్+చూచి= తనభార్యను కాంచి; ఇట్లు+అనియెన్= ఈ విధంగా పలికాడు.



**తాత్పర్యం:** అని ఆజ్ఞాపించి యమధర్మరాజు అదృశ్యుడయ్యాడు. అంతట సావిత్రి అడవికిమరలివచ్చి, యథాప్రకారం తనభర్త సత్యవంతుడి శిరస్సును తనతొడపై ఇడుకొని కూర్చున్నది. కొంతసేపటికి సత్యవంతుడు స్పృహగాంచి తనభార్య సావిత్రిని చూచి ఇట్లా అన్నాడు.

**క. 'కడుఁ దడవు నిద్ర వోయితిఁ; ।**
**బడఁతీ! ననుఁ దెలుపవలదె; బలియుఁడొకరుఁడె**
**క్కుడు జవమునఁ బట్టి బలం ।**
**బెడలఁగ ననుఁ దిగిచెఁ; నాతఁ డెవ్వఁడు సెపుమా! 84**

**ప్రతిపదార్థం:** పడఁతీ!= వనితా ఓ సావిత్రీ!; కడున్+తడవు= చాలసేపు; నిద్ర+పోయితిన్= నిదురించాను; ననున్+తెలుపన్వలదె= నన్ను నిదురనుండి మేల్కొలుప వద్దా; బలియుఁడు= బలంకలవాడు; ఒకరుఁడు= ఒకడు; ఎక్కుడు, జవమునన్= మిక్కిలి వేగంతో; పట్టి= గ్రహించి; బలంబు= శక్తి; ఎడలఁగన్= పోవగా; ననున్= నన్ను; తిగిచెన్= లాగినాడు; ఆతఁడు= (నన్ను ఆ రీతిగా ఆకర్షించినవాడు); ఎవ్వఁడు, చెపుమా= ఎవడో నాకు చెప్పుము.

**తాత్పర్యం:** 'సావిత్రీ! నేను చాలసేపు నిదురించాను. మరి నీవు నన్ను నిదురనుండి మేలుకొలుపవద్దా? ఎవడో ఒకదృఢకాయుడు మిక్కిలివేగంగా నన్ను పొదివి పట్టిలాగినట్లు అనిపించింది. ఆతడు ఎవడో చెపుమా!

**చ. అది కల గాదు, నిక్కువమ యైనటు లున్నది; నాకు నెంతయున్**
**మది వెఱపుట్టె' నావుడును మానిని యిట్లను 'నీకు నంతయున్**
**ముదమున రేపు సెప్పెదఁ; దమోమయమై యిదె శర్వరీముఖం**
**బొదవెఁ; విలంబనం బిచట నొప్పదు లెమ్ము నరేంద్రనందనా!' 85**

**ప్రతిపదార్థం:** అది= (నన్ను బలియుఁడు ఆకర్షించటం); కల= స్వప్నం; కాదు= కాదు; నిక్కువము+అ, ఐనటులు+ఉన్నది= నిజమే అయినట్లు ఉన్నది; నాకున్+ఎంతయున్= నాకు మిక్కుటంగా; వెఱపుట్టెన్= భయం కలిగింది; నావుడును= అని చెప్పగా; మానిని= అభిమానవతి అయిన సావిత్రి; ఇట్లు+అనున్= ఈ విధంగా అన్నది; నర+ఇంద్ర, నందనా!= రాజపుత్రుడవైన ఓ సత్యవంతుడా!; నీకున్= నీకు (ఓ సత్యవంతుడా నీకు); అంతయున్= జరిగింది అంతయును; ముదమునన్= సంతోషంతో; రేపు= మరునాడు; చెప్పెదన్= వచిస్తాను; తమస్+మయము+ఐ= (తమోమయమై) చీకటిక్రమ్మి; ఇదె= ఇదిగో; శర్వరీముఖంబు+ ఒదవె= రాత్రి ప్రారంభమయింది; ఇచటన్= ఈ స్థలంలో; విలంబము= ఆలస్యం; ఒప్పదు= భావ్యం కాదు; లెమ్ము= బయలుదేరుము.

**తాత్పర్యం:** 'అది స్వప్నం కాదు. నిజంగా జరిగినట్లు భావిస్తున్నాను; నా చిత్తంలో మిక్కుటమైన భీతి ఏర్పడింది' అని సత్యవంతుడు వచించగా, అభిమానవతిఅయిన సావిత్రి ఇట్లా పలికింది; 'ఓ రాజపుత్రా! నీకు జరిగింది అంతయు రేపు తెలుపుతాను. చూడుము! ఇదిగో చీకటి నలుదెసల క్రమ్ముకొన్నది. రాత్రి ప్రారంభమైంది. ఇక అడవిలో ఈచోట ఆలస్యం చేయటం మంచిది కాదు; లెమ్ము!

**మ. అదె నక్తంచరు లిందు నందును మహోగ్రాకారులై క్రందుగా**
**మెదలం జొచ్చిరి, ఘోరఫేరవరుతుల్ మిన్నందెఁ దీవ్రంబులై,**
**పదశబ్దంబులు మీఱెఁ జూడు కలయంబాఱం దొడంగెం బెనుం**
**గదుపుల్ గట్టి మృగంబు; లెంతయు భయోత్కంపంబు నా కయ్యెడున్.86**

**ప్రతిపదార్థం:** అదె= అదిగో; నక్తంచరులు= రాక్షసులు; ఇందున్+అందున్= ఇక్కడ అక్కడ; మహా+ఉగ్ర+ఆకారులు+ఐ= మిక్కిలి భయంకరమైన రూపాలు కలవారై; క్రందుగాన్= సందడిగా; మెదలన్+చొచ్చిరి= తిరుగాడసాగారు; ఘోర, ఫేరవ, రుతుల్= భయంకరమైన నక్కలకూతలు; తీవ్రంబులు+ఐ= తీక్ష్ణాలై; మిన్ను+అందెన్= ఆకసాన్ని అంటాయి; పెనున్+ కదుపుల్‌కట్టి= పెద్దగుంపులుగా చేరి; మృగంబులు= జంతువులు; చూడు= అరయుము; కలయన్+పాఱన్+తొడంగెన్= అంతటా పరుగెత్తుతున్నాయి; చూడు= గమనించుము; పదశబ్దంబులు= అడుగుల చప్పుడులు; మీఱెన్= అతిశయించాయి; ఎంతయున్= మిక్కిలి; భయ+ఉత్కంపంబు= వెఱపు వలన ఏర్పడిన వణకు; నాకున్+అయ్యెడున్= నాకు కలుగుతున్నది.



**తాత్పర్యం:** చీకటి పడింది. రాత్రివేళ తిరుగాడే రాక్షసులు అదిగో ఇచట అచట భయంకరమైన రూపాలతో సందడిగా తిరుగాడుతున్నారు. వెఱపు పుట్టించే నక్కకూతలు ఆకసాన్ని అంటుతున్నాయి. పెనుగుంపులు గుంపులుగా జంతువులు ఇటునటు తిరుగుతున్నాయి. వాటిఅడుగులసవ్వడి అతిశయిస్తున్నది. చూడుము. నాకు భయంవలన వణకు పుట్టుచున్నది.

**క. విను! నీవు దడయుటకు మీ।**
**జననియు జనకుండుఁ గరము సంతాపభరం**
**బునఁ బొందుదు రింతకుఁ; గ్ర।**
**న్నన వారికి సంతసం బొనర్పవె యధిపా! 87**

**ప్రతిపదార్థం:** అధిపా!= ఓ రాజా, సత్యవంతుడా!:; విను= ఆలకింపుము; నీవు= నీవు; తడయుటకున్= ఆలసించటానికి; మీ జననియున్= మీ తల్లియు; జనకుండున్= తండ్రియునూ; కరము= మిక్కిలి; సంతాప, భరంబునన్= దుఃఖం అనే బరువును; ఇంతకున్= ఇప్పటికి; పొందుదురు= అనుభవిస్తారు; క్రన్ననన్= శీఘ్రంగా; వారికిన్= మీ జననీ జనకులకు; సంతసంబు= సంతోషం; ఒనర్పవె= చేయుము (చేయవా).

**తాత్పర్యం:** రాజా, ఓ సత్యవంతుడా! ఆలకింపుము. ఇప్పటికే నీవు ఆలస్యం చేయటంచేత మీ తల్లితండ్రులు మిక్కుటమైన శోకభారంచేత తపిస్తుంటారు. శీఘ్రంగా ఇలు చేరి వారికి సంతోషం కలిగించుము.

**వ. అని పలికి తదీయవిషాదచేష్టితంబు లుపలక్షించి వెండియు. 88**

**ప్రతిపదార్థం:** అని పలికి= అని వచించి; తదీయ, విషాద, చేష్టితంబులు= ఆతడియొక్క (సత్యవంతుడియొక్క) ఖేదంతో గూడిన చేష్టలు; ఉపలక్షించి= గమనించి.

**తాత్పర్యం:** అని సావిత్రి పలికి సత్యవంతుడియొక్క చేష్టలు ఖేదంతో కూడిఉండటం గమనించి.

**చ. 'తమమును బెల్లుగాఁ బరఁగె, దవ్వు నిజాశ్రమభూమియున్, మదిన్**
**శ్రమమును బాయ దిప్పు డనుచందమ యైనఁ జనంగ నేల? యిం**
**పమరఁగ నింతప్రొద్దు సుగుణాకర! యిచ్చట నిల్చి రేపు వో**
**దమె? తెఱఁ గెద్ది?' నావుడును దన్వికి సాళ్వతనూజుఁ డిట్లనున్. 89**

**ప్రతిపదార్థం:** తమమును= చీకటియును; పెల్లుగాన్= అధికంగా; పరఁగెన్= వ్యాపించింది; నిజ+ఆశ్రమభూమియున్= మన ఆశ్రమసీమకూడ; దవ్వు= దూరం; మదిన్= చిత్తంలో; శ్రమమును= అలసటయును; ఇప్పుడు; పాయదు= పోవదు; అను= అనునట్టి; చందము+అ+ఐనన్= రీతిగా అయితే; చనంగన్+ఏల?= పోవటం దేనికి?; సుగుణ+ఆకర!= మంచిగుణాలకు నెలవు అయినవాడా, ఓ సత్యవంతుడా!; ఇంపు+అమరఁగన్= ప్రీతి ఎసగగా; ఇంతప్రొద్దు= ఈ రాత్రిసమయం; ఇచ్చటన్= ఈస్థలంలో; నిల్చి= ఉండి; రేపు= ప్రొద్దున; పోదము+ఎ= వెడలుదమా; తెఱఁగు+ఎద్ది?= మార్గం ఏది?; నావుడును= అని వచించగా; తన్వికిన్= పొలతికి, సావిత్రికి; సాళ్వతనూజుఁడు= సాళ్వరాజు కుమారుడు - సత్యవంతుడు; ఇట్లు+అనున్= ఈవిధంగా అంటున్నాడు.

**తాత్పర్యం:** 'మంచిగుణాలకు నెలవు అయినవాడా, ఓ సత్యవంతుడా! అంధకారం దట్టంగా వ్యాపించింది; మనఆశ్రమం ఇక్కడికి మిక్కిలి దూరం. మనసులోని అలసటకూడా తీరలేదు అని అనిపిస్తే, ఇక తొందరపడి పోవటం ఎందుకు? ఈరాత్రిప్రొద్దు వేడుకగా ఇక్కడనే గడపి తెల్లవారినపిదప బయలుదేరి వెళ్ళవచ్చును కదా. మీ ఆలోచన ఏమిటి?' అని సావిత్రి పలికింది. సావిత్రితో సత్యవంతుడు ఇట్లా బదులు పలికాడు.



**క. 'మానె శిరోవేదన, నా।**
**మేనికిఁ దగ లావు వచ్చె, మెల్లన జరుగం**
**గా నేర్తుఁ, దల్లిదండ్రులఁ।**
**గానక యే నెట్లు నిలుతుఁ గాననభూమిన్? 90**

**ప్రతిపదార్థం:** శిరోవేదన= శిరస్+వేదన= తలనొప్పి; మానెన్= పోయింది; నామేనికిన్= నాశరీరానికి; తగన్= ఒప్పిదంగా; లావువచ్చెన్= బలం చేకూరింది; మెల్లన= మెల్లమెల్లగా; జరుగంగాన్ నేర్తున్= కదలి నడయాడగలను; తల్లిదండ్రులన్= జననీజనకులను; కానక= చూడకుండ; కాననభూమిన్= అరణ్యసీమలో; ఏన్= నేను; ఎట్లు= ఏరీతిగా; నిలుతున్?= నిలువగలను?

**తాత్పర్యం:** నాతలనొప్పి పూర్తిగా తగ్గింది. నాశరీరానికి ఒప్పిదంగా బలం చేకూరింది. మెల్లమెల్లగా కదలి నడవగలను. నాతలిదండ్రులను చూడకుండగా ఈ అరణ్యసీమలో నేను నిలువజాలను సుమీ.

**క. ఇంతకు మున్నెన్నఁడు నే।**
**నింత తడవు వారిఁ బాసి యెందుఁ దడయ; నేఁ**
**డింతవడి మసలుటకు వా।**
**రెంత వడిరొ! యేమి యైరొ! యెట్లున్నారో! 91**

**ప్రతిపదార్థం:** ఇంతకున్+మున్ను= ఇంతకుపూర్వం; ఎన్నఁడున్= ఎప్పుడును; ఏన్= నేను; ఇంతతడవు= ఇంతసేపు; వారిన్= వారిని (జననీజనకులను); పాసి= విడిచి; ఎందున్= ఎచటను; తడయను= ఆలసించలేదు; నేఁడు=

ఈనాడు; ఇంతవడి= ఇంతసేపు; మసలుటకున్= తిరుగాడటానికి, ఆలసించినందుకు; వారు= జననీజనకులు; ఎంత+పడిరొ= ఎంతటి ఆవేదన అనుభవించారో; ఏమి+ఐరొ= ఏమైనారో; ఎట్లు= ఏ రీతిగా; ఉన్నారొ= ఉన్నవారో కదా.

**తాత్పర్యం:** ఇంతకుపూర్వం నేను ఎప్పుడూ ఇంతసేపు జననీజనకుల నెడబాసి ఆలసించి ఉండలేదు. నేడు ఈ విధంగా నేను ఇటునటు తిరిగి ఆలసించటంవలన నా తలిదండ్రులు ఎంతటి ఆవేదన అనుభవిస్తున్నారో! ఏమైనారో! మరి ఏవిధంగా ఉన్నారో!

**ఆ. సంధ్యప్రొద్దు నన్ను జనని యెన్నఁడు నిల్లు।**
**వెడలనీదు; నేఁడు విపినభూమి**
**మధ్యరాత్రివేళ మసలుట కాయమ।**
**యెట్టిపాటు పడెనొ, యే నెఱుంగ. 92**

**ప్రతిపదార్థం:** సంధ్యప్రొద్దు= సంజవేళలో; నన్నున్= నన్ను; జనని= (నా)తల్లి; ఎన్నఁడున్= ఎప్పుడును; ఇల్లు= గృహం; వెడలనీదు= వీడనివ్వదు; నేఁడు= ఈరోజున; విపినభూమిమధ్యన్= అరణ్యసీమనడుమ; రాత్రివేళన్= రాత్రిసమయంలో; మసలుటకున్= ఆలసించటానికి; ఆయమ= ఆమె (నాజనని); ఎట్టి పాటుపడెనొ= ఎట్టి ఆవేదన పొందెనో; ఏను= నేను; ఎఱుంగన్= తెలియజాలనుకదా.

**తాత్పర్యం:** సాయంకాలంలో మా అమ్మ నన్ను ఇల్లు వదలి ఎచ్చటికీ పోనివ్వదు. ఈరోజున ఈ అడవిలో ఈ నిశాసమయంలో నేను ఇట్లా ఆలస్యంచేయటంవలన ఆమె ఎంతటి ఆవేదనకు లోనయిందో, నేను ఎఱుగజాలనుగదా!

**సీ. కౌఁగిట ననుఁ జిక్కఁ గదియించి శిరము మూ।**
**ర్కొంచును బాష్పముల్ గురియుచుండఁ**



**బట్టి 'మాయొడలులఁ బ్రాణంబులును నెల్ల।**
**యర్థముల్ నీవ; మాయన్న! నీవు**
**దెప్పగా సంసారతీరంబు సేరెద।**
**మని తలంచెదము సు మ్మన్న! యన్న!**
**కన్నులు లేని మాకన్నులుఁ గాళులు।**
**నీవ కదన్న! మా నిఖిలవంశ**

**ఆ. మును సముద్ధరించు మోపు నీ యదియ క।**
**దన్న!' యనుచు నిట్టు లగ్గలంపుఁ**
**బ్రేమ ననుదినంబుఁ బ్రేముడింతురు వృద్ధ।**
**లక్కటకట! యేమి యైరొ నేఁడు? 93**

**ప్రతిపదార్థం:** కౌఁగిటన్= ఆలింగనంలో; ననున్= నన్ను; చిక్కన్= గట్టిగా; కదియించి= కూర్చిపట్టి; శిరము= తల; మూర్కొంచును= ఆఘ్రాణిస్తూ; బాష్పముల్= కన్నీరు; కురియుచున్+ఉండన్= కారుతుండగా; పట్టి= అదిమి; మా+ఒడలులన్= మాశరీరంలో; ప్రాణంబులునున్= అసువులూ, ఎల్ల+అర్థముల్= సకల సంపదలూ, నీవు+అ= నీవే; మా+అన్న= మా నాయనా; నీవు= ఈవు; తెప్పగాన్= పడవగా; సంసారతీరంబు= సంసారపు సముద్రపుయొక్క గట్టు; చేరెదము= పొందుతాం; అని తలంచెదము, సుమ్ము+అన్న= అని భావిస్తాం నాయనా!; అన్న= మాతండ్రీ; కన్నులు లేని= నేత్రాలులేని; మా కన్నులున్= మా నేత్రాలు; కాళులున్= కాళ్లు; నీవు+అ= నీవే; కద+అన్న= కదా నాయనా; మా, నిఖిలవంశమును= మా సమస్తకులాన్ని; సముద్ధరించు= కాపాడే; మోపు= భారం; నీ+అది+అ, కద+అన్న= నీదే కదా నాయనా; అనుచున్= అని చెప్తుతూ; ఇట్టులు= ఈ రీతిగా; అగ్గలము+ప్రేమన్= (అగ్గలంపుఁబ్రేమన్) అధికమైన అనురాగంతో; అనుదినంబున్= ప్రతిరోజూ; ప్రేముడింతురు= వాత్సల్యం చూపుతారు;

వృద్ధులు= ముసలివాండ్రు, జననీజనకులు; అక్కట+అకట= (అక్కటకట) అయ్యోపాపం; నేఁడు= ఈ దినం; ఏమి+ఐరొ= ఏమైనారో కదా.

**తాత్పర్యం:** నన్ను కౌగిటిలో గదియించుకొని నాతల ఆఘ్రాణిస్తూ కన్నీరు కారుస్తూ నన్ను పట్టుకొని, 'నాయనా! మా శరీరాలలోని పంచప్రాణాలు నీవే సుమా; మా సిరిసంపదలు అన్నియు నీవే కదా నాయనా; నీవు తెప్పగా మేము ఈ సంసారసముద్రం దాటి తీరాన్ని చేరుకొనగలమని భావిస్తున్నాం కదరా, కుమారా! కన్నులు లేని మా కన్నులు, కాళ్ళు నీవే కదా! మావంశాన్నంతా ఉద్ధరించేవాడవు నీవే నని నీమీద ఆశలు పెట్టుకొనిఉన్నాంరా నాయనా!' అని పరిపరివిధాల నామీద అనురాగం వర్షించే ముసలివారు నా తలిదండ్రులు. ప్రతిదినం నాకై పరితపించేవారు - నేడు నేను ఇంతసేపు ఆలస్యం చేయటంవలన అక్కటకటా! నాకొరకు ఎంతటిఆవేదన అనుభవించారో కదా!

**విశేషం:** (1) "అన్న" - తెలుగుబాసలో అనురాగతరంగిత మైన తియ్యనిపదం. (2) వాత్సల్యాన్ని ఆలంకారికులు నవరసాలలో చేర్చకపోయినా, హృదయాళువు లైన కొందరు వాత్సల్యాన్ని రసంగా పరిగణించి ఆప్తవియోగం స్థాయిభావంగా పేర్కొన్నారు. తలిదండ్రుల యెడ పుత్రుడికి గల ఆర్ద్రభావం, కన్నులు లేక రాజ్యం కోలుపోయి ఏకైకసుతుడే తమ జీవితసర్వస్వ మని భావించే తలిదండ్రులవాత్సల్యం ఈ పద్యంలో హృదయంగమంగా కూర్చ బడటం- రసజ్ఞుల తల లూపించక పోదు. జగన్మిథ్య అని వాదించేవారుకాని, కామక్రోధ లోభమోహమదమాత్సర్య భూయిష్ఠమని ప్రపంచాన్ని నిరసించేవారుకాని జననీజనకుల వాత్సల్యంలో సత్యలేశం లేదని చెప్పనేరరుగదా. ఈ పద్యంలో ఎఱ్ఱన "వాత్సల్యమును రసస్థాయికి పెంచినట్లు భావించవచ్చును."

**ఆ. అడవి కేఁగుదెంచి యడరంగ ఫలమూల।**
**తతులు గొనుచు నేను దడయ కపుడ**



**పోవఁగాన నైతి; దైవోపహతి నింత।**
**చిక్కువడితి; నేమి సేయువాఁడ! 94**

**ప్రతిపదార్థం:** అడవికిన్= అరణ్యానికి; ఏఁగుదెంచి= వచ్చి; అడరంగన్= త్వరపడుతూ; ఫల, మూల, తతులు= పండ్లు, కందగడ్డలు మున్నగునవి; కొనుచున్= పరిగ్రహిస్తూ; ఏను= నేను; తడయక+అపుడు+అ= ఆలసింపక అప్పుడే; పోవన్+కానను+ ఐతిన్= పోలేకపోయాను; దైవ+ఉపహతిన్= విధిచేత దెబ్బతినటంచేత; ఇంత= ఇంతగా; చిక్కు+పడితిన్= ఇరుకులో పడ్డాను; ఏమి+చేయువాఁడన్= ఏమి చేయగలను.

**తాత్పర్యం:** అయ్యో! అరణ్యానికి వచ్చి పండ్లు కందమూలాలు మున్నగునవి సంగ్రహించుకొని ఆలసించక శీఘ్రంగా నేను మరలిపోయి ఆశ్రమం చేరిఉంటే ఎంత బాగుండేది! విధివిపరిపాకంచేత నేను ఇచ్చట చిక్కువడిపోయాను. కదా! ఇంకేమి చేయగలను?

**క. నా యున్నచో టెఱుంగక।**
**యా యాశ్రమవాసులైన యందఱ నతిదుః**
**ఖాయత్తుఁ డగుచు నడుగును।**
**మాయయ్య దలంకి మాటిమాటికి నింకన్. 95**

**ప్రతిపదార్థం:** మా+అయ్య= మా తండ్రి; నా+ఉన్నచోటు= నేను ఉన్నస్థలం; ఎఱుంగక= తెలియక; తలంకి= కలతచెంది; ఆ+ఆశ్రమవాసులు+ఐన= ఆ ఆశ్రమంలో నివసిస్తున్న; అందఱన్= అంతమందిని; అతిదుఃఖ+ఆయత్తుఁడు+అగుచున్= మిక్కుటమైన ఆవేదనతో కూడినవాడై; మాటిమాటికిన్= మరల మరల పలుమారులు; ఇంకన్= మరీమరీ; అడుగును= ప్రశ్నిస్తాడు.

**తాత్పర్యం:** నేను ఎచ్చట ఉన్నది మాతండ్రిగారికి తెలియదుకదా. ఆయన ఆశ్రమంలో ఉన్నవారందరిని పలుమారులు మిక్కుటమయ్యే ఆవేదనతో

నాయోగక్షేమాలనుగూర్చి ప్రశ్నిస్తూ ఉంటాడు. పాపం ఆ ఆశ్రమవాసులు మాత్రం ఏమని బదులు పలుకగలరు? వారికి నా ఉనికిపట్టులు తెలియవుకదా! ఇక మాతండ్రిగారి దుఃఖం తీరేది ఎట్లా?

**క. నావార్త వినక యింతకు।**
**నావృద్ధులు భిన్నహృదయులై ప్రాణంబుల్**
**పోవిడుతురు గా కచటికిఁ।**
**బోవం బనిగలదె యేనుఁ బుచ్చెద నసువుల్. 96**

**ప్రతిపదార్థం:** నావార్త= నన్నుగూర్చిన సమాచారం; వినక= ఆలకించక; ఇంతకున్= ఇప్పటికే; ఆ వృద్ధులు= ఆ ముసలివారు - నా జననీజనకులు; భిన్నహృదయులు+ఐ= పగిలినగుండెలు కలవారై; ప్రాణంబుల్, పోవిడుతురు+కాక= ప్రాణాలు విడిచి ఉండవచ్చును; అచటికిన్= ఆ చోటికి; పోవన్ పని కలదు+ఎ= కార్యం ఉన్నదా, ప్రయోజనం కలదా; ఏను= నేను; అసువుల్= ప్రాణాలను; పుచ్చెదన్= విడిచిపెట్టుతాను.

**తాత్పర్యం:** నా ఉనికిపట్టులగూర్చిన సమాచారం తెలియక, ముసలివారైన నా జననీజనకులు ఈపాటికే తమప్రాణాలను విడిచిఉంటారు. ఇక నేను ఆశ్రమానికి పోయినా ప్రయోజన మేముంటుంది? నేను నాప్రాణాలను వదలిపెడతాను.

### సత్యవంతుఁడు సావిత్రితోడ మరలి తనయాశ్రమంబునకు వచ్చుట
### (సం. 3-281-97)

**వ. అని బహుప్రకారంబులం బలవించి కన్నీరు నించిన, నక్కాంత దుఃఖాక్రాంత యగుచు నతని నాశ్వాసించి, నవమృణాళమృదులంబులగు భుజంబులం గౌఁగిలించియెగయ నెత్తిన, మెత్తన లేచి యతండు ధూళిధూసరితం బైన శరీరంబు దుడిచికొని గమనంబున కుత్సహించిన. 97**



**ప్రతిపదార్థం:** అని= అని తలపోసి; బహుప్రకారంబులన్= పలువిధాల; పలవించి= దుఃఖించి; కన్నీరు, నించినన్= కన్నీరు కార్చగా; ఆ+కాంత= సావిత్రి; దుఃఖ+ ఆక్రాంత+అగుచున్= విషాదంచేత అలముకొనబడినది ఔతూ; అతనిన్= ఆ సత్యవంతుడిని; ఆశ్వాసించి= ఓదార్చి; నవ, మృణాళ, మృదులంబులు+అగు= లేత తామరతూండ్లవలె మెత్తవైన; భుజంబులన్= బాహువులచేత; కౌఁగిలించి= ఆశ్లేషించి; ఎగయన్+ఎత్తినన్= లేవనెత్తిగా; మెత్తన లేచి= మెల్లగా నిలబడి; అతండు= సత్యవంతుడు; ధూళి, ధూసరితంబు+ఐన= దుమ్ముచేత ఆవరించబడిన; శరీరంబు= దేహాన్ని; తుడిచికొని= దుమ్ముపోయేటట్లు ఒత్తి విదుల్చుకొని; గమనంబునకున్= పయనానికి; ఉత్సహించినన్= పూనగా.

**తాత్పర్యం:** అని యోచించి, పలువిధాల దుఃఖించి కంటినీరు కార్చగా సావిత్రి విషాదంచేత అలముకొనబడిందై సత్యవంతుడిని అనునయించి, లేతతామరతూండ్లవలె మిక్కిలి సుకుమారాలైన బాహువులతో అతడిని ఆలింగనం చేసికొని లేవనెత్తింది. సత్యవంతుడు మెలమెల్లగా లేచి తనశరీరంమీద నున్న దుమ్ము దులుపుకొని ఆశ్రమానికి పోవటానికి ఉత్సహించాడు.

**క. ఫలభారము దుర్భర మని।**
**వెలఁది యచట నొక్కవృక్షవిటపంబున ని**
**మ్ముల గరడియ దగిలిచి యు।**
**జ్జ్వల పరశువుఁ గొనుచు మృదుల సంభ్రమలీలన్. 98**

**ప్రతిపదార్థం:** ఫలభారము= పండ్లయొక్కబరువు; దుర్భరము+అని= మోయటానికి అలవికాదు అని తలపోసి; వెలఁది= వనిత సావిత్రి; అచటన్= అచటనున్న; ఒక్క= ఒక; వృక్షవిటపంబునన్= చెట్టుకొమ్మయందు; ఇమ్ములన్= ఉపాయంతో; గరడియ= బుట్ట; తగిలిచి= వ్రేలాడగట్టి;

ఉత్+జ్వల, పరశువున్= ప్రకాశించే (మిలమిలలాడే) గండ్ర గొడ్డలిని; కొనుచున్= పరిగ్రహిస్తూ; మృదులసంభ్రమలీలన్= మెత్తనైన తత్తరపాటుతో.

**తాత్పర్యం:** పండ్లబుట్టబరువు మోయటం కష్టమని భావించి సావిత్రి ఉపాయంచొప్పున ఆ పండ్లబుట్టను అరణ్యంలోని ఒక చెట్టుకొమ్మకు వ్రేలాడదీసింది. మిలమిలలాడే గండ్రగొడ్డలిని తనవెంట తీసికొని మెత్తని తొట్రుపాటుతో.

**విశేషం:** (1) సావిత్రి వహించవలసిన భారాలు రెండు. ఒకటి అలసిఉన్న జననీజనకులకై ఆవేదన చెందిఉన్న సత్యవంతుడిని ఆశ్రమం చేర్చటం. రెండు - సత్యవంతుడు కోసిన పండ్లు. ఉపాయంగా ఆమె పండ్లగంపభారాన్ని తప్పించుకోగలిగింది. ఆ పండ్లబుట్టను ఒక చెట్టుకొమ్మకు తగిలించింది. అనగా దినమెల్ల శ్రమించి సత్యవంతుడు సంపాదించిన ఆ పండ్లను విడిచి పెట్టవలసివచ్చింది. అది మానవజీవితంలోని విచిత్రవిరోధాభాసం. (2) గండ్రగొడ్డలి బరువు తక్కువ. అంతేగాక మార్గమధ్యంలో దాని అవసరం కలుగవచ్చును. అందుచేత దానిని వెంట తీసికొని వెళ్ళింది.

**వ. జీవితేశ్వరువామబాహువు నిజవామభుజంబుపయి నిడికొని దక్షిణహస్తం బున నతని గ్రుచ్చి కౌఁగిలించి మందగమనంబున నాశ్రమదేశంబునకు మగిడె; నంత నక్కడ. 99**

**ప్రతిపదార్థం:** జీవిత+ఈశ్వరువామబాహువు= భర్త అయిన సత్యవంతుడి యొక్క ఎడమచేయి; నిజ, వామభుజంబు= తనదైన ఎడమచేయి; పయిన్+ ఇడికొని= పైనపెట్టుకొని; దక్షిణహస్తంబునన్= కుడిచేతితో; అతనిన్= సత్యవంతుడిని; గ్రుచ్చి+ కౌఁగిలించి= గాటంగా పట్టి ఆలింగనం చేసికొని; మంద, గమనంబునన్= మెల్లని నడకతో; ఆశ్రమదేశంబునకున్= విడిదితోటకు; మగిడెన్= మరలివెళ్ళింది; అంతన్= అటు తర్వాత; అక్కడన్= ఆస్థలంలో అనగా ఆ ఆశ్రమంలో.



**తాత్పర్యం:** (సావిత్రి) తనభర్తఅయిన సత్యవంతుడి ఎడమచేయి తన ఎడమబుజంపై ఉంచుకొని; కుడిచేతితో అతడిని ఆలింగనం చేసికొని మెలమెల్లగా నడుస్తూ ఆశ్రమం ఉన్నచోటికి వెడలసాగింది. అక్కడ

**ఉ. కన్నులు వచ్చి యెల్లెడలుఁ గన్గొని వృద్ధనరేంద్రుఁ డాత్మకుం**
**గన్నులుఁ బోలె నైన తన గాదిలిపుత్త్రుఁడు గాననంబులో**
**నెన్నఁడు లేని యింత తడ వేటికిఁ జిక్కెనొ యంచు నార్తితోఁ**
**గన్నులు లేనియ ట్లతఁడుఁ గానక యేడ్చె సతీసమేతుఁ డై. 100**

**ప్రతిపదార్థం:** కన్నులు వచ్చి= కన్నులు వచ్చి (ఇంతవరకు ద్యుమత్సేనుడు గ్రుడ్డివాడు. అతడికి ఆకస్మికంగా దృష్టి వచ్చింది. సావిత్రికి యముడు అనుగ్రహించిన వరం చొప్పున); ఎల్ల+ఎడలున్= అన్నిచోటులును; కన్గొని= చూచి; వృద్ధ, నర+ఇంద్రుఁడు= ముసలిరాజు- ద్యుమత్సేనుడు; ఆత్మకున్= తన అంతరాత్మకు; కన్నులున్+పోలెన్+ఐన= నేత్రాలు వలెనే ఉన్నటువంటి; తన, గాదిలి, పుత్త్రుఁడు= తన అనుగుకొడుకు సత్యవంతుడు; కాననంబులోన్= అరణ్యంలో; ఎన్నఁడున్‌లేని= ఎప్పుడును జరుగని; ఇంత, తడవు= ఇంతసేపు; ఏటికిన్= ఎందుకు; చిక్కెనొ= ఆలసించెనో; అంచున్= అని తలపోస్తూ; ఆర్తితోన్= దైన్యంతో; కన్నులులేని+అట్లు= నేత్రాలు లేని మాదిరిగా; అతఁడు= ద్యుమత్సేనుడు; కానక= కనుపించక (ఇపుడు ఆతనికి ప్రపంచమంతా కనిపిస్తున్నా - కొడుకు కన్పించకపోవటంచేత కన్పించనట్లుగనే ఎంచి); సతీసమేతుఁడు+ఐ= భార్యతో కూడినవాడై; ఏడ్చెన్= విలపించాడు.

**తాత్పర్యం:** ద్యుమత్సేనుడికి ఆకస్మికంగా గ్రుడ్డితనం పోయి దృష్టి వచ్చింది. ఇది ఆశ్చర్యకరమైన అంశం. కాని ఇంతవరకు తనఆత్మకు కన్నులవలె ఉన్నటువంటి కొడుకు సత్యవంతుడు కన్పించలేదు. ఆ వృద్ధభూపతి నల్గడలు పరికించి చూచాడు. కన్నులు వచ్చిన సంతోషపారవశ్యంతోపాటు ఆ క్షణంలోనే ఎప్పుడో అరణ్యంలోకి వెళ్ళిన కొడుకు ఇంతవరకు రాయే. ఆత డేమయ్యాడో

అనే విషాదం అతడిని ఆవరించింది. కన్నులు వచ్చికూడ ద్యుమత్సేనుడు కన్నులు లేనివాడివలె భార్యతో కలిసి విలపించాడు.

**విశేషం:** ఇచ్చట కథ ఒకవింతమలుపు తిరిగింది. ఆకస్మికంగా ఆశ్చర్యకరంగా గ్రుడ్డిరాజు ద్యుమత్సేనుడికి దృష్టి వచ్చింది. ఆతడు నల్గడలు కలయజూచాడు. క్రొంగ్రొత్తప్రపంచం అత్యద్భుతంగా అతడికి గోచరించింది. కాని ఆతడు మొట్టమొదట చూడగోరేది ఆతని తనయుడైన సత్యవంతుడినేకదా. ఏడి ఆ సత్యవంతుడు? ఏమైనాడు? అడవికి పోయి చాలసేపు అయిందే?! వృద్ధభూపతికి కన్నులు వచ్చిన ఆనందంకంటె కొడుకు కన్పించకపోవటంచేత కన్నులు లేకపోవటమే మేలు అనిపించినది. అది మానవజీవితంలో నాటకీయమైన విచిత్రవిరోధాభాసం. మనిషిబ్రదుకు వెలుగునీడల వింతమెలిక. అప్పుడు ఆ తండ్రి మానసికపరిస్థితి సహృదయహృదయైక వేద్యం. అల మతి విస్తరేణ.

**తరలము**

> **కొడుకు నిందును నందు రోయుచుఁ గోరి ప్రేమభరంబునం**
> **గొడుకుసద్గుణకోటి యెల్లను గోటిభంగుల నోలి ను**
> **గ్గడన సేయుచు సత్యవంతునిఁ గానరే మునులార! యే**
> **యడవిలోపల నంచు హాసుత! యంచు ధైర్యము డించుచున్. 101**

**ప్రతిపదార్థం:** కొడుకున్= పుత్రుడిని (సత్యవంతుడిని); ఇందున్+అందున్= ఇచటను అచటను- అన్నిచోటులలో; రోయుచున్= వెదకుతూ; కోరి= ప్రీతితో పూని; ప్రేమభరంబునన్= వాత్సల్యాతిశయంచేత; కొడుకు, సత్+గుణ, కోటి+ఎల్లను= పుత్రుడియొక్క మంచి గుణగణాలనన్నింటిని; కోటిభంగులన్= పెక్కురీతుల; ఓలిన్= వరుసగా; ఉగ్గడన+చేయుచున్= గట్టిగా వల్లిస్తూ; మునులార!= ఋషులార!; ఏ+అడవిలోపలన్= ఏ అరణ్యంలోనైనా; సత్యవంతునిన్= సత్యవంతుడిని; కానరే= చూడలేదా; అంచున్= అని అడుగుతూ; హా, సుత!= అయ్యో కొడుకా!; అంచున్= అంటూ; ధైర్యము= చిత్తస్థైర్యం; డించుచున్= కోలుపోతూ.



**తాత్పర్యం:** ద్యుమత్సేనుడు తనకొడుకు సత్యవంతుడిని అన్వేషించసాగాడు. అతడు వాత్సల్యాతిశయంచొప్పున తనకొడుకు గుణగణాలనన్నిటిని వరుసగా వల్లెవేస్తూ పెక్కుభంగుల అరుస్తూ అరణ్యంలో తిరుగుతూ 'ఓ ఋషులార! మీరు ఎక్కడనైనా సత్యవంతుడిని చూచారా? అని అడుగుతూ 'అయ్యో! కొడుకా! ఎక్కడ ఉంటివిరా' అని ధైర్యం కోలుపోయి విలపిస్తూ (ఉన్నాడు).

**విశేషం:** వృత్త లక్షణానికి చూడు: అరణ్య : 4.402 విశేషాంశం.

**వ.** **ఉన్నంతఁ, దదాశ్రమవాసులైన మునులందఱు నతనిం బొదివికొని తదీయనయనలాభంబునకు విస్మయం బందుచు నుచితవాక్యంబుల నతని నాశ్వాసించుచుండిరి; తదనంతరంబ యొక్క ముహూర్తంబునకు సావిత్రీసహితుండై చిత్రాశ్వుండు సనుదెంచిన నావృద్ధదంపతు లత్యంతహర్షంబున నతనిం గౌఁగిలించుకొని మూర్ధాఘ్రాణంబు సేసిరి; మునులు గరంబు సంతసిల్లి; రప్పు డారాజర్షి ముఖ్యుండు పుత్త్రునిం జూచి 'యయ్యా! యి ట్లేల వనంబున మసలి?' తని యడిగిన నతండు దాను జని పండ్లు గోయుటయును గాష్ఠదళనంబు సేయునెడం దల యేరు గదిరి నిలువనోపక విశ్రమించుటయుఁ దన్నొక పురుషుండు గలలోన నిగ్రహించుటయుం జెప్పునెడ సావిత్రి మామ కిట్లనియె. 102**

**ప్రతిపదార్థం:** (ఆ రీతిగా ద్యుమత్సేనుడు); ఉన్నంతన్= ఉండగా, విలపిస్తుండగా; తద్+ఆశ్రమవాసులు+ఐన= ఆ ఆశ్రమంలో నివసించేవారు అయిన; మునులు+ అందఱున్= ఋషులు ఎల్లరు; అతనిన్= ద్యుమత్సేనుడిని; పొదివికొని= చుట్టూచేరి; తదీయ, నయన, లాభంబునకున్= ఆతనికి కన్నులు లభించినందుకు; విస్మయంబు+ అందుచున్= అచ్చెరువు చెందుతూ; ఉచితవాక్యంబులన్= తగినమాటలతో; అతనిన్= ద్యుమత్సేనుడిని; ఆశ్వాసించుచున్+ఉండిరి= అనునయిస్తూ ఉన్నారు; తద్+ అనంతరంబు+అ= అటుపిమ్మట; ఒక్క, ముహూర్తంబునకున్= రెండుగడియల కాలానికి; సావిత్రీసహితుండు+ఐ= సావిత్రితో కూడినవాడై;

చిత్రాశ్వుండు= సత్యవంతుడు; చనుదెంచినన్= అరుగుదెంచగా; ఆవృద్ధదంపతులు= ఆ ముసలి భార్యాభర్తలు; ద్యుమత్సేనుడు మరియు అతని భార్యయును; అత్యంతహర్షంబునన్= మిక్కిలి ఆనందంతో; అతనిన్= అతడిని, సత్యవంతుడిని; కౌఁగిలించుకొని= ఆలింగనం చేసికొని; మూర్ధ+ఆఘ్రాణంబు+చేసిరి= తలను వాసన చూచారు (మూర్కొన్నారు); మునులు= ఋషులు; కరంబు= మిక్కిలి; సంతసిల్లిరి= సంతోషించారు; అప్పుడు= ఆసమయంలో; ఆరాజ+ఋషి+ముఖ్యుడు= రాజర్షులలో శ్రేష్ఠుడు, ద్యుమత్సేనుడు; పుత్త్రునిన్+చూచి= కొడుకును కాంచి; అయ్యా!= నాయనా!; ఇట్లు+ఏల= ఈరీతిగా ఎందుకు; వనంబునన్= అరణ్యంలో; మసలితి(వి)= ఆలస్యంచేశావు; అని అడిగినన్= అని ప్రశ్నించగా; అతండు= సత్యవంతుడు; తాను= తాను; చని= వెడలి; పండ్లు= ఫలాలు; కోయుటయును= త్రెంచటమున్నూ; (పిదప) కాష్ఠదళనంబు+చేయు+ఎడన్= కట్టెలు నరకేటప్పుడు; తల+ఏరు= తలనొప్పి; కదిరి= అలముకొని; నిలువన్+ఓపక= నిలువజాలక; విశ్రమించుటయున్= విశ్రాంతి తీసికొనటమున్నూ; తన్నున్= తనను; ఒక= ఒక; పురుషుండు= మగవాడు (విశిష్టవ్యక్తి); కలలోనన్= స్వప్నంలో; నిగ్రహించు టయున్= కైవసం చేసికొనటమున్నూ; చెప్పు+ఎడన్= చేప్పేటప్పుడు; సావిత్రి; మామకున్= భర్తతండ్రికి, ద్యుమత్సేనుడికి; ఇట్లు+అనియె= ఈవిధంగా చెప్పింది.

**తాత్పర్యం:** ద్యుమత్సేనుడు పుత్రుడిని కానక విషాదవిహ్వాలుడై ఉన్నాడు. ఆ ఆశ్రమవాసులు అయిన ఋషులు ఒకవంక అంధరాజుకు దృష్టి ఆకస్మికంగా వచ్చినందుకు ఆశ్చర్యపడ్డారు. మరొక వంక పుత్రుడిఉనికిపట్టులు తెలియజాలక దుఃఖిస్తున్న అతడిని అనునయించసాగారు. ఇంతలో రెండుగడియలు గడువగానే సావిత్రీసహితుడై సత్యవంతుడు ఆశ్రమాన్ని చేరాడు. ఆ ముసలిదంపతులు (ద్యుమత్సేనుడును అతనిభార్యయు) పుత్రుడిని ఆలింగనం చేసికొని తల నిమిరి వాసన చూచి వాత్సల్యం వర్షించారు. మునులు మిక్కిలి సంతోషించారు. అప్పుడు ఆ రాజర్షి ద్యుమత్సేనుడు -



'నాయనా! అరణ్యంలో నీ వెందుకు ఇంతఆలస్యం చేశావు?' అని ప్రశ్నించాడు. సత్యవంతుడు తాను పండ్లను కోయటం, తదుపరి కట్టెలు కొట్టేటప్పుడు తలనొప్పి అలముకొనటంచేత తాను సొలసి విశ్రమించటం, తనకు స్వప్నంలో ఒక విశిష్టవ్యక్తి కన్పించి నిగ్రహించటం తెలుపుతుండగా, సావిత్రి అందుకొని ద్యుమత్సేనుడితో ఇట్లా వచించింది.

**విశేషం:** (1) ముహూర్తం: రెండుగడియల కాలం. నేటి పరిభాషలో చెప్పవలెనంటే (80) ఎనుబదినిముసాల కాలం.

**సీ. 'ఈ రాజసుతునకు నిద్దినంబున మర।**
**ణం బని మును చెప్పె నారదుండు;**
**మునినాథువచనం బమోఘంబు గావున।**
**నేమఱ కేను నేఁ డితనితోడ**
**నడవికి నేఁగితి; నచట నీతఁడు సుప్తుఁ।**
**డైయున్నయెడ వచ్చె నంతకుండు;**
**వచ్చి యివ్విభుని జీవముఁ గొనిపోవఁగ।**
**వెనుకన చని యేను వివిధభంగి**

**ఆ. సత్యధర్మఫణితి సంస్తుతించుటయుఁ గృ।**
**పార్ద్రచిత్తుఁ డగుచు నజ్జముండు**
**నాకు నెమ్మి నొసఁగె నాలుగువరములం।**
**దొకట నితఁడు జీవయుక్తుఁ డయ్యె.** **103**

**ప్రతిపదార్థం:** ఈ రాజసుతునకున్= ఈ రాజపుత్రుడికి - సత్యవంతుడికి; ఈ+దినంబునన్= ఈ రోజున; మరణంబు+అని= మృత్యువు కలుగుతుం దని; నారదుండు= నారదుడు; మును= పూర్వం; చెప్పెన్= వచించాడు; మునినాథు, వచనంబు= ఋషులలో శ్రేష్ఠుడైననారదుడియొక్కమాట; అమోఘంబు= బీరువోవనట్టిది; కావునన్= కాబట్టి; ఏను= నేను; ఏమఱక=

ప్రమత్తత వహించక; నేఁడు= ఈరోజున; ఇతనితోడన్= సత్యవంతుడితో; అడవికిన్= అరణ్యానికి; ఏఁగితిన్= వెళ్ళాను; అచటన్= అరణ్యంలో; ఈతఁడు= సత్యవంతుడు; సుప్తుఁడు+ఐ= నిదురించినవాడై; ఉన్న+ఎడన్= ఉన్నతరుణంలో; అంతకుండు= యముడు; వచ్చెన్= వచ్చాడు; వచ్చి= అరుదెంచి; ఈ+విభుని= ఈ విభుడియొక్క (అనగా) సత్యవంతుడియొక్క; జీవమున్= ప్రాణాన్ని; కొనిపోవఁగన్= తీసికొని పోతూ ఉండగా; వెనుకన్+అ= వెనుకనే; చని= వెళ్లి; ఏను= నేను; వివిధభంగిన్= పెక్కురీతుల; సత్య, ధర్మ, ఫణితిన్= సత్యం, ధర్మం, అమరిఉండే తీరులో; సంస్తుతించుటయున్= పొగడటమున్నూ; కృపా+ ఆర్ద్ర, చిత్తుఁడు+అగుచున్= దయచేత తడిసిన మనస్సు కలవాడు ఔతూ; ఆ+జముండు= ఆ యముడు; నాకున్= నాకు; నెమ్మిన్= ప్రీతితో; నాలుగువరములు= నాల్గువరాలు; ఒసఁగెన్= ఇచ్చాడు; అందున్=వానిలో; ఒకటన్= ఒక వరంచేత; ఇతఁడు= సత్యవంతుడు; జీవయుక్తుఁడు= ప్రాణంతో కూడినవాడు; అయ్యెన్= అయ్యాడు.

**తాత్పర్యం:** ఈ రాకుమారుడైన సత్యవంతుడికి నేడు మరణకాల మని మున్ను నారదమహర్షి నుడివిఉన్నాడు. ఆ మహర్షివచనం అమోఘం కాబట్టి నేను ఈనాడు ఏమాత్రమూ ఏమరక సత్యవంతుడిని విడనాడక అతడితో పాటు అరణ్యానికి వెళ్ళాను. సత్యవంతుడు అలసట చెంది నిదురించిన సమయంలో యమధర్మరాజు విచ్చేసి, ఈ రాకుమారుడి ప్రాణాలు కొనిపోయాడు. అంతట నేనూ యముడిని వెంబడించాను. సత్యం, ధర్మం అమరియుండేరీతిగా ఆతడిని ప్రస్తుతించాను. యమధర్మరాజు కరుణించి నాకు నాలుగువరాలు ప్రసాదించాడు. వాటిలో ఒకవరంమూలంగా రాకుమారుడు సత్యవంతుడు పునర్జీవితుడు అయ్యాడు.

**వ. మఱియు నొక్కవరంబు భవదీయనయనోన్మేషణకారణం బయ్యెఁ; దక్కిన వరద్వయంబున మీకు వైరి హృతరాజ్యసంప్రాప్తియు, మదీయ జనకునకుఁ బుత్త్రశతలబ్ధియు నగు' నని చెప్పిన నయ్యిద్దఱుఁ బరమానంద కందళితశీతల శిశిరహృదయులై కోడలి కి ట్లనిరి. 104**



**ప్రతిపదార్థం:** మఱియున్= వెండియు; ఒక్క, వరంబు= ఒకవరం; భవదీయనయన+ఉన్మేషణ, కారణంబు= మీనేత్రాలు విప్పారటానికి మూలం; అయ్యెన్= అయింది; తక్కిన= మిగిలిన; వరద్వయంబునన్= వరాలజంట వలన; మీకున్= మీకు; వైరి, హృత, రాజ్య, సంప్రాప్తియున్= శత్రువులచేత అపహరించబడిన రాజ్యం తిరిగి ప్రాప్తించటమున్నూ; మదీయజనకునకున్= నాతండ్రికి; పుత్త్ర, శత, లబ్ధియున్= కొడుకులు నూర్గురు కలగటమున్నూ; అగున్= కలుగుతాయి; అని చెప్పినన్= అని వచించగా; ఆ+ఇద్దఱున్= (ద్యుమత్సేనదంపతులు); పరమ+ఆనంద, కందళిత, శీతల, శిశిర, హృదయులు+ఐ= మిక్కుటమైన సంతోషం చిగురొత్తటంచేత చందనంవలె చల్లని డెందములు కలవారలై; కోడలికిన్= కొడుకుభార్యకు, స్నుషకు; ఇట్లు+అనిరి= ఈవిధంగా పలికారు.

**తాత్పర్యం:** అంతేకాక ఇంకొక వరం మీకు కనులు రావటానికి హేతువు అయింది. ఇంక మిగిలిన రెండువరాలు మీకు శత్రువులచేత అపహరించబడిన రాజ్యం తిరిగి లభించటం, నా తండ్రికి వందమంది కొడుకులు పుట్టటం' అని సావిత్రి వివరించింది. ఆ ద్యుమత్సేనదంపతులు ఇరువురును మిక్కుటమైన ఆనందంతో చందనంవలె చల్లనైన హృదయాలు కలవారు అయి, కోడలైన సావిత్రితో ఇట్లా పలికారు.

**క. 'ఆపత్సముద్రమగ్నం।**
**బై పోయెడు నస్మదన్వయము పెంపెసఁగం**
**దేప యయి కడవఁ బెట్టితి;।**
**నీ పుణ్యచరిత్ర కీర్తనీయము తల్లీ!' 105**

**ప్రతిపదార్థం:** తల్లీ= అమ్మా సావిత్రీ!; ఆపత్సముద్రమగ్నంబు+ఐ= విపత్తు అనే సాగరంలో మునిగినట్టిదై; పోయెడు= నశించే; అస్మత్+అన్వయము= మా వంశం; పెంపు+ఎసఁగన్= అభివృద్ధిచెందేటట్లుగా; తేప+అయి= తెప్పవు అయి; కడవన్+ పెట్టితి(వి)= దాటించావు; నీపుణ్యచరిత్ర= సుకృతంతో కూడిన నీ జీవితవృత్తం; కీర్తనీయము= ప్రశంసించతగింది.

**తాత్పర్యం:** 'తల్లీ, సావిత్రీ! నీజీవితచరిత్ర మిక్కిలి ప్రశంసించతగినట్టిది. ఆపత్సముద్రంలో మునిగి నశించిపోయే మావంశాన్ని తెప్పవయి గట్టు చేర్చి కాపాడి మాకు అభ్యుదయం చేకూర్చావు.

**వ. అని యభినందించి; రప్పు డయ్యిందువదనను మునివరు లందఱుం బ్రశంసావచనంబుల నుపలాలించి, వారల దీవించి నిజగృహంబులకుం జని; రంతం గతిపయదినంబులకు. 106**

**ప్రతిపదార్థం:** అని= అని పలికి; అభినందించిరి= ధన్యవాదాలు అర్పించారు; అప్పుడు= ఆ సమయంలో; ఆ+ఇందువదనను= ఆ చంద్రముఖిని, సావిత్రిని; మునివరులు+అందఱున్= ఋషిశ్రేష్ఠులు ఎల్లరును; ప్రశంసావచనంబులన్= మెచ్చుకోలుమాటలతో; ఉపలాలించి= బుజ్జగించి; వారలన్= వారలను (ద్యుమత్సేనదంపతులను సావిత్రిని సత్యవంతుడిని); దీవించి= ఆశీర్వదించి; నిజగృహంబులకున్= తమ ఇండ్లకు; చనిరి= వెళ్ళారు; అంతన్= అటుపిమ్మట; కతిపయ, దినంబులకున్= కొన్నినాళ్లకు.

**తాత్పర్యం:** అని పలికి సావిత్రిని అభినందించారు. ఆ ఆశ్రమంలోని మునివరేణ్యులు అందరును చంద్రముఖి సావిత్రిని పొగడి బుజ్జగించి, వారిని ఆశీర్వదించి తమఇండ్లకు వెళ్ళారు. అంతట కొన్నినాళ్ళకు.

**సీ. ఆ సాళ్వభూవిభునాప్తమంత్రులు మూల।**
**భృత్యులుఁ బౌరులుఁ బృథివిఁ గలుగు**
**పెద్దలుఁ గూడి సంప్రీతి నాతని పాలి।**
**కేతెంచి వినయసమేతు లగుచు**
**'నవనీశ! నీ శత్రుఁ డాత్మీయమిత్రభే।**
**దనమునఁ జేసి బాంధవసహాయ**
**సహితుఁ డై మృతిఁబొందె; సకలజనంబులు।**
**నేకచిత్తంబున నిపుడు నిన్నుఁ**



**ఆ. బ్రకటరాజ్యపదవిఁ బట్టంబు గట్టంగ।**
**వచ్చినారు; నిఖిలవసుధయందు**
**విస్తరిల్లె నీదువిజయఘోషము; భద్ర।**
**గజము నెక్కివేగ కదలు మింక. 107**

**ప్రతిపదార్థం:** ఆ సాళ్వభూవిభు+ఆప్తమంత్రులున్= ఆసాళ్వదేశరాజుయొక్క ఆంతరంగిక సచివులును; మూలభృత్యులున్= ప్రధాన సేవకులు; పౌరులున్= పురజనులు; పృథివిన్= భూమియందు; కలుగు= ఉన్న; పెద్దలున్= విశిష్టవ్యక్తులును; కూడి= కలసి; సంప్రీతిన్= మిక్కిలి సంతోషంతో; ఆతనిపాలికిన్= ఆ ద్యుమత్సేనుడికడకు; ఏతెంచి= వచ్చి; వినయ, సమేతులు+అగుచున్= అణకువతో కూడిన వారు ఔతూ; అవనీశ!= రాజా, ఓ ద్యుమత్సేనా!; నీశత్రుఁడు= నీవిరోధి; ఆత్మీయ మిత్రభేదనమునన్+చేసి= తనయొక్కహితులలో ఏర్పడిన స్పర్థలవలన; బాంధవ, సహాయ, సహితుఁ డు+ఐ= చుట్టాలతో సాయంచేసేవారితో కూడినవాడై; మృతిన్+ పొందెన్= మరణించాడు; సకల, జనంబులున్= అందరుప్రజలును; ఏకచిత్తం బునన్= ఒకేమనస్సుతో; ఇపుడు= ఈ సమయంలో; నిన్నున్= నిన్ను; ప్రకట, రాజ్య, పదవిన్= వ్యక్తమైన రాజ్యస్థానంలో (అనగా సింహాసనంమీద రాజుగా); పట్టంబు కట్టంగన్= పట్టాభిషేకం చేయుటకై; వచ్చినారు= అరుదెంచారు; నిఖిల, వసుధయందున్= సమస్తభూమియందు; నీదు= నీయొక్క; విజయఘోషము= జయాన్నిగూర్చిన చాటింపు ప్రకటన; విస్తరిల్లెన్= వ్యాపించింది; ఇంకన్= ఇక; భద్రగజమున్+ఎక్కి= పట్టపుటేనుగును అధిరోహించి; వేగ= శీఘ్రంగా; కదలుము= బయలుదేరుము.

**తాత్పర్యం:** ఆ సాళ్వరాజుగారి ఆంతరంగికులు అయిన సచివులు, ప్రధానసేవకులు, పురజనులు, పెద్దలు అందరును కలిసి సంతోషంతో ద్యుమత్సేనునికడకు వచ్చి అణకువతో ఇట్లు విన్నవించారు. 'ఓ మహారాజా!

నీ శత్రువు ఆత్మీయులు పన్నినకుట్రలవలన అంతశ్ఛిద్రాలకు లోనయి, తనచుట్టాలు సహవ్రతులు మున్నగువారందరితో పాటు మరణించాడు. ప్రజలు అందరు ఏకగ్రీవంగా నీకు ఇపుడు పట్టం కట్టి నిన్ను సింహాసనాన్ని ఎక్కించటానికి ఇక్కడకు అరుదెంచారు. నీవిజయసమాచారం పృథివి ఎల్లెడల చాట బడింది. ఇంక పట్టపుటేనుగు నెక్కి రాజధానికి బయలుదేరుము.

**క. ప్రాకటతపోబలంబున।**
**నాకలితవిలోచనుండ వై యున్న నినున్**
**లోకేశ! చూడఁగంటిమి;।**
**మా కన్నులు చల్లనయ్యె మాభాగ్యమునన్.' 108**

**ప్రతిపదార్థం:** లోక+ఈశ!= మహారాజా!; ప్రాకట, తపస్+బలంబునన్= వ్యక్తమైన తపస్సుయొక్క మహిమచేత; ఆకలితవిలోచనుండవు+ఐ= కూడిన కనులు కలవాడవై; ఉన్న= ఉన్నటువంటి; నినున్= నిన్ను, ఓ ద్యుమత్సేనా; చూడన్+కంటిమి= చూడగలిగాం; మాభాగ్యమునన్= మాఅదృష్టంచేత; మాకన్నులు= మానేత్రాలు; చల్లన+అయ్యెన్= చల్ల బడ్డాయి.

**తాత్పర్యం:** లోకానికి అధిపతి వైన ఓ ద్యుమత్సేనమహారాజా! నీ తపోమహిమ గొప్పది. నీ తపశ్శక్తివలన నీకు దృష్టి లభించింది. కన్నులు లభించిన నిన్ను మేము చూడగలగటం మా అదృష్టం. మా కన్నులు చల్లబడ్డాయి.'

**వ. అనినం బ్రహృష్టహృదయుండై ద్యుమత్సేనుండు నాక్షణంబ తదాశ్రమవాసు లయిన మునుల నామంత్రణంబు సేసి, కొడుకుం దానును గజారూఢుఁడై బహుళచతురంగసేనాసంకులగమనంబునం బురం బునకుఁ జని సకలమహీరాజ్యంబునుగైకొని, చిత్రాశ్వునకుం బ్రథిత యౌవరాజ్యపట్టం బొసంగి పరమైశ్వర్యధుర్యుం డయ్యె; నిత్తెఱంగున. 109**

**ప్రతిపదార్థం:** అనినన్= అని చెప్పిన; ద్యుమత్సేనుండు= ద్యుమత్సేనుడు; ప్రహృష్టహృదయుండు+ఐ= సంతోషం చెందిన డెందం కలవాడై; ఆ



క్షణంబు+అ= ఆ క్షణంలోనే; తద్+ఆశ్రమవాసులు+అయిన= ఆ ఆశ్రమంలో నివసించేవారు అయిన; మునులన్= ఋషులను; ఆమంత్రణంబు+చేసి= వీడ్కొని; కొడుకున్= పుత్రుడును, సత్యవంతుడును; తానును= తాను; గజ+ఆరూఢుఁడు+ఐ= ఏనుగును అధిరోహించినవాడై; బహుళ, చతురంగ, సేనా, సంకుల, గమనంబునన్= విరివిఅయిన నాలుగు దళాల సేనల కోలాహలంతో కూడిన ప్రయాణంచేత; పురంబునకున్= పట్టణానికి, రాజధానికి; చని= వెడలి; సకలమహీరాజ్యంబును= సమస్తమైన భూమి ప్రభుత్వాన్ని; కైకొని= స్వీకరించి; చిత్రాశ్వునకున్= సత్యవంతుడికి; ప్రథిత, యౌవరాజ్య పట్టంబు= పేరు కెక్కిన యువరాజపదవి; ఒసంగి= ఇచ్చి; పరమ+ఐశ్వర్య+ధుర్యుండు= గొప్ప సంపద వహించినవాడు; అయ్యెన్= అయ్యాడు; ఈ+తెఱంగునన్= ఈరీతిగా.

**తాత్పర్యం:** అని చెప్పగా, సంతుష్టి చెందిన హృదయం కలవాడై, ఆక్షణంలోనే ద్యుమత్సేనుడు ఆ ఆశ్రమంలోని ఋషులకు సగౌరవంగా వీడ్కోలుచెప్పి తానూ సత్యవంతుడూ ఏనుగునెక్కి విస్తరించిన నాలుగుదళాలతో కూడిన సేనలకోలాహలంతో ప్రయాణం చేసి రాజధాని నగరానికి చేరి పట్టాభిషిక్తుడయ్యాడు. సత్యవంతుడు యువరాజు అయ్యాడు. ఈ విధంగా ద్యుమత్సేనుడు గొప్పఐశ్వర్యాన్ని వహించాడు. ఈ విధంగా.

**క. తన మగని నత్తమామల।**
**జననీజనకులను దన్ను సకలంబును దా**
**ఘనముగ సముద్ధరించెను।**
**జనవర! సావిత్రిధర్మచరితము కంటే! 110**

**ప్రతిపదార్థం:** జనవర!= రాజా, ఓ ధర్మరాజా! తనమగనిన్= తనభర్తను; అత్తమామలన్= అత్తను మామను; జననీజనకులను= తల్లిని తండ్రిని; తన్నున్= తనను; సకలంబును= సమస్తాన్నీ; తాన్= తాను; ఘనముగన్=

గొప్పగా; సమ్+ఉద్ధరించెను= అభ్యుదయం కలిగేటట్లు చేసింది; సావిత్రిధర్మ చరితము= సావిత్రిజీవితకథ ధర్మంతో నిండినట్టిది; కంటే!= అరసితివి కదా!

**తాత్పర్యం:** ఓ ధర్మరాజా! తనభర్తను, అత్తమామలను, తలిదండ్రులను, తనను, సమస్తాన్నీ ఉద్ధరించిన సావిత్రి జీవితచరిత్ర ధర్మంతో కూడినట్టిది అనుశీలించావు కదా!

* * *